
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 04-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 155
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

పాలస్తీనాకు మద్దతివ్వడమే నేరమా !

- భారత సెలబ్రిటీలే లక్ష్యంగా మితవాద పక్షాలు
- వేధింపులు, బెదిరింపులతో ట్రోలింగ్



న్యూఢిల్లీ : గత 8 మాసాలుగా గాజాలో సాగుతున్న నరమేధంపై ప్రపంచ ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అక్కడ తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, శాశ్వతంగా శాంతిని నెలకొల్పాలని అంతర్జాతీయ న్యాయస్థానం, ఐక్యరాజ్య సమితి సహా పలు అంతర్జాతీయ సంస్థలు ఆదేశాలు, విజ్ఞప్తుల రూపంలో ఎన్నిసార్లు కోరినా ఇజ్రాయిల్ ...6లో

గెలుపెవరిది..?

నేడే ఓటరు తీర్పు వెల్లడి


- 543 లోక్‌సభ స్థానాలకు.. ఏపీ, ఒడిశా అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నేడే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. దేశవ్యాప్తంగా మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. దేశంలో ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. తొలిదశ పోలింగ్ ఏప్రిల్ 19న జరగగా చివరి (ఏడో) దశ పోలింగ్ జూన్ 1 జరిగింది. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకూ .. ఆంధ్రప్రదేశ్, ఒడిశాల్లో అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటికి సంబంధించిన ఓట్ల లెక్కింపునకు అనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపింది.

చివరి దశ ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయా ఎగ్జిట్ పోల్స్ సర్వేలు బీజేపీకి అనుకూలంగా ఫలితాలనిచ్చాయి. కానీ బీజేపీ నేతలు మాత్రం ఎక్కడో కొంచెం అపనమ్మకం తోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఇందుకు ఓటింగ్ తగ్గడమూ ఒక కారణంగా ఉంది. ఏడు దశల్లోనూ 2019 ఎన్నికల కంటే ఈసారి తక్కువగా పోలింగ్ జరిగింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటి దశలో 66.14 శాతం, రెండో దశలో 66.71 శాతం, మూడో దశలో 66.68 శాతం, నాలుగో దశలో 69.16 శాతం, ఐదో దశలో 62.2 శాతం, ఆరో దశలో 63.36 శాతం , ఏడో దశలో 61.63 శాతం ఓటింగ్ నమోదైంది.

మరోపక్క లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి ఒకరోజు ముందు (సోమవారం) జూన్ 3న నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. బీహార్ ముఖ్యమంత్రి, ఎన్డీఏ మిత్రపక్షం నితీష్ కుమార్, ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. జేపీ నడ్డా నివాసంలో ఆయన అధ్యక్షతనే ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్‌నాథ్ సింగ్, ...13లో





ఎన్నికల ప్రక్రియ విచ్ఛిన్నంపై సాక్ష్యాధారాలుంటే ఇవ్వండి

పుకార్లు, తప్పుడు కథనాలను అరికట్టలేకపోయామన్న ఈసీ

- ప్రపంచంలోనే అత్యధికంగా 64.2కోట్ల మంది ఓటర్లు వివరాలు 3లో
- 90శాతానికి పైగా ఫిర్యాదులు పరిష్కరించాం : సీఈసీ రాజీవ్‌కుమార్ వెల్లడి

నేడే కౌంటింగ్

రాష్ట్రవ్యాప్తంగా 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

- సాయంత్రం నాలుగు గంటల వరకు తుది ఫలితాలు వెల్లడయ్యే అవకాశం
- మరి కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఈసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఓట్ల లెక్కింపునకు సమయం రానే వచ్చింది. 20రోజుల ఎదురు చూపులకు మంగళవారం తెరపడనుంది. నాలుగో దశలో భాగంగా రాష్ట్రంలో మే 13న 17 లోక్‌సభ స్థానాలకు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ జరిగింది. ఓట్ల లెక్కింపు కోసం తెలంగాణ వ్యాప్తంగా 34 కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అరగంటకు ఈవీఎంల లెక్కింపు చేపడతారు. అత్యల్పంగా15 రౌండ్లున్న నిజామాబాద్ ఫలితం మధ్యాహ్నం 12 గంటల వరకు రానుంది. అత్యధికంగా ...13లో

బీ కేర్ ఫుల్...

కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- జూమ్ మీటింగ్‌లో అభ్యర్థులకు సీఎం రేవంత్ సూచన



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎంపీ అభ్యర్థులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పోటా పోటీగా ఉన్న నియోజకవర్గాల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తయ్యాకే ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుందనీ, ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి పార్లమెంట్ అభ్యర్థులు, ఆ నియోజకవర్గం ఇంచార్జీలు, మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులతో సీఎం రేవంత్ జూమ్ మీటింగ్‌లో నిర్వహించారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఏఐసీసీ సెక్రటరీలతో ఆయన మాట్లాడారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్న వారిని మాత్రమే ఏజెంట్‌గా పంపాలని సూచించారు. సీనియర్ నాయకులను కూడా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతీ రౌండ్‌లోనూ క్షుణ్ణంగా పరిశీలించాలనీ, ప్రతీ ఒక్కరి దగ్గర 17సీ లిస్ట్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈవీఎం ఓట్లకు, 17సీ లిస్ట్ ఓట్లకు వ్యత్యాసం ఉంటే, వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతీ అభ్యర్థీ వీటన్నింటిపై అవగాహనతో ఉండాలని రేవంత్ సూచించారు.

సీఎం రూటు మారింది

- సచివాలయ ప్రవేశ ద్వారాల మార్పు
- తొమ్మిదో ఫ్లోర్‌లోకి సీఎం కార్యాలయం

వివరాలు 6లో

పాలు పిరం



లీటర్‌కు రూ.2 పెంపు..

- నిన్న అమూల్, నేడు మదర్ డెయిరీ
- పోలింగ్ ముగిసిన వెంటనే భారాలు : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : పాల ధరలను లీటరుకు రెండు రూపాయిలు పెంచినట్లు అమూల్, మదర్ డెయిరీ సంస్థలు ప్రకటించాయి. గత 15మాసాలుగా ఉపకరణాల వ్యయం పెరిగినందున ఈ ధరలను పెంచాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. అన్ని రకాల పాలకు ఈ ధరల పెంపు వర్తిస్తుందని, పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ మార్కెట్‌లోనే కాకుండా ఈ పాలు దొరికే ఇతర మార్కెట్లలో కూడా ధరలు పెరుగుతాయని ఆ సంస్థలు పేర్కొన్నాయి. ఆదివారమే అమూల్ తన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించినా సోమవారం నుండే ఇవి అమల్లోకి వచ్చాయి. మదర్ డెయిరీ సోమవారం ధరల పెంపును ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే అమూల్, మదర్ డెయిరీ సంస్థల నుండి ఈ ప్రకటన వెలువడింది. ఏటికేడాది ఉత్పత్తి వ్యయం పెరిగిపోతున్నందున పాల ధరలను పెంచక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆ సంస్థలు వెల్లడించాయి.

తాజా ధరల పెంపు నేపథ్యంలో మదర్ డెయిరీ పాలకు సంబంధించి ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఫుల్ క్రీమ్ మిల్క్ లీటరు రూ.68కాగా, టైట్ టోన్డ్, డబుల్ టోన్డ్ పాలు రూ.56, 50గా వున్నాయి. గేదె పాలు, ఆవు పాలు వరుసగా లీటరు రూ.72, రు.58గా వున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్‌సిఆర్ మార్కెట్లో మదర్ డెయిరీ రోజుకు ...13లో



కుటుంబాల బడ్జెట్‌పై భారం : ఐద్వా

పాల ధరలు పెంచడాన్ని ఐద్వా ఒక ప్రకటనలో ఖండించింది. అలాగే రహదారుల టోల్ ట్యాక్స్‌ను ఐదు శాతం పెంచడాన్ని కూడా ఖండించింది. దీనివల్ల నిత్యావసరాల ధరలు పెరుగుతాయని, అంతిమంగా కుటుంబాల బడ్జెట్ దారుణంగా దెబ్బతింటుందని విమర్శించింది. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఇటువంటి చర్యలు తీసుకోవడమంటే ప్రజలను మోసం ...13లో



ఓపిక పట్టండి

ఎగ్జిట్ పోల్స్‌పై సోనియాగాంధీ

- కరుణానిధికి ఘన నివాళి

చెన్నై : దేశంలో ఇప్పటికే వెలువడిన ఎగ్జిట్ పోల్ ఫలితాలపై సోనియా గాంధీ తన మొదటి స్పందనను తెలియజేశారు. ఈ విషయంలో వేచి చూడాలని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు.. ఎగ్జిట్ పోల్స్‌లో చూపిన దానికి పూర్తి విరుద్ధంగా ఉంటాయని ఆమె అన్నారు. కాంగ్రెస్ చాలా ఆశాభావంతో ఉన్నదని చెప్పారు. మంగళవారం ప్రకటించబోయే ఎన్నికల ఫలితాలపై ఆమె అంచనాల గురించి అడిగినప్పుడు సోనియా గాంధీ పై విధంగా స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే భారీ మెజారిటీతో గెలుస్తుందనీ, ప్రధాని మోడీ వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారని చాలా ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసిన విషయం విదితమే. కాగా, కాంగ్రెస్, ఇతర ఇండియా బ్లాక్ పార్టీలు ఎగ్జిట్ పోల్స్‌ను తిరస్కరించాయి. ఈ సర్వేలు "కల్పితం" అని పేర్కొంటూ ప్రతిపక్ష కూటమి తదుపరి ప్రభుత్వాన్ని ...13లో

సామాన్యులకు భారంగా టోల్‌ట్యాక్స్ రేట్లు

- పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెంచిన టోల్ ట్యాక్స్ చార్జీలు సామాన్యులకు భారంగా మారనున్నాయనీ, వాటిని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ...13లో

అమ్మాయిలదే హవా

- అబ్బాయిల కంటే 8.47 శాతం అధికంగా ఉత్తీర్ణత
- పాలిసెట్‌లో 84.20 శాతం మంది అర్హత
- ఎంపీసీలో తూమాటి హరీశ్ టాపర్
- ఎంబైపీసీలో గోపగాని శ్రీనిఖ ప్రథమం
- ఫలితాలు విడుదల చేసిన బుర్రా వెంకటేశం
- 20 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్
- 118 కాలేజీల్లో 32,614 సీట్లు



వివరాలు 13లో

కవిత కస్టడీ పొడిగింపు

- విచారణ జులై 3కు వాయిదా వివరాలు 13లో

రేవ్‌పార్టీ కేసులో నటి హేమ అరెస్టు



- బెంగళూరు క్రైమ్‌బ్రాంచ్ అదుపులోకి.. 13లో

ఉపాధే లక్ష్యంగా పారిశ్రామిక పాలసీ

'పెట్టుబడులే లక్ష్యంగా పారిశ్రామిక విధానం ఉండొద్దు. కచ్చితంగా స్థానిక యువతరానికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలి. ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి. రాష్ట్రంలో స్థాపించే ప్రతి కార్పొరేట్ కంపెనీలో తప్పనిసరిగా 40 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి. సులభతరమైన, సింగిల్‌విండో పద్ధతిలో పారిశ్రామిక విధివిధానాల రూపకల్పన జరగాలి. ఉద్యోగులు, కార్మికుల హక్కులకు భంగం కలగొద్దు. ఉమ్మడి జిల్లాల్లోని సహజవనరుల ఆధారంగా జోనల్ పద్ధతిలో పరిశ్రమల ఏర్పాటు జరగాలి. దీనిలో స్వరాష్ట్రానికి చెందిన యువ పారిశ్రామికవేత్తలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. బ్యాంకుల రుణ పరపతి సౌకర్యాలను మరింత సరళీకరించాలి. దీనికోసం అవసరమైతే పారిశ్రామిక చట్ట సవరణలు కూడా చేద్దాం'... ఇవీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న పారిశ్రామిక విధానాల మౌలిక లక్ష్యాలు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తయారవుతున్న విధివిధానాలపై అధికారుల కసరత్తు పూర్తయ్యింది. వీటికోసం రాష్ట్రంలోని వివిధ పారిశ్రామిక సంఘాల నుంచి పరిశ్రమల శాఖ అభిప్రాయ సేకరణ జరిపింది. అన్ని రకాల పరిశ్రమల్ని ఒకే గాటన కట్టేయకుండా, వేర్వేరుగా విధివిధానాలు రూపొందిస్తున్నారు.

తుది దశకు చేరిన కసరత్తు

- సహజ వనరుల ప్రాతిపదికగా పరిశ్రమల ఏర్పాటు
- యువ పారిశ్రామికవేత్తలకు తొలి ప్రాధాన్యత
- కార్పొరేట్ సంస్థల్లో 40 శాతం ఉద్యోగాలు స్థానికులకే...
- 'దావోస్' డిమాండ్లూ పరిగణనలోకి...




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ) పాలసీ, ఎక్స్‌పోర్ట్ పాలసీ, న్యూ లైఫ్ సైన్సెస్ పాలసీ, రివైజ్డ్ ఈవీ పాలసీ, మెడికల్ టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను ప్రభుత్వం రూపొందిస్తున్నది. వీటితో పాటు టెక్స్‌టైల్ పరిశ్రమకు ప్రత్యేకంగా మరో పాలసీని ...2లో

రీయింబర్స్‌మెంట్లు వద్దు

ఏపీకే రెడ్డి, అధ్యక్షులు, ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎఫ్ఎస్ఎమ్ఈ)



పారిశ్రామిక విధివిధానాల రూపకల్పనలో రీయింబర్స్‌మెంట్ విధానం వద్దు. దీనివల్ల పారిశ్రామికవేత్తలు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ద్వారా ఇచ్చే రాయితీలు ఏనాడూ సకాలంలో యాజమాన్యాలకు అందలేదు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల రాయితీలు దాదాపు రూ.3,700 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికీ ఇవి విడుదల కాలేదు. అందువల్ల ప్రభుత్వం ఇస్తామన్న రాయితీలను నేరుగా ఆయా శాఖలకే చెల్లించాలి. విద్యుత్, నీటి చార్జీల్లో ఇచ్చే రాయితీలు ఆ శాఖలకే ఇవ్వాలి. వాటిని మినహాయించే పరిశ్రమలకు బిల్లులు ఇవ్వాలి. అలాగే రిజిస్ట్రేషన్ చార్జీల్లో రాయితీలను ఆ శాఖకు నేరుగా చెల్లించాలి. ఇలా పరిశ్రమలకు అనుబంధమైన అన్ని రాయితీలు ప్రభుత్వమే ఆయా శాఖలకే నేరుగా చెల్లిస్తే, ...2లో

మెక్సికో కొత్త అధ్యక్షురాలు షీన్ బామ్



- మితవాదులకు శృంగభంగం

మెక్సికో సిటీ: మెక్సికో తదుపరి అధ్యక్షురాలిగా ప్రగతిశీలవాది డా. క్లాడియా షీన్‌బామ్ తిరుగులేని మెజార్టీతో గెలుపొందారు. సైంటిస్టు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, హక్కుల కార్యకర్త అయిన ఆమె మెక్సికోను నయా ఉదారవాద విధానాలకు తావులేని ప్రత్యామ్నాయ ఆర్థికాభివృద్ధి నమూనాతో ముందుకు సాగుతానని ప్రకటించారు. తన సహచరుడు, ప్రస్తుత అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రడార్ (ఆమ్లో) అనుసరించిన ప్రజానుకూల విధానాలను కొనసాగిస్తానని చెప్పారు. అక్టోబర్ 1న నూతన అధ్యక్ష బాధ్యతలను ఆమె చేపడతారు. మొరెనా (మూవ్‌మెంట్ ఫర్ నేషనల్ రిజనరేషన్) పార్టీకి చెందిన 61 ఏళ్ల షీన్‌బామ్ లేబర్ పార్టీ (పిటి), గ్రీన్ ఎకాలజిస్ట్ పార్టీ ఆఫ్ మెక్సికో కలిసి 'లెట్స్ కంటిన్యూ మేకింగ్ హిస్టరీ' అనే కూటమిని ఏర్పాటు చేసి ఆ కూటమి తరపున బరిలోకి దిగి 58 శాతం ఓట్లతో విజయపతాక ఎగురవేశారు. ఆమె ప్రధాన ప్రత్యర్థి, మితవాద కూటమి (పిఆర్‌ఐ, పిఎఎన్, పిఆర్‌డి) కి చెందిన సోచితిల్ గాల్వెజ్ 28 శాతం ఓట్లతో చాలా వెనుకబడిపోయారు. సిటిజెన్స్ మూవ్‌మెంట్ పార్టీ అభ్యర్థి జోర్గె అల్వారెజ్ 10శాతం ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. మెక్సికో జాతీయ ఎన్నికల సంఘం ఫలితాలను వెల్లడించిన వెంటనే షీన్ బామ్ వేలాది మంది మద్దతుదారుల సమక్షంలో విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు."ఈ విజయం నాకు చాలా ఆనందం కలిగించింది. ఒక మహిళ ఈ అత్యున్నత స్థానానికి చేరుకోవడం 200 ఏళ్ల దేశ చరిత్రలో ఇదే ప్రథమం. ఈ విజయం చేకూర్చిన మీకందరికీ కృతజ్ఞతలు. ఆమ్లో ప్రవేశపెట్టిన 'ఫోర్త్ ట్రాన్స్‌ఫర్మేషన్' (నాల్గవ పరివర్తన) పంథాలో ముందుకు సాగుదాం" అని ఆమె అన్నారు. మెక్సికో అధ్యక్షపదవితోబాటు, పార్లమెంటులో దిగువ సభ అయిన చాంబర్ ఆఫ్ డిప్యూటీస్ (ఎంపీలు), సెనేట్, తొమ్మిది రాష్ట్రాల గవర్నర్ల పదవులకు, వివిధ నగరాల మేయర్ స్థానాలకు, స్థానిక అసెంబ్లీలకు ఆదివారం ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ అన్ని స్థాయిల్లోను మొరేనా పార్టీ నేతృత్వంలోని కూటమి విజయ ఢంకా మోగించడం విశేషం.

అమిత్‌షా సమక్షంలో చిన్నారుల ప్రచారం

- ఈసీ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి :టీపీసీసీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో పలువురు చిన్నారులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారనీ,వారిని బహిరంగ సభల్లో,ర్యాలీల్లో ఉపయోగించకూడదనే విషయం ఆయనకు తెలియదా?అని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ ప్రశ్నించారు.ఈ వ్యవహారంపై మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో అమిత్‌షాపై ఫిర్యాదు చేశామనీ, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు.దీనిపై ఈసీ విచారణ జరిపి,తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.మే ఒకటో తేదీన హైదరాబాద్‌లోని సుధా టాకీస్ వద్ద బీజేపీ అభ్యర్థి నిర్వహించిన సభలో చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు.ఎన్నికల కమిషనర్‌ను నియమించే కమిటీలో ఉన్న సభ్యుడైన అమిత్‌షాకు ఈ చిన్న లాజిక్ తెలియదా? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు

- నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరణ
- రాష్ట్రంలో తగ్గిన పగటిపూట ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు అడుగుపెట్టాయి. నేడు మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశముంది. రాబోయే నాలుగైదు రోజుల్లో కర్నాటక, రాయలసీమ, తెలంగాణ, కోస్తాంధ్రలోని మిగిలిన ప్రాంతాలకు వ్యాపించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నిన్నమొన్నటితో పోలిస్తే గరిష్ట ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీల మేర తగ్గాయి. ఆదిలాబాద్ జిల్లా బోరజ్‌లో అత్యధికంగా 41.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఒక్క ఆదిలాబాద్ మినహా అన్ని జిల్లాలోనూ పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల లోపే నమోదయ్యాయి. పశ్చిమ-మధ్య, నైరుతి బంగాళాఖాతం ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశముంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేసింది. సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 49 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బుర్దిపాడులో అత్యధికంగా 2.85 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

గూఢచర్యం కేసులో ...

- బ్రహ్మోస్ మాజీ ఇంజనీర్‌కు జీవితఖైదు

నాగ్‌పూర్ : గూఢచర్యం కేసులో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఇంజినీర్ నిశాంత్ అగర్వాల్‌కు జీవితఖైదు, రూ. 3 వేలు జరిమానా విధించారు. అధికారిక రహస్యాల చట్టం (ఒఎస్ఎ) ప్రకారం ఈ శిక్షలను నాగ్‌పూర్ జిల్లా కోర్టు సోమవారం విధించింది. పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ కోసం నిశాంత్ అగర్వాల్ గూఢచర్యానికి పాల్పడినట్లు ఒఎస్ఎలోని వివిధ సెక్షన్లతో పాటు, ఐటి చట్టంలోని సెక్షన్ 66 (ఎఫ్) కింద కేసు నమోదయింది. ఈ కేసులో నిశాంత్‌ను 2018లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన మిలటరీ ఇంటెలిజెన్స్ యాంటీ టెర్రరిజం (ఎటిఎస్) సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అరెస్టు చేశాయి. బ్రహ్మోస్ ఏరోస్పేస్ అనేది రష్యాకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ), మిలిటరీ ఇండస్ట్రియల్ కన్సార్టియం (ఎన్‌పిఒ మషినోస్ట్రోయెనియా) యొక్క సంయుక్త సంస్థ. ఈ సంస్థకు చెందిన నాగ్‌పూర్‌లోని క్షిపణి కేంద్రంలో సాంకేతిక పరిశోధన విభాగంలో నిశాంత్ నాలుగేళ్ల పాటు ఉద్యోగిగా పని చేశాడు.

తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ముకిరి శృతి నామినేషన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

త్వరలోనే తెలంగాణ రాష్ట్ర యువతను అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టర్లుగా తీర్చిదిద్దుతామని జాతీయ క్రీడాకారిణి ముకిరి శృతి అన్నారు. ప్రణాళికతో కూడిన పారదర్శక విధానాలకు పెద్దపీట వేస్తామన్నారు. తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సోమవారంనాడామె నామినేషన్ వేశారు. వనస్థలిపురంలోని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో సీనియర్ అడ్వకేట్ తిరుపతయ్యకు ఆమె నామినేషన్ పత్రాలను అందచేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి కనీసం ఐదుగురు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటేలా శిక్షణనివ్వడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. జూన్ 6వ తేదీన జరిగే ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ కార్యక్రమానికి జమ్మూ కశ్మీర్, ఢిల్లీ నుంచి వెయిట్ లిఫ్టర్లు హాజరై సంఘీభావం తెలిపారు.

బెంగళూరులో వర్ష బీభత్సం



- 133 ఏండ్ల రికార్డు బ్రేక్

బెంగళూరు : బెంగళూరులో వర్షం బీభత్సం సృష్టించింది. ఒక్కరోజులోనే 111.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 133 ఏండ్ల తర్వాత ఈ వర్షపాతం నమోదై రికార్డు సృష్టించిందని భారత వాతావరణశాఖ వెల్లడించింది. 1891 జూన్ 16న బెంగళూరులో ఒక్కరోజులోనే 101.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ రికార్డును ఆదివారం రాత్రి కురిసిన వర్షపాతం బ్రేక్ చేసిందని ఐఎండీ పేర్కొంది. కర్నాటక రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో బెంగళూరులో భారీ వర్షం కురిసిందని తెలిపింది. ఈ నేపథ్యంలో బెంగళూరుకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. జూన్ 3 నుంచి 5 వరకు ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది.

సదా మీ సేవలో...

బీజేపీ బాకాలుగా హిందీ ఛానల్స్

- ప్రజా సమస్యలు పట్టించుకోని మీడియా
- ప్రత్యామ్నాయంగా సోషల్ మీడియాను ఆశ్రయించిన ఓటర్లు



సార్వత్రిక ఎన్నికల సమరంలో విజేత ఎవరైనా హిందీ రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న బడా మీడియా సంస్థలు మాత్రం ప్రజల దృష్టిలో చులకన అయ్యాయి. రాజస్థాన్ నుండి ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ వరకూ ఎన్నికల ప్రచార సమయంలో హిందీ టీవీ ఛానల్స్ ప్రసారం చేసిన కార్యక్రమాలు సామాన్య ఓటర్లను ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయాయి. దీనికి ప్రధాన కారణం అవి పాలక పక్షానికి బాకాలుగా మారడమే. ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రచారంలో లేవనెత్తిన పలు వివాదాస్పద అంశాలను హిందీ ఛానల్స్ ప్రముఖంగా ప్రసారం చేశాయి. ఓబీసీ కోటాలో ముస్లింలను చేర్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, హిందువుల సంపదను ముస్లింలకు పంచేందుకు కుట్ర చేస్తోందని మోడీ చేసిన ఆరోపణలపై హిందీ ఛానల్స్‌లో పెద్ద ఎత్తున చర్చా గోష్టులు జరిగాయి. అయోధ్యలో మందిర నిర్మాణాన్ని కూడా అవి ప్రముఖంగా ప్రస్తావించాయి. కానీ ఇవేవీ ఓటర్లను ఆకర్షించలేకపోయాయి.

న్యూఢిల్లీ : గత రెండు నెలల కాలంలో ప్రతిపక్ష నాయకులు లేదా బీజేపీ నేతలు చేసిన వివాదాస్పద ప్రకటనలపై హిందీ ఛానల్స్ చర్చోపచర్చలు జరిపాయి. అయితే ఈ కార్యక్రమాలు ఉత్తరాదిన అర్బన్, సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయాయి. ప్రజలు క్షేత్ర స్థాయిలోని వాస్తవ పరిస్థితుల పైనే ఎక్కువగా చర్చించుకున్నారు. రాజకీయ పరిశీలకులేమో మ్యాజిక్ ఫిగర్ 272ను చేరుకోకుండా బీజేపీని ప్రతిపక్షాలు నిలువరించగలవా, కాంగ్రెస్ స్కోరు సెంచరీ దాటుతుందా లేదా అనే అంశాల పైనే ఎక్కువగా ఊహాగానాలు చేశారు.

నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలను ప్రతిపక్షాలు లేవనెత్తడం ఓటర్లను ఆలోచింపజేసింది. మీడియా సంస్థలు, పాత్రికేయులు ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా అర్థం లేని చర్చలతో కాలక్షేపం చేశారని హిందీ రాష్ట్రాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సంస్థలపై వారికి ఎప్పుడో విశ్వాసం సన్నగిల్లింది. తాము ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను మీడియా పట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు. మెజారిటీ హిందీ ఛానల్స్ బీజేపీ అనుకూల వేదికలుగా మారిపోయాయి. కొన్ని చోట్ల వాటి ప్రసారాలను ఆ పార్టీ కార్యకర్తలే విశ్వసించడం లేదు. వాస్తవ పరిస్థితి ఏమిటంటూ పాత్రికేయులకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారు. హిందీ ఛానల్స్‌లో ప్రాంతీయ రాజకీయ వార్తలు, సమస్యలపై కథనాలే రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. టీవీ ఛానల్స్ కథనాలు, వార్తలను విశ్వసించని ప్రజలు ఇంటర్నెట్‌ను ఆశ్రయిస్తూ వాస్తవాలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా మరింత సమాచారం, విమర్శనాత్మక కథనాల కోసం వారు యూట్యూబ్‌పై ఆధారపడుతున్నారు. టీవీ కార్యక్రమాలు వాస్తవికతను ప్రతిబింబించడం లేదని, అది యూట్యూబ్‌లో కన్పిస్తోందని ప్రజలు బహిరంగంగానే కాకుండా వార్తలు, సమాచారం కోసం కూడా ప్రజలు యూట్యూబ్‌పై ఆధారపడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే యూట్యూబ్‌లో పనిచేసే వారే నిజమైన జర్నలిస్టులన్న అభిప్రాయం నెలకొంది.

ప్రజలను చేరుకోవడానికి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు ఉపయోగపడుతున్నాయని ఓ పార్టీ కార్యకర్త చెప్పారు. హిందీ ఛానల్స్, పత్రికల్లో వార్తలు రావాలంటే చాలా ఖర్చవుతుందని, సోషల్ మీడియా ద్వారా వాటిని చౌకగా అందించవచ్చునని ఆయన తెలిపారు. బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటికి బడా మీడియా సంస్థలు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రజలు ఆరోపించారు.

ఉపాధే లక్ష్యంగా పారిశ్రామిక పాలసీ

(మొదటిపేజీ తరువాయి)



తయారుచేస్తున్నారు. ఇప్పుడున్న పాలసీలకంటే భిన్నంగా, మరింత సరళీకరిస్తూ విధివిధానాలకు రూపకల్పన జరుగుతున్నది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా ఆయా జిల్లాల్లోని వనరులను బట్టి క్లస్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో 7 లక్షల మంది పారిశ్రామికవేత్తలు ఉండగా, 40 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొత్త పాలసీల రూపకల్పనలో ఉన్న పరిశ్రమల విస్తరణ, కొత్త పరిశ్రమల స్థాపనను సులభతరం చేసేలా మార్గదర్శకాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఇటీవల ఆయన దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య సదస్సుకు హాజరై, రాష్ట్రానికి రూ.40వేల కోట్ల విలువైన పరిశ్రమల స్థాపన, విస్తరణకు ఒప్పందాలు చేసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడున్న విధానాలతో వీటి ఏర్పాటు అలస్యం అవుతుందనీ, విధివిధానాలను సరళీకరిస్తూ రూపొందిస్తే, అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని భావిస్తున్నారు. పారిశ్రామిక వేత్తల షరతులను పరిగణనలోకి తీసుకుంటూనే రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమలు, సంస్థల్లో కనీసం 40 శాతం ఉద్యోగావకాశాలు స్థానిక యువతీయువకులకు ఇవ్వాలనే కండీషన్‌ను తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించినట్టు పరిశ్రమలశాఖ వర్గాలు తెలిపాయి. భూముల కేటాయింపు, క్లష్టర్ల ఏర్పాటు, మౌలిక సౌకర్యాల కల్పన కోసం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థల్ని పునరుత్తేజం చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. అయితే పరిశ్రమలకు సంబంధించిన అన్ని వ్యవస్థల్నీ ఒకే గొడుగు కిందికి తెస్తే ఎలా ఉంటుందనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే బ్యాంకర్లు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)గా నిర్ధారించిన పరిశ్రమలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించి, వాటిని నిలబెట్టే ప్రయత్నం చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తున్నది. పరిశ్రమల శాఖ రూపొందిస్తున్న విధివిధానాల్లో ఈ అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల్ని పెట్టుబడిదారుల కోణంలో కాకుండా, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే కర్మాగారాలుగా చూసేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43 శాతం అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ వ్యవసాయాధారిత పరిశ్రమలు, టెక్స్‌టైల్, మినరల్ బేస్డ్ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా, బయోటెక్ రంగాలతో పాటు గాజులు, ఇతర ఆభరణాలు, అలంకార ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కరీంనగర్‌లో బొగ్గు ఆధారిత పరిశ్రమలతో పాటు వాణిజ్య పంటలు, నూనె ఉత్పత్తి కేంద్రాలు, వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పనున్నారు. ఖమ్మంలో ఐరన్ ఓర్, బొగ్గు, కాపర్, గ్రానైట్, ఖనిజాలకు సంబంధించిన పరిశ్రమలకు అనుమతులు ఇవ్వనున్నారు. మహబూబ్‌నగర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తారు. మెదక్ జిల్లాలో చెరుకు, మొక్కజొన్న, గోధుమలు, మిర్చి, మామిడి, బొప్పాయి వంటి ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యత ఇస్తారు. దానికోసం నేషనల్ మ్యానుఫాక్చరింగ్ పాలసీలో భాగంగా 13,000 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యానుఫాక్చరింగ్ జోన్స్ (నిమ్జ్)లో అనుమతులు ఇస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల్లో ఎక్కడికక్కడ లభించే ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల స్థాపన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తుంది. విధివిధానాల రూపకల్పన తుది దశకు చేరింది. వచ్చే రెండు వారాల్లో సీఎం రేవంత్‌రెడ్డితో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు భేటీ అయ్యి ముసాయిదాపై చర్చించనున్నారు. ఆ తర్వాత పారిశ్రామిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అభిప్రాయాలు కూడా తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది.

రీయింబర్స్‌మెంట్లు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన సులభతరం అవుతుంది. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆయా వృత్తివిద్యా కళాశాలల్లోనే విద్యార్థులకు వారికి ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇవ్వాలి. చదువులు పూర్తయ్యి, బయటకు వచ్చాక మళ్ళీ శిక్షణ పేరుతో కాలయాపన చేయొద్దు. యువ పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించేలా, వారు కళాశాలల్లో చదువుతున్నప్పుడే బ్యాంకుల ద్వారా స్వల్పకాలిక రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి. దీనివల్ల స్థానిక యువతరం పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతారు. పారిశ్రామికరంగంలో ఎలాంటి మార్పులు రావాలనే దానిపై ఎఫ్ఎస్ఎమ్ఈ తరపున తెలంగాణ పరిశ్రమల శాఖ కమిషనర్‌కు పూర్తివివరాలతో 40 పేజీల ప్రతిపాదనల్ని ఇచ్చాం. వాటిలో సింహభాగాన్ని ఆమోదిస్తున్నట్టు అధికారులు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు తీసుకోవడం ఆ రంగం అభివృద్ధిలో ముందడుగు పడటమే!

'పిన్నెల్లి'కి కౌంటింగ్ హాల్‌లోకి నో ఎంట్రీ

- సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించొద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇవిఎం ధ్వంసం కేసులో పిన్నెల్లికి హైకోర్టు మధ్యంతర ఉపశమనం కల్పించడాన్ని సవాల్ చేస్తూ టిడిపి ఏజెంట్ నంబూరి శేషగిరిరావు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది జె కుమార్ వాదనలు వినిపిస్తూ.. పిన్నెలికి బెయిల్ ఇస్తూ దిగువకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కోర్టులో ప్రదర్శించారు. దీనిపై పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది వికాష్‌సింగ్ వాదనలు వినిపిస్తూ., అధికారిక వీడియో కాదని అన్నారు. నంబూరి శేషగిరిరావు తరపున న్యాయవాది జె మెహతా జోక్యం చేసుకుని ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు కూడా ఉన్నాయని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఇవిఎం ధ్వంసం చేసిన వ్యక్తికి ముందస్తు బెయిల్ ఇవ్వడమేంటని హైకోర్టును ప్రశ్నించారు. కౌంటింగ్ హాలులోకి పిన్నెలిని అనుమతించవద్దని, జూన్ ఆరున బెయిల్ పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టును ధర్మాసనం ఆదేశించింది.

గాజాలో 40మంది మృతి

- రఫాను వీడిన పది లక్షలమందికి పైగా ప్రజలు

గాజా, బీరుట్ : గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల్లో భాగంగా గత 24గంటల్లో జరిగిన దాడుల్లో 40మంది మరణించారు. ఈ దాడుల కారణంగా ఇప్పటికే రఫా నుండి పది లక్షలమందికి పైగా ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌లు అంతర్జాతీయ న్యాయ స్థానం నుండి అరెస్టు వారంట్లు ఎదుర్కొనే అవకాశం వుందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో తాజా కాల్పుల విరమణ ఒప్పంద ప్రతిపాదనపై సందేహాలు పెరుగుతున్నాయి.

ఎన్నికల ప్రక్రియ విచ్ఛిన్నంపై సాక్ష్యాధారాలుంటే ఇవ్వండి

న్యూఢిల్లీ : భారత్ ఎన్నికల ప్రక్రియపై ప్రతిపక్షాలు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సోమవారం కొట్టిపారేశారు. బృహత్తరంగా సాగిన ఈ ఎన్నికల ప్రక్రియను విచ్ఛిన్నం చేసేలా రిటర్నింగ్ అధికారులు, జిల్లా మేజిస్ట్రేట్‌లను ప్రభావితం చేశారని చేస్తున్న ఆరోపణలను రుజువు చేసేలా సాక్ష్యాధారాలు ఏమైనా వుంటే వాటిని తమకు అందచేయాలని కోరారు. వాటిని పరిశీలించి కమిషన్ కచ్చితంగా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

లోక్‌సభ ఎన్నికల క్రమం ముగిసిన వెంటనే ఎన్నికల కమిషన్ పత్రికా సమావేశం పెట్టడం ఇదే తొలిసారి. ఎన్నికల కమిషన్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనలను నిర్లక్ష్యం చేస్తోందని సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

ప్రపంచంలోనే అత్యధికం

ఈ ఎన్నికల్లో అత్యధికంగా 64.2కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. వీరిలో 31.2 కోట్ల మంది మహిళా ఓటర్లని చెప్పారు. ప్రపంచంలోనే ఇది అత్యధికమని చెప్పారు. 68వేలకు పైగా పర్యవేక్షక బృందాలు, కోటిన్నర పోలింగ్, సెక్యూరిటీ సిబ్బంది ఈ ఎన్నికలకు పనిచేశారన్నారు.

తప్పుడు ఓటర్ల జాబితాలు, ఈవీఎంలపై ఆరోపణలు, ఓటర్ల టర్నవుట్ డేటాను అందచేయడంలో వైఫల్యం వంటి అంశాలపై తప్పుడు కథనాలు వచ్చాయని వాటిని అరికట్టలేకపోవడం ఈసారి ఎన్నికల నుండి తాము నేర్చుకున్న పెద్ద గుణపాఠమని రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. 'గల్లంతైన పెద్ద మనుషులు' అంటూ సోషల్ మీడియాలో ఈసీపై వచ్చిన మీమ్‌లు, ట్రోల్స్‌పై ఆయన స్పందించారు. తామెక్కడికీ వెళ్ళిపోలేదని, ఇక్కడే వున్నామని, పత్రికా ప్రకటనల ద్వారా మాట్లాడుతునే వున్నామని చెప్పారు.

మతోన్మాద విషాన్ని వెళ్లగక్కుతున్న ప్రధాని మోడీ సహా బీజేపీ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఈసీపై ఈ విమర్శలు వచ్చాయి. గతంలో ఏ ఎన్నికల సమయంలో ఎవరూ చేయని రీతిలో ఈసారి వందకు పైగా ప్రెస్‌నోట్‌లు జారీ చేశామన్నారు.

బీజేపీ సాగించిన మతోన్మాద ప్రచారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించకపోయినా ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించిన వారిపై కమిషన్ సుమోటో నోటీసులు జారీ చేసిందన్నారు. 495 ప్రధాన ఫిర్యాదులు అందాయని, వాటిలో 90శాతానికి పైగా ఫిర్యాదులను పరిష్కారించామన్నారు. అనేకమంది ఉన్నత స్థాయి నేతలకు నోటీసులు ఇచ్చామని, చాలామందిపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశామని, ఉన్నతాధికారులను బదిలీలు చేశామని చెప్పారు.



ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి 150మంది జిల్లా కలెక్టర్లకు కాల్స్ వచ్చాయని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఆరోపణలు చేయడంపై స్పందించిన ఈసీ సోమవారం

అమిత్‌షా సంగతేంటి..?

సాయంత్రం 7గంటల్లోగా వివరాలు అందచేయాలని ఆదేశించింది. ఇటువంటి సమాచారం ఏది వున్నా కానీ ఓట్ల లెక్కింపునకు ముందుగానే ఇవ్వాలని ప్రతిపక్షాలను కూడా ఈసీ కోరింది. "మీరు పుకార్లు వ్యాప్తి చేయలేరు, ప్రతి ఒక్కరినీ అనుమానాస్పద రీతిలో నిలబెట్టలేరు.' అని రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల క్రమం కొనసాగుతున్న సమయంలో తప్పుడు కథనాలు వ్యాప్తి చెందకుండా ఆపడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందనడాన్ని ఆయన అంగీకరించారు. ఆదివారం ఈసీని కలిసిన బహుళ పార్టీ ప్రతినిధి బృందం చేసిన డిమాండ్లను రాజీవ్‌కుమార్ అమోదించారు. వారు లేవనెత్తిన అంశాలు గత ఏడు దశాబ్దాలుగా సాగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగమేనని చెప్పారు.



మోడీతో నితీశ్ ములాఖాత్

బీజేపీ సమీక్షా సమావేశంలో ప్రధాని

న్యూఢిల్లీ : ఎన్నికల ఫలితాలు వెల్లడికి ఒక రోజు ముందు, అంటే సోమవారం బీజేపీ సమీక్షా సమావేశం నిర్వహించింది. పార్టీ అధ్యక్షులు జెపి నడ్డా నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షాతో పాటు అనేక మంది కేంద్ర మంత్రులు, కొంత మంది పార్టీ ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏడు దశల్లో ఎలా ఓటింగ్ జరిగింది?, కౌంటింగ్ రోజున సన్నాహాలు వంటి అంశాలపై చర్చించినట్టు పార్టీ సీనియర్ ప్రధాన కార్యదర్శి వినోద్ తవ్డే విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఎంఎల్ ఖత్తర్, సీనీయర్ మంత్రి పియూష్ గోయల్ కూడా హాజరైనట్టు చెప్పారు. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు కూడా ఈ సమావేశంలో పాల్గొనట్టు సమాచారం. కాగా, సోమవారం ప్రధాని మోడీతో బీహార్ ముఖ్యమంత్రి, ఎన్డీఏ భాగస్వామి నితీశ్‌కుమార్ సమావేశమయ్యారు. ప్రధానమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. వారణాసిలో జరిగిన మోడీ నామినేషన్ కార్యక్రమానికి అస్వస్థత కారణంగా నితీశ్‌కుమార్ హాజరు కాలేదని, ఈ నేపథ్యంలో మర్యాదపూర్వకంగా ప్రధానితో సమావేశమయ్యారని సమాచారం. అయితే ఈ సమావేశంలో రాజకీయాలు కూడా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా, అమిత్‌షాతో కూడా సమావేశం కావాలని నితీశ్‌కుమార్ అనుకున్నా.. చివరికి ఫోన్‌ల్లో అమిత్‌షాతో ఆయన సంభాషించారు.

ఆ ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలకు

హిమచల్ స్పీకర్ ఆమోదం



షిమ్లా : రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటు వేసిన ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల రాజీనామాలను హిమచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా సోమవారం ఆమోదించారు. '14వ విధాన సభలోని ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలను తక్షణ అమలుతో ఆమోదించాం' అని ఇక్కడ విలేకరులకు పఠానియా తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి హర్ష మహాజన్‌కు అనుకూలంగా ఆరుగురు కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలతో సహా ముగ్గురు స్వతంత్ర్య ఎమ్మెల్యేలు హోసియార్ సింగ్ (డెహ్రా నియోజకవర్గం), అశీష్ శర్మ (హమిర్‌పూర్ నియోజకవర్గం), కెఎల్ ఠాకూర్ (నలగఢ్ నియోజకవర్గం) ఓటు వేశారు. ఈ ముగ్గురు మార్చి 22న రాజీనామా చేశారు. అయితే స్పీకర్ రాజీనామాలను ఆమోదించలేదు. మార్చి 23న వీరు బీజేపీలో చేరారు. రాజీనామాలను ఆమోదించేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ విచారణ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. అలాగే, మరోవైపు ఈ ముగ్గురిపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు జగత్ సింగ్ నేగి హైకోర్టులో మరో పిటీషన్ వేశారు. ఇలాంటి నేపథ్యంలో స్పీకర్ వీరి రాజీనామాలను ఆమోదించారు. 'రాజీనామాలను ఆమోదించినా, అనర్హత వేటు వేసినా జరిగేది ఒక్కటే.. వారు అసెంబ్లీలో ఉండరు' అని స్పీకర్ చెప్పారు. స్పీకర్ నిర్ణయాన్ని ఎమ్మెల్యేలు స్వాగతించారు. అయితే ఈ నిర్ణయం మరింత ముందుగా తీసుకుని ఉంటే బాగుండేది అన్నారు. ఎందుకంటే ఆరుగురు కాంగ్రెస్ రెబల్స్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఇప్పటికే వేయడంతో ఈ స్థానాలకు లోక్‌సభ ఏడో దశతో పాటు ఈ నెల 1న ఉప ఎన్నికలు నిర్వహించారు. తమ రాజీనామాలను కూడా ఆమోదించి ఉంటే ఈ స్థానాలకు కూడా ఎన్నికలు జరిగి ఉండేవని అన్నారు.కాగా, హిమాచల్ ప్రదేశ్‌లో మొత్తం 68 ఎమ్మెల్యే ఉన్నారు. ఆరుగురు కాంగ్రెస్, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల స్థానాలు ఖాళీ అవ్వడంతో అసెంబ్లీలో ప్రస్తుతం 59 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్‌కు 34 మంది, బీజేపీకి 25 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

14 పోల్ కోడ్ ఉల్లంఘన కేసుల్లో

ఈసీ చర్యలు

- బీజేపీకి 5, కాంగ్రెస్‌కి 4 నోటీసులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పలు సందర్భాల్లో అందిన 14 మోడల్ ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై ఎన్నికల సంఘం(ఈసీ) చర్యలు తీసుకున్నది. దీంతో ఇది 13 నోటీసులు, ఆరు అభిశంసనలు, మూడు తాత్కాలిక ప్రచార నిషేధాలకు దారితీసింది. ఏడు దశల్లో జరిగిన కీలక ఎన్నికల కోసం రెండున్నర నెలల పాటు సాగిన ప్రచారం గతనెల 30తో ముగిసింది. జూన్ 1న తుది దశ ఎన్నికలు పూర్తయ్యాయి. ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నోటీసులు, ఆదేశాల ప్రకారం.. పోల్ ప్యానెల్ 14 ఎంసీసీ విషయాలను నేరుగా చేపట్టింది. వాటిలో 13 విషయాల్లో నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు ఈసీ ఏప్రిల్ 26న కాంగ్రెస్ నేత, తెలంగాణ మంత్రి కొండా సురేఖకు ఈసీ నోటీసులు జారీ చేసింది. ఇక 14 అంశాల్లో బీజేపీ నేతల ఉల్లంఘనలకు సంబంధించినవి ఐదు, కాంగ్రెస్ నేతలపై నాలుగు, టీడీపీ, ఆప్, వైసీపీ, బీఆర్ఎస్, టీఎంసీలకు వ్యతిరేకంగా ఒక్కొక్కటి ఉన్నాయి. ఈ 14 కేసులలో, మూడు కేసుల్లో ఏదైనా చర్య తీసుకున్నారా అన్నదానిపై మాత్రం ఈసీ ఇంకా బహిరంగపరచలేదు. ఏప్రిల్ 5న ఢిల్లీ మంత్రి అతిషికి ఒక నోటీసు, మే 18న బీజేపీ పశ్చిమ బెంగాల్ చీఫ్ సుకాంత మజుందార్‌కు రెండు నోటీసులు అందాయి. పార్టీ స్టార్ క్యాంపెయినర్లు ఉల్లంఘనలకు పాల్పడినందుకు పార్టీ అధ్యక్షులకు ఈసీ ఈసారి నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 25న, మోడీపై వచ్చిన ఫిర్యాదులపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేకు ఈసీ నోటీసులు జారీ చేసింది. రెండు పార్టీల అధ్యక్షుల నుంచి సమాధానాలు అందుకున్న తర్వాత, ఈసీ మే 22న ఎంసీసీ నిబంధనలను పునరుద్ఘాటిస్తూ వారికి వివరణాత్మక ఆదేశాలు జారీ చేసింది. ఇక నాయకులను దూషించిన సందర్భాలలో హెచ్చరించటం, ఎంసీసీ ఉల్లంఘించిన కేసుల్లో ప్రచారంపై నిషేధం విధించిన ఘటనలూ చోటు చేసుకున్నాయి. కాగా, పోల్ ప్యానెల్, రాష్ట్ర సీఈఓలతో పార్టీలు 425 ప్రధాన ఫిర్యాదులు దాఖలు చేశాయని ఈసీ మే 14న ఒక ప్రకటనలో తెలిపింది. వాటిలో 400 కేసుల్లో చర్యలు తీసుకోవటం, పరిష్కరించబడటం జరిగిందని వివరించింది.

మౌనమే..

మా వద్ద సమాచారం లేదు...

అది రాష్ట్రాలకు సంబంధించిన వ్యవహారం

కీలక ప్రశ్నలకు చట్టసభలో మోడీ ప్రభుత్వం ఇచ్చిన జవాబులు ఇవే



కీలక అంశాలపై సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు చట్టసభలో సమాధానాలు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఈ విషయంలో మోడీ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది. 2015-2023 మధ్యకాలంలో ఆరోగ్యం, విద్య, కార్మికులు, పర్యావరణం, వ్యవసాయం, ఆర్థికం, లింగం, చట్టం, న్యాయం తదితర కీలక అంశాల మీద పార్లమెంటులో సభ్యులు 35 ప్రశ్నలు లేవనెత్తగా వాటిలో 17 ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ఏమిటో తెలుసా ? 'ప్రభుత్వం వద్ద సమాచారం లేదు'. లోక్‌సభలో 20, పెద్దల సభలో 15 ప్రశ్నలకు సర్కారు నుండి వచ్చిన జవాబు ఇదే. విద్యార్థుల ఆత్మహత్యలు, ప్లాస్మా బ్యాంకులు, పోలీస్ సిబ్బంది మరణాలు, ఆర్‌టీఐ కార్యకర్తల మరణాలపై సభ్యులు ప్రశ్నలు వేయగా వీటికి కేంద్రం వద్ద సమాచారం ఉండదని, ఆయా రాష్ట్రాల వద్దే సమాధానం లభిస్తుందని ప్రభుత్వం తెలిపింది.

న్యూఢిల్లీ : 'కీలక అంశాలకు సంబంధించిన సమాచారం తన వద్ద లేదని చెబుతూ ప్రభుత్వం తప్పించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ వినియోగ వ్యయ సర్వే వంటి ముఖ్యమైన సమాచారాన్ని కూడా ప్రభుత్వం బహిర్గతం చేయడం లేదు' అని నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ సహ కన్వీనర్ అంజలి భరద్వాజ్ చెప్పారు. ప్రభుత్వం ఇలా వ్యవహరించడంతో సమాచారాన్ని పొందేందుకు పౌరులకు ఉన్న హక్కుకు అర్థమే లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'సమాచారం అనేదే లేకపోతే ప్రభుత్వాన్ని ఎలా బాధ్యురాలిని చేయగలం? సమాచారాన్ని సేకరించడం, నిర్వహించడం ప్రభుత్వానికి ఎంతో కీలకం. ఎందుకంటే ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సమర్థవంతమైన విధానాలు, పథకాలు, చట్టాలను రూపొందించాలంటే ఆ సమాచారమే మూలం అవుతుంది. సమాచారాన్ని నిర్వహించడంలో వైఫల్యం ఏ దేశంలో అయినా ఆందోళనకరమే' అని భరద్వాజ్ తెలిపారు.

2019 జూన్ నుండి ఈ సంవత్సరం ఫిబ్రవరి వరకూ సాగిన లోక్‌సభ కార్యకలాపాలు ఏ మాత్రం సంతృప్తిని కలిగించలేదు. 1952 తర్వాత దిగువ సభ ఇన్ని తక్కువ రోజులు పనిచేయడం ఇదే మొదటిసారి. సమావేశమైన కొద్ది రోజుల్లో కూడా కీలక ప్రశ్నలకు ప్రభుత్వం నుండి సరైన సమాధానాలు లభించకపోవడం విచారకరం.

కోవిడ్‌పై ప్రశ్నిస్తే...

కోవిడ్ సమయంలో ప్రధాన నగరాల నుండి స్వస్థలాలకు కాలినడకన వెళ్లిన వలస కార్మికుల్లో ఎందరు చనిపోయారంటూ 2020 సెప్టెంబరులో సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లాక్‌డౌన్ సమయంలో గ్రామాలకు వలస వచ్చిన వారు ఎందరు? ఆ ప్రయాణంలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు? వారి కుటుంబాలకు నష్టపరిహారం లేదా ఆర్థిక సాయం అందించారా? ఎంతమంది వలస కార్మికులు ఉపాధి కోల్పోయారు? అని ప్రశ్నించగా ఆ సమాచారం తన వద్ద లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

కోవిడ్ కారణంగా ఎంతమంది ఆరోగ్య కార్యకర్తలు చనిపోయారని అడిగిన ప్రశ్నకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సమాధానం ఇస్తూ ఈ సమాచారం కేంద్రం వద్ద ఉండదని, ఆరోగ్యం రాష్ట్రాలకు సంబంధించిన అంశమని తెలిపింది. అయితే 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ బీమా ప్యాకేజీ' కింద సహాయం కోరే వారి వివరాలు కేంద్రం వద్దే ఉంటాయి. కోవిడ్‌తో దేశంలో ఎంతమంది పోలీసు సిబ్బంది చనిపోయారని ప్రశ్నించగా దానికీ ఇలాంటి సమాధానమే వచ్చింది. కోవిడ్ కారణంగా చనిపోయిన పారిశుద్ధ్య కార్మికుల వివరాలు అడిగితే అవి కేంద్రం వద్ద ఉండవని, రాష్ట్రాలే సమాచారం ఇస్తాయని చెప్పింది.

పనివారితో మానవ వ్యర్థాల తొలగింపుపై...

దేశంలో పనివారితో మానవ వ్యర్థాల తొలగింపు పనులు కొనసాగుతున్నందున ఆ క్రమంలో ఎవరైనా చనిపోయారా అని 2019 ఫిబ్రవరిలో లోక్‌సభలో సభ్యుడు ప్రశ్నించారు. అలాంటి మరణాలేవీ సంభవించలేదని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. అయితే సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచే క్రమంలో కార్మికులు చనిపోతున్నారని పత్రికల్లో వార్తలు వస్తున్నాయని మాత్రం అంగీకరించింది. ఇలాంటి కేసులను విచారించి, రాష్ట్ర ప్రభుత్వాలే నష్టపరిహారం ఇస్తాయని తెలిపింది. కాగా దేశంలో కార్మికులతో మానవ వ్యర్థాలను తొలగింపజేస్తున్న సమాచారమేదీ తన వద్ద లేదని 2022 ఫిబ్రవరిలో ప్రభుత్వం దిగువసభకు తెలియజేసింది.

కోవిడ్ కారణంగా ఎంతమంది మహిళలు ఉపాధి కోల్పోయారని అడిగిన ప్రశ్నకు కూడా ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. కోవిడ్ సమయంలో అత్యవసర సేవలు కొనసాగించాల్సిందేనంటూ అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశాలపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం పనులు చేయించుకుంది. అయితే లాక్‌డౌన్ తర్వాత ఎంత మంది మహిళలు ఉపాధి కోల్పోయిందీ తనకు తెలియదని అంటోంది.

లవ్ జిహాద్‌పై...

లవ్ జిహాద్‌పై కేరళ హైకోర్టు వైఖరి, గత రెండు సంవత్సరాల్లో ఆ రాష్ట్రంలో అలాంటి కేసులేమైనా వచ్చాయా అని 2020 ఫిబ్రవరిలో లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. లవ్ జిహాద్‌కు చట్టపరమైన నిర్వచనమేదీ లేదని, అలాంటివి జరిగాయని కేంద్ర సంస్థలు చెప్పలేదని ఆయన తెలిపారు.

రైతుల మరణాలు, అరెస్టులపై...

నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించిన అన్నదాతలపై పెట్టిన కేసుల వివరాలు తెలియజేయాలని 2021 నవంబరులో లోక్‌సభలో సభ్యులు ప్రశ్నించారు. నిరసనల సందర్భంగా ఎంతమంది రైతులు చనిపోయిందీ చెప్పాలని కోరారు. అయితే వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖ వద్ద ఈ సమాచారం లేదని ప్రభుత్వం చెప్పింది. రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కూడా ఇదే జవాబు వచ్చింది.

ఆక్సిజన్, పడకల కొరతపై...

ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరత కారణంగా మరణించిన వారి సమాచారం ఉన్నదా అని 2022 మార్చిలో లోక్‌సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్రాలను సమాచారం అడిగామని, అయితే కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే స్పందించాయని, ఆక్సిజన్ కొరత కారణంగా మరణాలు సంభవించినట్లు ఎవరూ ధృవీకరించలేదని ప్రభుత్వం బదులిచ్చింది. 2020 మార్చి 1 నాటికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న పడకల వివరాలు ఇవ్వాలని అదే సంవత్సరం సెప్టెంబరులో లోక్‌సభలో ఓ సభ్యుడు కోరారు. కోవిడ్ సమయంలో రోగులకు తగినన్ని పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు కల్పించడంలో రాష్ట్రాలు ఇబ్బంది పడ్డాయా అని కూడా ప్రశ్నించారు. అయితే ప్రజారోగ్యం అనేది రాష్ట్ర జాబితాలో ఉన్నదని, దీనిని సంబంధించి కేంద్రం వద్ద ఎలాంటి సమాచారం ఉండదని ప్రభుత్వం బదులిచ్చింది.

పాత్రికేయుల అరెస్టులపై...

2019 నుంచి ఎంతమంది జర్నలిస్టులు అరెస్టయ్యారు, ఎంతమంది విచారణను ఎదుర్కొంటున్నారు అని 2022 జూలైలో లోక్‌సభలో ప్రశ్నించారు. అయితే పోలీసులు, పబ్లిక్ ఆర్డర్ అనేవి రాష్ట్రానికి సంబంధించిన అంశాలని, జర్నలిస్టుల అరెస్టుపై జాతీయ నేర రికార్డుల బ్యూరో వద్ద ఎలాంటి సమాచారం ఉండదని కేంద్రం బదులిచ్చింది.

హింసపై...

వేధింపులు, హింస, మత సమూహాలపై దాడులు వంటి చర్యలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటోందా అని 2022 డిసెంబరులో రాజ్యసభలో ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలను నివారించడం, విచారించడం రాష్ట్రాలకు సంబంధించిన విషయమని ప్రభుత్వం బదులిచ్చింది. మూకుమ్మడి దాడులు, హింసకు సంబంధించి జాతీయ నేర రికార్డుల బ్యూరో వద్ద సమాచారమేదీ ఉండదని తెలిపింది.

ఆర్‌టీఐ కార్యకర్తల హత్యలపై...

ఆర్‌టీఐ చట్టం కింద ఎన్ని అప్పీళ్లు పెండింగులో ఉన్నాయని గత సంవత్సరం డిసెంబరులో లోక్‌సభలో ప్రశ్నించారు. అయితే పెండింగ్ అప్పీళ్లకు సంబంధించిన సమాచారం రాష్ట్ర సమాచార కమిషనర్ వద్ద ఉంటుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. కేంద్ర సమాచార కమిషనర్ వద్ద పెండింగ్ అప్పీళ్లు గణనీయంగా తగ్గాయని, గత తొమ్మిది సంవత్సరాల్లో వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడమే దీనికి కారణమని తెలిపింది. అయితే ఎన్ని అప్పీళ్లను పరిష్కరించారు, ఎన్ని పెండింగులో ఉన్నాయి అనే వివరాలు మాత్రం చెప్పలేదు. ఆర్‌టీఐ కార్యకర్తలపై దాడులు, హత్యలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని 2015 డిసెంబరులో లోక్‌సభలో ప్రశ్నించగా అలాంటి ఘటనలేవీ జరగలేదని సమాధానం వచ్చింది. దాడులు, వేధింపులు, హత్యలకు సంబంధించి మీడియాలో కథనాలు వచ్చాయని, కానీ ఆ సమాచారం కేంద్రం వద్ద లేదని తెలిపింది.

మేలో భగభగలు

125 శాతం పెరిగిన వేడిగాలి రోజులు

ప్రాణ నష్టమూ ఎక్కువే : ఐఎండీ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లో మే నెలలో భానుడు తన ప్రతాపం చూపాడు. ఎండలు అధికంగా దంచి కొట్టాయి. మేలో దేశవ్యాప్తంగా హీట్‌వేవ్(వేడి గాలి) రోజులు 125 శాతం పెరిగాయి. సాధారణంతో పోలిస్తే ఇది రికార్డు స్థాయిలో పెరిగింది. ఇది వంద కోట్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. వేడిగాలులు ఎక్కువ కాలం ఉన్నకారణంగా అనేక ఉష్ణ సంబంధిత మరణాలు సంభవించాయని వివరించింది. దేశంలోని 36 సబ్ డివిజన్‌లలో సాధారణంగా 92 రోజుల వేడి గాలులు ఉంటాయి. కానీ, అది ఈ సారి 206 రోజులుగా ఉన్నదని ఐఎండీ వెల్లడించింది.

అయితే, కేరళ, కర్నాటక తీరప్రాంతం, కొంకణ్, ఈశాన్య ప్రాంతంలో హీట్‌వేవ్ రోజులు లేవు. ఏప్రిల్‌లో సాధారణంగా 71 వేడిగాలి రోజులకు గానూ.. 66 శాతం పెరుగుదల నమోదు చేసి, 118 హీట్‌వేవ్ రోజులు రికార్డయ్యాయని ఐఎండీ తెలిపింది. పశ్చిమ రాజస్థాన్‌లో మేలో అత్యధికంగా 16 హీట్‌వేవ్ రోజులు నమోదయ్యాయి. తూర్పు రాజస్థాన్ (14), హర్యానా, గుజరాత్ (12) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ, తూర్పు యూపీ, పశ్చిమ మధ్యప్రదేశ్ ఒక్కొక్కటి 10 రోజులు వేడిగాలిని చవిచూశాయి.

వేడిగాలుల కారణంగా రాజస్థాన్, యూపీ, బీహార్, హర్యానా, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో మరణాల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. రాజస్థాన్‌లో 130, ఒడిశాలో 26, బీహార్‌లో 14, యూపీలో 13 అనుమానిత మరణాలు నమోదయ్యాయని నివేదికలు సూచిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న వేడిగాలులు ఆందోళనను కలిగిస్తున్నాయి. మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల కారణంగా భూమిపై సగటు వ్యక్తి గత సంవత్సరంలో సాధారణం కంటే 26 రోజులు అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలను అనుభవించినట్టు ఒక ఎన్జీఓ తన అధ్యయనంలో చెప్పింది. గత 12 నెలల్లో, 630 కోట్ల మంది ప్రజలు (ప్రపంచ జనాభాలో దాదాపు 80 శాతం మంది) కనీసం 31 రోజులపాటు తీవ్రమైన వేడిని అనుభవించారని ఆ ఎన్జీఓ నివేదిక పేర్కొనట గమనార్హం.

నవతెలంగాణ

మనిషిని ప్రేమించగలవారికి
దేవుళ్ళూ, మతాలు అడ్డుకావు - మదర్ థెరిస్సా

మంగళవారం 4 జూన్ 2024
www.navatelangana.com

సంపాదకీయం

ధ్యానేంద్ర..!



ప్రజలు దేశాన్ని పాలించమని అడిగారు. ఆయనేమో ధ్యానం చేస్తూ కూర్చున్నాడు. చివరకు ఆధ్యాత్మిక గురువుగా పరిణామం చెందుతున్నాడు. తాను అమ్మ కడుపు నుండి పుట్టలేదని, భగవంతుని స్వరూపమని చెప్పుకున్నప్పుడే ప్రజలు ఈ విషయం గుర్తించారు. ఇక ఎన్నికల ప్రచారం ముగియగానే కన్యాకుమారిలో 48 గంటల పాటు ఏకాంత దీక్షలు పూర్తి చేసి తన భావాలను భావోద్వేగంతో ప్రజలకు ఓ సుదీర్ఘ లేఖ విడుదల చేయడంతో ఓ స్పష్టత వచ్చేసింది.

'ధ్యానంలోకి వెళ్లే ముందు ర్యాలీలు, రోడ్‌షోలలో నేను చూసిన లెక్కలేనన్ని ముఖాలు నా కండ్ల ముందుకొచ్చాయి. తల్లులు, సోదరీమణులు, కుమార్తెల అపరిమితమైన ప్రేమ, వారి ఆశీస్సులు, నా పట్ల వారి కండ్లలో ఉన్న నమ్మకం, అప్యాయత ఇలా ప్రతీది నా ముందుకు వచ్చాయి. నా కండ్లు తడిగా మారాయి. నేను శూన్యంలోకి వెళుతున్నాను. ధ్యానంలోకి ప్రవేశిస్తున్నాను. కొద్దిక్షణాల్లోనే ఇవన్నీ వాటంతట అవే శూన్యంలోకి వెళ్లిపోయాయి. నా మనసులో నిర్లిప్తత భావన మరింత తీవ్రమైంది. నా మనసు బాహ్య ప్రపంచం నుంచి పూర్తిగా దూరమైంది...' ఇవేనా ఓ ప్రధాని దేశ ప్రజలకు ఇవ్వాల్సిన సందేశం. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని వ్యక్తి బాధ్యతలు ఎలా గుర్తిస్తాడు? సమస్యలన్నీ విడిచి శూన్యంలోకి వెళ్లిన నాయకుడికి దేశ ప్రజల కష్టాలు ఎలా వినబడతాయి? ఒకవేళ వినబడినా అంతా మిధ్యా అనేస్తారు.

> ఒక వేళ మళ్లీ బీజేపీనే అధికారంలోకి వస్తే తనని ప్రధానిగా ఎన్నుకునేందుకే దేవుడు ప్రజల్ని సృష్టించాడని చెప్పుకున్నా ఆశ్చర్యపోవల్సింది ఏమీ లేదు. మాయమాటలతో ప్రజల్ని బుట్టలో వేసుకోవడంలో మోడీకి మించిన వారు ఇంకెవ్వరూ లేరు. ఇలా అధ్యాత్మిక గురువులు దేశాన్ని పాలిస్తే ప్రజలంతా ప్రశ్నించడం ఇక మర్చిపోవాల్సిందే. కుటుంబాలను వదిలేసి ఏకాంత దీక్షలు చేస్తూ 'దేవుడా నువ్వే దిక్కూ' అంటూ ధ్యానం చేయాల్సిందే.

మన ఆధ్యాత్మిక గురువు ఏకాంత దీక్ష పూర్తి చేసుకొని అలా వచ్చారో లేదో పాల ధరలు ఇలా పెరిగిపోయాయి. టోల్ ఛార్జీలు సైతం పెంచేశారు. ఒకపక్క దేశంలో మూడో వంతు ప్రజలు కనీసం రెండు పూట్ల తినడానికి తిండి లేక అర్థాకలితో అల్లాడిపోతున్నారు. మరోపక్క తన పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుండి బయట పడ్డారని తప్పుడు లెక్కలు చెప్పుకుంటున్నాడు. ఇక మూడోసారి తిరిగి కుర్చీలో కూర్చోబోయేది తనేనని కర్చీఫ్ వేసుకొని మరీ కూర్చున్నాడు. రాబోయే తన కొత్త ప్రభుత్వంలో వంద రోజుల పాలనపై సమీక్షలు కూడా ప్రారంభించాడు. పదేండ్లలో కార్పొరేట్లకు దోచిపెట్టడం తప్ప పేదల గురించి మాట్లాడని ఈ ఆధ్యాత్మిక గురువు వంద రోజుల్లో అద్భుతాలు చేస్తానంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ప్రజల నాడి బాగా తెలిసిన వ్యక్తికదా! తమ సమస్యలన్నీ మర్చిపోయేందుకు ప్రజలకు కూడా ఏకాంత దీక్షలు చేపట్టాలనే పిలుపును ఇవ్వకనే ఇచ్చినట్టున్నారు తన సుదీర్ఘ లేఖతో.

దేశ ప్రజలంతా చౌకదుకాణాల్లో నిత్యావసరాలు అందించి తమ కడుపు నింపమంటూ నెత్తీ నోరూ కొట్టుకుంటున్నారు. ఈయనేమో చౌక డేటా పేదలకు అందుబాటులోకి తెచ్చి దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చి ప్రపంచం ముందు ఓ ఉదాహరణగా నిలబెట్టా అంటున్నారు. చౌక డేటా వల్ల అంబానీకి తప్ప సామాన్యునికి ఒరిగిందేమీ లేదు. ఇక మోడీ తన లేఖలో స్వామీ వివేకానందుని మాటలను ప్రస్తావిస్తూ 'ప్రతి దేశానికి అందించడానికి ఓ సందేశం ఉంటుంది. నెరవేర్చడానికి ఓ లక్ష్యం ఉంటుంది. చేరుకోవాల్సిన గమ్యం ఉంటుంది' అన్నారని గుర్తు చేశారు. అదే వివేకానందుడు 1893లో చికాగోలో జరిగిన ప్రపంచ మతాల మహా సమ్మేళనంలో ఉపన్యసిస్తూ 'తమ మతం ప్రత్యేకంగా మనుగడ సాగించాలని, ఇతరుల మతాలు నాశనమై పోవాలని ఎవరైనా కలలు కన్నట్లయితే నేను వారిని చూసి జాలి పడతా. ప్రతిఘటన ఎదురైనప్పటికీ ఘర్షణ కాదు సాయపడాలి. విధ్వంసం కాదు సమీకరణ కావాలి. కలహాలు కాదు శాంతి సామరస్యతలు కావాలి' అన్నారు. అయినా ఈ మాటలు మన ప్రధానికి ఎలా వంటబడతాయి!

అందుకే 2024 సాధారణ ఎన్నికల ప్రచారం మొదలైన నాటి నుండి ఏదో ఒక రూపంలో మైనార్టీలపై ముఖ్యంగా ముస్లింలపై విషం చిమ్ముతూనే ఉన్నారు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చేస్తానని చెప్పుకుంటూ మైనార్టీ విభజన తెచ్చారు. ముస్లింలను దేశం నుండి తరిమేస్తానంటూనే వారిపై అపారమైన ప్రేమ ఉన్నట్టు మాట మార్చేశారు. తన పదేండ్ల పదవీ కాలంలో ఎన్నికల ప్రచారంలో ఆయన రికార్డు సమయాన్ని వెచ్చించింది ఈ ఎన్నికల్లోనే. ప్రజా ధనాన్ని కూడా విపరీతంగా ఖర్చుచేశారు. ప్రజలకు ఉపయోగించాల్సిన సమయాన్ని, ధనాన్ని వృధా చేస్తూ ప్రజల మెదళ్లలో విద్వేష విషాన్ని నింపే ప్రయత్నం చేశాడు. ప్రచారం ముగిసిన తర్వాత ఏకాంత ధ్యానంలోకి వెళ్ళిపోయానని ఆధ్యాత్మిక రసాన్ని పండిస్తున్నారు. 48 గంటల ధ్యానం తర్వాత జ్ఞానోదయమైన యోగిలా లేఖ విడుదల చేసి ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నాడు.

ఒక వేళ మళ్లీ బీజేపీనే అధికారంలోకి వస్తే తనని ప్రధానిగా ఎన్నుకునేందుకే దేవుడు ప్రజల్ని సృష్టించాడని చెప్పుకున్నా ఆశ్చర్య పోవల్సింది ఏమీ లేదు. మాయమాటలతో ప్రజల్ని బుట్టలో వేసుకోవడంలో మోడీకి మించిన వారు ఇంకెవ్వరూ లేరు. ఇలా అధ్యాత్మిక గురువులు దేశాన్ని పాలిస్తే ప్రజలంతా ప్రశ్నించడం ఇక మర్చిపోవాల్సిందే. కుటుంబాలను వదిలేసి ఏకాంత దీక్షలు చేస్తూ 'దేవుడా నువ్వే దిక్కూ' అంటూ ధ్యానం చేయాల్సిందే. వారు బోధించే ప్రవచనాలు వింటూ మన కర్మ ఫలమే కష్టాలకు కారణమని కన్నీళ్లతో బతకాల్సిందే.

వర్గ స్వభావాన్ని మరుగుపరిచే లక్షణం



ప్రభాత్ పట్నాయక్

వారసత్వ పన్ను విషయంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరిని బట్టి ఫాసిస్టు స్వభావం గల ప్రభుత్వాలు ఏ విధంగా వ్యవహరిస్తాయో తెలుసుకోవచ్చు. నయా ఉదారవాద శకంలో ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఎంత విపరీతంగా పెరిగాయో అందరికీ తెలిసిన విషయమే. ఇదేదో కేవలం మన దేశానికే పరిమితమైన ధోరణి కాదు. ఇది అంతర్జాతీయంగా జరుగుతున్న సంగతి. బూర్జువా వర్గ వేదికలలో సైతం దీని మీద చర్చ జరుగుతోంది. ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో కూడా ఈ అసమానతల పెరుగుదలను అరికట్టే చర్యల ఆవశ్యకత గురించి పదే పదే చర్చ జరుగుతోంది. అవధులు లేని విధంగా ఆదాయాల్లో, సం పదలో అసమానతలు ఈ విధంగా పెరిగిపోవడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడకు ముప్పు కాగలదని ప్రపంచంలోని అత్యంత సంపన్నులు సైతం గుర్తించారు. ఇలా గుర్తించినందువల్లనే పలువురు అమెరికన్ శత కోటీశ్వరులు కొంత కాలం క్రితం తమ మీద, తక్కిన సంపన్నుల మీద అదనపు పన్నులు విధించాలని సూచిస్తూ ప్రకటించారు.

ప్రస్తుతం మన దేశంలోని సంపన్న వర్గాలు మాత్రం అటువంటి దూరదృష్టిని ఏ మాత్రమూ ప్రదర్శించడం లేదు. ఫాసిస్టు శక్తులను బలపరిస్తే చాలునని, ఆ శక్తులు మత, కుల విద్వేష రాజకీయాలను ప్రయోగించి ఎన్నికల్లో ఏదోవిధంగా గెలుస్తాయని, ఆ తర్వాత తమ ఆధిపత్యానికి ఎదురయ్యే ఎటువంటి సవాలునైనా అత్యంత నిరంకుశ చర్యల ద్వారా అణచివేస్తాయని, అటువంటి ఫాసిస్టు శక్తుల తోడును ఉపయోగించుకుని తమ ఆదాయాలను, సంపదను అనంతకాలం పెంచుకుంటూ పోవచ్చునని ఆ సంపన్న వర్గాలు భావిస్తున్నాయి. ఒకానొక సమయంలో జి.డి.బిర్లా వంటి భారతీయ బూర్జువాలు తమ తమ సంపదలను విచ్చల విడిగా ప్రదర్శిస్తూ పోవద్దని తక్కిన పెట్టుబడిదారులకు సలహా ఇస్తూండేవారు. ఆ కాలంలో ప్రజానీకంలో వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందన్న భయం వారిని వెన్నాడుతూ వుండేది. ఇప్పుడటువంటి భయాలు ఏమీ లేవు. ఇప్పటి బూర్జువా వర్గం హిందూత్వ శక్తులతో తమ చెలిమి కొనసాగుతున్నంత కాలం తమకేమీ ఢోకా లేదన్న ధీమాతో ఉన్నారు. తమ ఆధిపత్యానికి ఎటు వంటి సవాలు ఎదురైనా, దానిని హిందూత్వ శక్తులు అణచివేయ గలవన్న నమ్మకంతో వారున్నారు. తమవద్ద ఎంత సంపద పోగు బడినా ఎటువంటి ముప్పూ రాదని వారు భావిస్తున్నారు. వారసత్వ పన్ను విషయంలో హిందూత్వ శక్తులు స్పందించిన తీరుచూస్తే బూర్జువా వర్గం ఎందుకంత ధీమాగా ఉందో బోధపడుతుంది.

ఆర్థిక అసమానతలను తగ్గించే పోరాటాన్ని ప్రారంభించడానికి సంపద పన్ను విధించడం (సంపద ఎంత ఎక్కువ ఉంటే అంత ఎక్కువ రేటు పన్ను శాతం ఉండే విధంగా), తద్వారా లభించే ఆదాయాన్ని ఉపయోగించి పేదలకు ప్రయోజనం చేకూర్చే లా వారికి కొన్ని సార్వత్రిక ఆర్థిక హక్కులు కల్పించడం సరైన మార్గం. ఈ సంగతి ఎవరికైనా సులువుగానే బోధపడుతుంది.

'కొంతకాలం కిందట మేము వేసిన అంచనాల ప్రకారం పేదలకు అయిదు రకాల సార్వత్రిక ఆర్థిక హక్కులను (విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి, పెన్షను) కల్పించడానికి కావలసిన ఆర్థిక వనరులను సమీకరిం చాలంటే సంపద పన్ను రెండు శాతం గాను, మూడవ వంతు సంపదను వారసత్వ పన్ను గాను విధిస్తే, అది కూడా కేవలం భారతదేశంలోని అత్యంత సంపన్నులైన ఒక శాతం ధనికుల మీద మాత్రమే విధిస్తే సరిపో తుందని నిర్ధారించాం. మన దేశంలో రూ.10 కోట్లు దాటి సంపద కలిగివున్న వారందరి మీదా రెండు శాతం సంపద పన్ను, మూడో వంతు వారసత్వ పన్ను విధిస్తే పెరుగుతున్న ఆర్థిక అసమానతల వలన వచ్చే ముప్పును నివారించవచ్చునని' థామస్ పికెటీ, అతడి సహచరులు కొంతకాలం నుండీ చెప్తూ వస్తున్నారు. సంపద పన్ను ఒక్కటే విధిస్తే అనేక మార్గాల ద్వారా ఆ పన్ను చెల్లించకుండా ఎగ్గొట్టే మార్గాలు దొరుకుతాయి. అదే సంపద పన్నుతో బాటు వారసత్వ పన్ను కూడా విధిస్తే ఆ విధంగా ఎగ్గొట్టడానికి సాధ్యం కాదు.

పెట్టుబడిదారీ సిద్ధాంత ప్రాతిపదికన చూసినా, వారసత్వ పన్ను విధించడం సమర్థనీయమే. తన కష్టంతో, చొరవతో పెట్టుబడిదారుడు సంపదను కూడగట్టగలుగుతాడు అన్నది పెట్టుబడిదారీ వర్గపు వాదన. అటువంటి కష్టార్జితాన్ని ఎంతవరకైనా ఆ పెట్టుబడిదారుడు పోగేయవచ్చు. అయితే, పెట్టుబడిదారుడు తన కష్టంతో సేకరించిన సంపద అతడి తదనంతరం, అతడి సంతతికి చెందుతుంది. అతడి సంతానం ఎటువంటి కష్టమూ పడకుండానే, ఎటువంటి చొరవనూ చూపకుండానే, తేరగా తండ్రి సంపాదించిన సంపదకి హక్కుదారులు అవుతారు. ఇలా కష్టపడకుండా సంపదమీద హక్కు పొందడం పెట్టుబడిదారీ సిద్ధాంతానికే వ్యతిరేకం కాదా? అందుకే చాలా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో మరణానంతర పన్నుల రూపంలో గణనీ యంగా వారసత్వ పన్ను వసూలు చేస్తున్నారు. ఉదాహరణకి జపాన్‌లో వారసత్వ పన్ను 55 శాతం ఉంది. కాని చాలా దిగ్భ్రాంతి గొలిపే విషయం ఏమంటే మన దేశంలో ఎటువంటి వారతస్వ పన్నూ అమలులో లేదు!

ఏమాత్రమూ వామపక్ష వాసనలు లేనివారు, నయా ఉదారవాద ఎజెండాని ఏ మాత్రమూ వ్యతిరేకించనివారు సైతం ఈ అసంగతమైన పరిస్థితిని గ్రహిస్తున్నారు. టెక్నాలజీయే సర్వస్వం అని భావించే శామ్ పిట్రోడా (విదేశాల్లో నివసించే కాంగ్రెస్ నేత) సైతం ఇటీవల వారసత్వ పన్ను ఆవశ్యకతను గురించి ప్రస్తావించాడు. అంతే, అతడిమీద బీజేపీ నేతలు అమాంతం విరుచుకుపడ్డారు. ఇక మన దేశంలోని అతి సంపన్నుల సంగతి సరేసరి. వారు తమకేదో ముంచుకు వచ్చేస్తోందన్నట్టు భయపడిపోయారు. ఇక తమను రక్షించేది ఆ బీజేపీ మాత్రమేనని ఎదురుచూశారు. ఐతే, బీజేపీ వారసత్వ పన్నును వ్యతిరేకించిన తీరు ఇక్కడ ప్రత్యేకంగా గమనించాలి. వారసత్వ పన్నును అమలు చేయడం కష్టసాధ్యం అనో, పెట్టుబడిదారుల చొరవను అది దెబ్బ తీస్తుందనో, వారిని నిరుత్సాహ పరుస్తుం దనో, లేకపోతే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆ పన్ను విధిం పుతో భయపడి మన దేశం నుండి బయటకు తరలిపోతుందనో, విదేశీ చెల్లింపుల లోటు పెరిగి పోతుందనో...ఈ మాదిరి వాదనలను బీజేపీ చేయలేదు. దానికి బదులు పచ్చి మతోన్మాద-ఫాసిస్టు వాదనలతో విరుచుకుపడింది. హిందువుల నుండి సంపదను కొల్లగొట్టి ముస్లింలకు కట్టబెట్టడానికే వారసత్వ పన్ను ప్రతి పాదనను ముందుకు తెచ్చారంటూ అత్యంత బూటకపు వాదన చేసింది. ఆ వాదనకు కొంత సెంటిమెంటును కూడా జోడించడానికి హిందూ మహిళల తాళిబొట్లను సైతం లాగేసుకుని మన దేశంలోకి అక్రమంగా చొరబడిన వారికి (ముస్లింలు అని పరోక్షంగా) దోచిపెడతారని ప్రచారం చేసింది.

ఇదెంత తప్పుల తడక ప్రచారమో వేరే చెప్పనక్కరలేదు. వారసత్వ పన్ను అనేది మతం బట్టి విధించేది కాదు. వారసత్వంగా సంక్రమించిన సంపద బాగా ఎక్కువగా ఉన్న సందర్భంలో మాత్రమే ఇది వర్తిస్తుంది. కాని బిజెపి మాత్రం ఈ పన్నును మత ప్రాతిపదికన విధిస్తారని ప్రచారం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తాను చేసినది అర్థంలేని వాదన అని బీజేపీకి కూడా ఆ తర్వాత అర్థం అయినట్టుంది. అందుకే తమ ప్రచారాన్ని కొంత మార్చారు. గతంలో ఔరంగజేబు ముస్లిమేతరుల మీద జజియా పన్ను విధించి మాదిరిగానే ఈ వారసత్వ పన్ను ఉంటుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ అన్నారు. ఇది కూడా మతవిద్వేష ప్రచారమే.

నరేంద్ర మోడీకి గాని, ఆదిత్యనాథ్‌కి గాని వారసత్వపన్ను అంటే ఏమిటో తెలియకపోవడం వల్లనే ఆ విధంగా ప్రకటనలు చేశారని అనుకోలేం. హిందువుల సంపదమీద పన్ను విధించి ముస్లింలకు కట్టబెట్టబోతున్నా రన్న వారి తప్పుడు ప్రచారం పనిగట్టుకుని చేసినదే. చర్చను మత ప్రాతిపదిక వైపు మళ్ళించడం ద్వారా వాళ్ల ఈ దేశంలోని అత్యంత సంపన్నులను కాపాడాలని ప్రయత్ని స్తున్నారు. ఆ విధంగా కార్పొరేట్లను కాపాడడంతో బాటు, మైనారిటీలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా, తమ ప్రత్యర్థి రాజకీయ పార్టీ ఆ మైనారిటీలను బుజ్జగించే రాజకీయాలను నడుపుతోందన్న తప్పుడు అభిప్రాయాన్ని కలిగించేలా బీజేపీ తన ప్రచారాన్ని కొనసాగించింది.


> ఒకే దెబ్బకు మూడు పిట్టల్ని కొట్టడానికి పనికొచ్చేలా బీజేపీ వారసత్వ పన్ను ప్రతిపాదన విషయంతో తన ప్రచారాన్ని చేపట్టింది. మొదటిది: మైనారిటీల మీద విద్వేషాన్ని మరింత రెచ్చగొట్టటడం. రెండోది: ప్రతిపక్ష పార్టీని దుయ్యబట్టడానికి దీనిని ఒక సాధనంగా వాడుకోవడం, మూడోది: వారసత్వ పన్ను ప్రతిపాదనను మొగ్గలోనే తుంచెయ్యడం, తద్వారా తమ ప్రధాన పోషకులైన అతి సంపన్నులను కాపాడుకోడం. మతతత్వ-ఫాసిస్టు శక్తులు ఈ విధమైన తప్పుడు ప్రచారాల వ్యూహాలలో అందె వేసిన చెయ్యి.

ఒకే దెబ్బకు మూడు పిట్టల్ని కొట్టడానికి పనికొచ్చేలా బీజేపీ వారసత్వ పన్ను ప్రతిపాదన విషయంతో తన ప్రచారాన్ని చేపట్టింది. మొదటిది: మైనారిటీల మీద విద్వేషాన్ని మరింత రెచ్చగ్గొటడం. రెండోది: ప్రతిపక్ష పార్టీని దుయ్యబట్టడానికి దీనిని ఒక సాధనంగా వాడుకోవడం, మూడోది: వారసత్వ పన్ను ప్రతిపా దనను మొగ్గలోనే తుంచెయ్యడం, తద్వారా తమ ప్రధాన పోషకులైన అతి సంపన్నులను కాపాడుకోడం. మతతత్వ-ఫాసిస్టు శక్తులు ఈ విధమైన తప్పుడు ప్రచారాల వ్యూహాలలో అందె వేసిన చెయ్యి.

ఒక ప్రజాస్వామ్య సమాజంలో ప్రజా జీవితానికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ ప్రజలు ఏది మంచో, ఏది చెడో గ్రహించగలుగు తారని, తదనుగుణంగా తమ వైఖరులు తీసుకుంటారని మామూలుగా అందరూ భావిస్తారు. కాని ఒక దోపిడీ సమాజంలో ఆ ప్రజలను పనిగట్టుకుని విషయాలను గ్రహించలేని స్థితిలోకి పాలక వర్గాలు నెడతాయి. అందుచేత వాస్తవ సమస్యలను వారు చర్చించి నిర్ణయించే శక్తిని కోల్పో తారు. అందుకే మార్క్సిస్టు సిద్ధాంతం మేధావులకు ఒక కర్తవ్యాన్ని నిర్దేశించింది. తామే వర్గానికి చెందినవారైన ప్పటికీ, ఆ వర్గ స్వభావాన్ని అధిగమించి కార్మికవర్గ దృక్పథంతో మేధావులు ఆ శ్రామిక ప్రజానీకానికి సిద్ధాంతాన్ని చేరువగా తీసుకురావాలని ఆదేశించింది. అయితే, ఆ విధంగా కార్మికవర్గానికి ప్రత్యక్షంగా తోడ్పడే మేధావులతో బాటు మరికొందరు మేధావులు కూడా ఉన్నారు. వాళ్ల సమాజాన్ని వర్గ కోణం నుండి చూడరు. కాని ప్రజలకు విషయాలన్నీ తెలియాలని, అప్పుడే ప్రజాస్వామ్యం బాగా పనిచేస్తుందని నమ్మే బూర్జువా మేధావులు వారు. ఉదాహరణకు బూర్జువా మేధావి అయిన జాన్ మేనార్డ్ కీన్స్ ప్రజాస్వామ్యం బాగా పనిచేయాలంటే అందుకు విద్యావంతులైన బూర్జువాలు అవసరం అని భావించాడు. అటువంటి బూర్జువా విద్యావంతులైనా, వారసత్వ పన్ను గురించిన చర్చ జరిగితే, అది మతంతో ముడిపడిన విషయం కాదనే చెప్తారు. కాని ప్రస్తుత చర్చలో నయా ఫాసిస్టు శక్తుల వాదనే ఎక్కువగా ప్రచారం పొందిందంటే (అది వట్టి బూటకపు వాదన అయినప్పటికీ), రాజకీ యాలలో ఫాసిస్టు శక్తుల ఆధిపత్యాన్ని అది సూచిస్తుంది. "విద్యా వంతులైన బూర్జువాలు" తమ బాధ్యతలను త్యజించారని అది సూచిస్తుంది.

"విద్యావంతులైన బూర్జువాలు" బలహీనపడడం, సంఖ్యా పరంగా కూడా తగ్గిపోవడం ఎవరూ కాదన లేని నిజం. వారసత్వ పన్ను అనేది మత ప్రాతిపదికన విధించేది అని బీజేపీ అగ్రనేతలు జంకూ గొంకూ లేకుండా ప్రచారం చేసుకుపోతూ వుంటే, మీడియా దానిమీద ఏ మాత్రమూ నోరు మెదపలేదు. బూర్జువా మేధావులు అదృశ్యమైపోయారని, గోడీ మీడియా మాత్రమే చెలామణీ అవుతోందని స్పష్టమవు తోంది. ఇలా ఎందుకు జరుగు తోంది? "విద్యావంతులైన బూర్జువాలు" కూడా బూర్జువా వర్గంలో ఒక అంతర్భాగమే. ఒక బూర్జువా సమాజం ప్రజాస్వామ్య ప్రాతిపదికన నడుస్తున్నప్పుడు మాత్రమే ఈ తరగతి తమ పాత్ర విషయంలో స్పష్టత కలిగి వుంటారు. ప్రజాస్వామ్యం బలహీన పడి, సమాజం ఫాసిస్టు శక్తుల పెత్తనంలోకి పోయిందంటే నయా ఉదారవాద వ్యవస్థ ముందు దారి మూసుకుపోయిందని అర్థం. ఇటువంటి పరిస్థితిని కీన్స్ కాలంలో ఊహించడం సాధ్యం కాదు. అందుకే కీన్స్ కోరుకున్నట్టు పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసే వర్గ పోరాటాలు బలపడకుండా తగు చర్యలు చేపట్టి, పెట్టుబడిదారీ వ్యవస్థను శాశ్వతంగా కాపాడుకోగలగడం అనేది ఇప్పుడు సాధ్యం కాని విషయం.

(స్వేచ్ఛానుసరణ)



> 'కొంతకాలం కిందట మేము వేసిన అంచనాల ప్రకారం పేదలకు అయిదు రకాల సార్వత్రిక ఆర్థిక హక్కులను (విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి, పెన్షను) కల్పించడానికి కావలసిన ఆర్థిక వనరులను సమీకరిం చాలంటే సంపద పన్ను రెండు శాతం గాను, మూడవ వంతు సంపదను వారసత్వ పన్ను గాను విధిస్తే, అది కూడా కేవలం భారతదేశంలోని అత్యంత సంపన్నులైన ఒక శాతం ధనికుల మీద మాత్రమే విధిస్తే సరిపో తుందని నిర్ధారించాం. మన దేశంలో రూ.10 కోట్లు దాటి సంపద కలిగివున్న వారందరి మీదా రెండు శాతం సంపద పన్ను, మూడో వంతు వారసత్వ పన్ను విధిస్తే పెరుగుతున్న ఆర్థిక అసమానతల వలన వచ్చే ముప్పును నివారించవచ్చునని' థామస్ పికెటీ, అతడి సహచరులు కొంతకాలం నుండీ చెప్తూ వస్తున్నారు.

మెయిల్ @ నవతెంగాణ

నైరుతి రుతుపవనాల రాకతో ఇప్పటికే రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు అప్రమత్తమయ్యారు. సాగుకు సిద్ధమయ్యే రైతులు తొలుత విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. అయితే.. వానాకాలం పంటల సాగుపై తెలంగాణలో నిర్దిష్ట ప్రణాళికేదీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో కోటి ఇరవై మూడు లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం.. అరవై రెండు లక్షల భూ కమతాలున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఆయా జిల్లాల వారీగా పంటల సాగు, అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు.. తదితర అంశాల్లో రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించలేకపోయింది ప్రభుత్వం. ఆహార పంటలైన వరి, మొక్కజొన్న, పప్పుదినుసులు, వాణిజ్య

'సాగు' ప్రణాళికేది?

పంటలైన పత్తి, చెరుకు, పొగాకు, మిర్చి, ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలకు సంబంధించిన విస్తీర్ణం, విత్తనాలపై నేటికీ ఒక స్పష్టత లేదు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, తదితర నిపుణుల సలహాలు, సూచనలు రైతులకు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఏ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుంది, అందుబాటులో ఉన్న ఆయా కంపెనీల విత్తనాల వివరాలు తెలుసుకోలేక పోతున్నారు రైతులు. దీంతో తోచిన పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఆయా ప్రాంతాల్లోని విత్తన దుకాణాల్లో పడిగాపులు గాస్తున్నారు. విత్తనాల కోసం క్యూ లైన్లో దుకాణాల ఎదుట బారులు దీరుతున్నారు. వ్యవసాయ విధాన రూపకల్పన, అమలు, దీర్ఘకాలిక ప్రయోజనాలతో ప్రభుత్వాలు ముందుకెళ్తే రైతులకు మేలు జరిగే అవకాశాలుంటాయి. అయితే కేంద్రంలోని బీజేపీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు శాస్త్రీయ విధానమే లేకుండా పనిచేశాయి. దీంతో రైతాంగానికి దిశ-దశ లేకుండా పోయింది. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతీ పైసా తాత్కాలిక ప్రయోజనాలకు ఉపయోగ పడేలా కాకుండా, భవిష్యత్‌లో వ్యవసాయ రంగం పండుగయ్యేలా ఉండాలి. కాని..గత పదేండ్ల కాలంలో వ్యవసాయ రంగంలో తెలంగాణ వెనక్కి వెళ్లిందనడంలో ఏమాత్రమూ సందేహం లేదు. రైతు బంధు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 9 పంటలకు రూ.65 వేలా 192 కోట్లు రైతులకు పెట్టుబడి సాయం అందించినా.. ఇప్పటికీ అప్పుల ఊబిలో కొట్టుమిట్లాడుతూనే ఉన్నారు అన్నదాతలు. 2018లో పంటల పెట్టుబడి కోసం రైతు బంధు స్కీమ్ ను తీసుకొచ్చింది గత బీఆర్ఎస్ సర్కారు. ఎకరాకు ఏడాదికి రూ. 10 వేల నగదును రైతు ఖాతాల్లో జమ చేసింది. సాగుతో నిమిత్తం లేకుండా ఖాళీ స్థలాలకూ రైతు బంధు ఇవ్వడం వల్ల సాగుచేయని బడా పెత్తందార్లు, ధనిక రైతులు ఎక్కువగా లాభపడ్డారు. రైతుబంధు నెపాన్ని చూపి రాయితీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ప్రకృతి వల్ల నష్టపోతే ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీకి ఎగనామం పెట్టింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు ఎక్కువగా నష్టపోవాల్సి వచ్చింది. వాణిజ్య పంటలు, పప్పు దినుసులు, మార్కెట్‌లో లాభాలొచ్చే, డిమాండ్ ఉన్న పంటల సాగు వైపు కాకుండా..వరి సాగుకు అందులోనూ దొడ్డు రకాలకు ప్రాధాన్యతిచ్చేలా అప్పటి ప్రభుత్వం ప్రోత్సహించింది. దీనికి తోడు కాళేశ్వరం జలాలు వచ్చాయని, నీటి సమస్యలేవీ ఉండవన్నట్లు విస్తృతంగా ప్రచారం చేయడంతో రైతులు దొడ్డు రకం వడ్ల సాగు వైపు మొగ్గు చూపారు. పదేండ్లుగా దొడ్డు వడ్లను సాగు చేస్తూ వస్తున్నారు. వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలుతోంది. దీనికితోడు సన్న రకాల ఉత్పత్తి లేక పోవడం వల్ల మధ్య తరగతి వర్గాలు కిలోకు రూ.50 నుండి రూ. 70 వరకు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తుంది. వానాకాలం పంటకు సర్కారు ఇచ్చే బోనస్ వల్ల సన్నాల సాగుకు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. దీనివల్ల మార్కెట్‌లో బీపీటీ, హెచ్ఎంటీ, జై శ్రీరాం, సోనా మసూరి.. ఇలా పలురకాల సన్న బియ్యానికి డిమాండ్ ఉంది. ఈ వానా కాలంలో వాటిని ఎక్కువగా ఉత్పత్తి చేసి ప్రభుత్వ రంగ సంస్థలు, రేషన్ షాపుల ద్వారా లబ్దిదారులకు సన్న బియ్యం అందించాలనే ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా.. ఇందుకు తగ్గా కార్యాచరణ చేపట్టలేక పోయింది. వివిధ రకాల డిమాండ్ ఉన్న విత్తనాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచలేకపోయింది ప్రస్తుత సర్కారు. తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సేవలు విస్తరించ లేకపోయింది. దీంతో రైతుల డిమాండ్ మేరకు విత్తనోత్పత్తి జరగడం లేదు. వరిలో దొడ్డు రకాలు మినహా.. నాణ్యమైన సన్న రకాలు అందుబాటులో లేని పరిస్థితులు న్నాయి. ఈ సంస్థ ద్వారా శనిగలు, పల్లి, సోయాబీన్, కందులు ఈ విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నా అవి ఎక్కడికెళ్లి కొనుగోలు చేయాలో ప్రచారం చేయడం లేదు.

- చిలగాని జనార్ధన్, 8121938106

టెన్షన్ అటెన్షన్





జంధ్యాల రఘుబాబు

కప్పు మీద కప్పు మ్యాచులు జరుగుతూ ఉన్నాయి. ఐ.పి.ఎల్ ఐపోయింది ఇప్పుడు ఐ.సి.సి. ప్రపంచ కప్పు మొదలవబోతోంది. క్రికెట్టే కాదు, బ్యాడ్మింటన్, హాకీ, టెన్నిస్, చదరంగం ఇలా ప్రతి సంవత్సరం ఎన్నెన్నో పోటీలు, కప్పులు జరుగుతూ ఉంటాయి. కప్పును గెలిచే వాళ్ళు గెలుస్తుంటారు, ఓడేవాళ్ళు తరువాత సంవత్సరం తప్పకుండా గెలవాలి అనుకొని ఇండ్లకు పోతారు. అలా అనుకొని ఇంటికిపోయి నిద్రపోతే సరిపోదు. ఏడాదైనా శమించాలి, గెలుపుకై తహతహ లాడాలి. అన్ని శక్తులూ కలుపుకొని అంతకుముందు కంటే పోటీనివ్వాలి. అప్పుడు తరువాత సంవత్సరం కప్పుపై ఆశపెట్టు కోవాలి. లేదంటే ఈ వాయిదా ప్రతి సంవత్సరం, నాలగు లేదా ఐదేండ్లకొకసారి జరుగుతూనే ఉంటుంది. ఏ జట్టు గెలుస్తుంది అన్న టెన్షన్ చాలామంది కుంటుంది. అక్కడే ముఖ్యమైన విషయాల మీద అటెన్షన్ కోల్పోతారు. అలాంటి ఒత్తిడిని పెంచి మన ధ్యాసను పక్కకు తిప్పడమే ఈ టెన్షన్‌ల ఉద్దేశ్యం. ఇక్కడే మనం జాగ్రత్త వహించాలి.

టీ ట్వెంటీ క్రికెట్ ప్రపంచకప్ అంటే ఇరవై ఇరవై ఓవర్ల ప్రపంచ కప్పు మొదలవబోతోంది. దాని గురించి రాసి రాసి, చూపించి చూపించి ఆసక్తి పెంచుతారు మీడియా వాళ్ల. అందులో భాగంగానే భారత్ ఫేవరేట్ గా రంగంలోకి దిగుతోంది అని రాస్తారు ఒక పేపర్లో. ఈసారి ఇండియాకే కప్పు గెలిచే అవకాశం ఉంది అని ఇంకో పేపర్లో రాస్తారు. రెండూ ఒకే అర్థంగా కనిపిస్తా యి చదివేటోళ్లకు. ఇప్పుడు భారత్, ఇండియా అంటే ఒకటి కాదని, రెండూ వేరువేరనీ జనాల మెదళ్లలో నూరిపోశారు మన నాయకులు. భారత్ తప్పకుండా గెలుస్తుంది అంటే కాదు కాదు ఇండియానే తప్పకుండా గెలుస్తుంది అంటారింకొం దరు. మనం తల పట్టుకొని ఇదేమిరా దేశంలో ప్రజల్ని విడగొట్టడం ఒకటైతే దేశం పేరును కూడా ఇలా రాజకీయం చేసి తమాషా చూస్తున్నారా అని మనకే ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ టెన్షన్‌కు కారణం ఒక ఫేవరేట్ జట్టును ఊహించుకోవడం. ఫేవరేట్ జట్టంటే ఇష్టమైన జట్టు. ప్రతి ఒక్కరికి ఒకటుంటుంది. మనిషిని బట్టి, మీడియా అయితే పేపరు, టీవీ ఇలా ఎవరికి వారు "ఇష్టులు" ఉంటారు. అయినా మధ్య మధ్యలో ఇంకో జట్టునూ తీసివేయలేము, ఫలాన జట్టుకి కూడా గెలిచే అవకాశముంది అంటూ ఉంటారు. అండర్ డాగ్ జట్లూ ఉంటాయి. అండర్ డాగ్ అంటే ఏమాత్రం కప్పు గెలిచే అవకాశం లేని జట్టు అని అందరికీ తెలుసు. చెప్పలేము 1983లో అండర్ డాగుగా ప్రవేశించిన కపిల్ సారథ్యంలోని భారత జట్టు అదేనండి ఇండియా జట్టు ఏకంగా ప్రపంచ కప్పునే తీసుకొచ్చింది. అదీ ఫైనల్ మ్యాచులో రెండుసార్లు ప్రపంచ కప్పు గెలిచిన వెస్ట్ ఇండీస్ జట్టు మీద గెలిచి. పెద్ద పెద్ద స్టార్లనబడే వాళ్ళు ఈ కప్పులో అరివీరభయంకరనా ఆడి కప్పు తేవడం జరగలేదు. ఇండియాకంటే అండర్ డాగ్ జట్టు జింబాబ్వేతో జరిగిన మ్యాచులో భారత జట్టుకు ముచ్చెమటలు పట్టిస్తే నాయకుడు కపిల్ దేవ్ 175 కొట్టి మ్యాచ్ గెలిచి ఫైనల్ దాకా తీసుకొచ్చాడు. ఫైనల్ మ్యాచులో అమర్‌నాథ్, మదన్ లాల్ లాంటి వారు ఎదురుగా వెస్ట్ ఇండీస్ బౌలర్లు వేసే బంతులను భయపడకుండా ఎదుర్కొని, తరువాత వాళ్ల వికెట్లు కూడా పడగొట్టి కప్పును ముద్దాడేలా చేశారు. ఇదంతా చెప్పడమెందుకంటే పెద్ద పెద్ద స్టార్లనబడే వాళ్ళు ఏమీ చేయలేరు ఒక్కొక్క సారి. ఫేవరేట్ అయినా అండర్ డాగ్ అయినా జట్టంతా సమైక్యంగా ఆడితేనే టెన్షన్ వదిలేసి గెలుస్తారన్న మాట మాత్రం వాస్తవం. మొన్నా మధ్య కపిల్ దేవ్ కాలేజి పిల్లలకు విషయాలు చెబుతూ మనకిష్టమైన పని చేస్తుంటే టెన్షన్ ఎందుకొస్తుంది అని ఒక ప్రశ్న వేశాడు. నిజమే కదా!

అలా అండర్ డాగ్ ఏ టెన్షనూ లేకుండా గెలిచినప్పుడు మేము ముందే చెప్పాము కదా ఆ జట్టుకూ అవకాశముందని, ఆ పార్టీకీ అధికారం దక్కొచ్చని అని తమ స్టేట్మెంటే కరెక్టని నమ్మబలుకుతారు. ఇంతకీ ఆ జట్టుని లేదా ఆ పార్టీ గురించి సిగరెట్ ప్యాకు మీద పొగతాగుట ప్రాణానికి హానికరము అన్నంత పెద్ద పెద్ద అక్షరాలతో రాసింటారన్నమాట. ఇది ఒకరకమైన టెక్నిక్కు. రెండుసార్లు ప్రపంచకప్పు గెలిచిన జట్టు మూడోసారీ ముచ్చటగా హ్యాట్రిక్ చేస్తుందని ఊహలు గుసగుసలాడించేసి పేపర్లు నింపిన వారికి, చర్చలు పెట్టి నమ్మబలికించిన వారికి ఆ హ్యాట్రిక్ తప్పిపోయినప్పుడు పెద్ద షాకే తగులుతుంది. అలాంటి షాకులు క్రీడాకారులిస్తారు, ప్రజలూ ఇస్తారు. ప్రజల అటెన్షన్ పక్కకు మరల్చడమే వాళ్ల ముఖ్య ఉద్దేశ్యం. "రాక్షసత్వము పోయి, రాచరికములు పోయి, ప్రజలదే పైచేయి, ఓ కూనలమ్మ" అని ఆరుద్రగారి కూనలమ్మ పదాలు పాడుకోవాలప్పుడు. అలాగే ఎవరిని నమ్మకూడదో చెప్పిన పాత కూనలమ్మ పదాలూ ఉన్నాయి "ఆడితప్పిన వాని, నాలి నేలని వాని, నాదరించుట హాని, ఓ కూనలమ్మ", ఇది ఎవరు రాశారో కాని ఆరుద్ర గారికి నచ్చినది.

గాంధీ గురించి ఎవరికిష్టమొచ్చింది వాళ్ల చెబుతున్నారిప్పుడు. అసలు స్వాతంత్ర్యం వచ్చి ఢిల్లీలో వేడుకలు చేసుకుంటుంటే గాంధీజీ అటెన్షన్ మాత్రం కలకత్తా మీద ఉంది. దేశ విభజన వేళ మతపరమైన అల్లర్లు జరుగకుండా అక్కడ తానే స్వయంగా ఉండి మరీ పరిస్థితి చేయిదాటిపోకుండా చూశాడు. నాయకుండంటే అలాఉండాలి. అంతెం దుకు సుందరయ్యలాంటి నాయకులు కూడా ప్రజల కోసం ఇలాగే పనిచేశారు. నిన్న ఎగ్జిట్ పోల్స్ మీద ధ్యాసతో అన్ని పార్టీలవారూ టెన్షన్‌తో ఉంటే సీతారాంఏచూరి, బృందా కారత్ పాలస్తీనాలో మారణహోమం ఆపాలంటూ ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ర్యాలీ తీశారు. శ్వాసమీద ధ్యాసలాగా ప్రజలే శ్వాసగా ఉన్నవాళ్ళు ఇలాగే ఉంటారు. ప్రజలంటే ఓట్లు అనుకొని చూసేవాళ్లు ఇంకో విధంగా ఉంటారు.

ఎగ్జిట్ పోల్సుని కూడా రీపోలింగ్ చేయించాలని వాట్సప్పులో నిన్న జోక్ ఒకటొచ్చింది. ఎవరి సంస్థలు వారివి కదా! అందుకే వాటి ఫలితాలు రకరకాలుగా ఉన్నాయి. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ప్రజల గురిం చి ఆలోచించే వాళ్ల అటెన్షన్ ఎప్పుడూ ప్రజా సమస్యల పైనే ఉంటుంది. టెన్షన్ అటెన్షన్ రెండూ రెండు కళ్లలా సింహాసనం మీద ఉండేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. అందుకే టెన్షన్లోనైనా మన అటెన్షన్ కోల్పో కూడదు. మన శ్రద్ధ ఎప్పుడూ ప్రజలపైనే ఉండాలి.

- 9849753298

ముగిసిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- రేపటినుంచి మూల్యాంకనం ప్రారంభం
- మూడోవారంలో ఫలితాలు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. గతనెల 24 నుంచి ఆ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం చివరి రోజు ఉదయం ఇంటర్ ప్రథమ సంవత్సరం మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1, జాగ్రఫీ పేపర్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 19 మంది దరఖాస్తు చేయగా, 18 మంది హాజరయ్యారనీ, ఒకరు గైర్హాజరయ్యారని వివరించారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2 పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు. ముగ్గురు దరఖాస్తు చేస్తే అందరూ హాజరయ్యారని తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 17 మూల్యాంకనం కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 2,73,407 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 1,53,608 మంది కలిపి మొత్తం 4,27,015 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈనెల మూడోవారంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యే అవకాశమున్నది.

9న గ్రూప్-1 ప్రిలిమ్స్

- హాల్‌టికెట్‌పై అభ్యర్థులు ఫొటో అంటించాలి : టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్ష ఈనెల తొమ్మిదిన ఆఫ్‌లైన్ విధానంలో ఓఎంఆర్ పద్ధతిలో జరగనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని వివరించారు. అదేరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం పది గంటలకు అంటే పరీక్షా ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈనెల ఒకటో తేదీ నుంచి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పించామని వివరించారు. హాటికెట్లపై అభ్యర్థులు పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తప్పనిసరిగా అంటించాలని సూచించారు. హాల్‌టికెట్ నిబంధనల్లో ఈ విషయాన్ని పొందుపర్చామని తెలిపారు. పరీక్షకు హాజరయ్యాక ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్‌టికెట్‌పై అభ్యర్థులు సంతకం చేయాలని కోరారు. పరీక్షకు హాజరయ్యేటపుడు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు (ఒరిజినల్) వెంట తెచ్చుకోవాలని సూచించారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1కు 4.03 లక్షల దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే.

గురుకుల డిగ్రీ కాలేజీల ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని బీసీ వెల్ఫేర్ , సోషల్ వెల్ఫేర్ , ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం ఏప్రిల్ 28న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. రిజల్ట్‌తో పాటు సీట్ల కేటాయింపు వివరాలు https://tgrdccet.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని టీజీఆర్‌డీసీ సెట్ - 2024 కన్వీనర్ బడుగు సైదులు తెలిపారు. ప్రవేశ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా కేటాయించిన సీట్లలో విద్యార్థులు ఈనెల ఐదు నుంచి 13 వరకు సంబంధిత కాలేజీల్లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలుండగా ఇందులో అమ్మాయిల కోసం 15, అబ్బాయిల కోసం 15 కాలేజీలు అందుబాటులో ఉన్నాయనీ, 9,220 సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. 26 మహిళా సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 7,080 సీట్లు, 21 గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 4,040 సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు.బీసీ డిగ్రీ కాలేజీల్లో రెగ్యులర్ కోర్సులతో పాటు మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, క్లౌడ్ టెక్నాలజీ, న్యూట్రిషన్ ఫుడ్ టెక్నాలజీ, ఫ్యాషన్ టెక్నాలజీ, టెక్స్ టైల్ టెక్నాలజీ, బీబీఏ, బీకాం కంప్యూటర్స్, ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు https://tgrdccet.cgg.gov.in వెబ్ సైట్ సంప్రదించాలని సైదులు సూచించారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 86.59 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 13 వరకు అవి కొనసాగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష జరిగిందని తెలిపారు. 16,215 మంది దరఖాస్తు చేయగా, 14,041 (86.59 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 2,174 (13.41 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

టెట్ ప్రాథమిక కీ విడుదల

- 5 వరకు అభ్యంతరాల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని విడుదల చేశామని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టీజీటెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో గతనెల 20 నుంచి ఈనెల రెండో తేదీ వరకు ఆ పరీక్షలను నిర్వహించిన సంగతి విదితమే. www.https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. ప్రాథమిక కీపై ఈనెల ఐదో తేదీన సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. అదే వెబ్‌సైట్‌లో అభ్యంతరాల సమర్పణకు లింక్ ఉందనీ, దాని ద్వారా పంపాలని సూచించారు. ఇతర పద్ధతుల్లో అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు. టెట్ పేపర్-1కు 99,958 మంది దరఖాస్తు చేయగా, 85,996 (86.03 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13,962 మంది గైర్హాజరయ్యారు. పేపర్-2కు 2,86,381 మంది దరఖాస్తు చేస్తే, 2,36,487 (82.58 శాతం) మంది పరీక్ష రాశారు. 49,894 మంది గైర్హాజరయ్యారు.

వారంలో టెట్ ఫలితాలు

వారం రోజుల్లో టెట్ ఫలితాలు విడుదలయ్యే అవకాశమున్నది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 12న ఫలితాలు విడుదల కానున్నాయి. అంతకంటే ముందే వారం రోజుల్లో ఫలితాలను విడుదల చేస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో చెప్పారు.

గోవా టూర్ కొంపముంచిందా..?

- క్యాంపు రాజకీయాలతో మారిన బలాబలాలు : లక్షలు చేతులు మారిన వైనం!
- 12 మంది ఎమ్మెల్యేలుండి 'చే' జార్చుకున్న ఎమ్మెల్సీ సీటు



(ఫైల్)

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గోవా టూర్ కాంగ్రెస్ కొంపముంచినట్టు తెలుస్తోంది. క్యాంపు రాజకీయాలతో బలాబలాలు మారిపోయాయి.. ఈ క్రమంలో లక్షల రూపాయలు చేతులు మారినట్టూ ఆరోపణలున్నాయి. ఓటు వేస్తారనే అతి నమ్మకంతో కాంగ్రెస్ నేతలు గట్టిగా ప్రయత్నించకపోవడం.. ఈ క్రమంలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ సొంత జిల్లాలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నా.. ఎమ్మెల్సీని గెలుచుకోలేక పోయిందన్న అపవాదును మూటగట్టుకుంది.

ఇక్కడి నుంచి ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి శాసనసభ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. దాంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి ఎన్నిక. అధికార మార్పిడి జరగ్గానే మెజార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వస్తున్నట్టు సంకేతాలిచ్చారు. దాంతో ఎమ్మెల్సీ స్థానం తమదేనని కాంగ్రెస్ అనుకున్నా.. దానికి తగ్గ ప్రయత్నాలు చేయలేదు. కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందనే చర్చ బీఆర్ఎస్‌లోనూ కొనసాగింది. ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా రావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఖంగుతిన్నారు. బీఆర్ఎస్ గెలుపునకు గోవా టూరు కలిసి వచ్చిందని కార్యకర్తలే చెప్పడం విశేషం.ఎమ్మెల్సీ సీటును కైవసం చేసుకోవడానికి బీఆర్ఎస్ చేయని ప్రయత్నం అంటూ లేదు. 'మీరు బీఆర్ఎస్‌కు ఓటేయకుంటే గతంలో మీరు చేసిన నిర్వాకాలన్నీ బయట పెడుతామని' స్థానిక ప్రజాప్రతినిధులను హెచ్చరించినట్టు వార్తలు వచ్చాయి. 'మీ జాతకాలు మా చేతుల్లో ఉన్నాయి' అని బెదిరించి ఓటేయించుకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. గోవా టూర్ పేరుతో వీరి కుటుంబాలను యాత్రలకు తీసుకెళ్లి ప్రలోభపెట్టారు. లక్షల రూపాయలు చేతులు మారినట్టు ప్రచారం ఉంది. దాంతో కాంగ్రెస్‌కు ఓటేస్తామని చెప్పిన వారు సైతం బీఆర్ఎస్‌కే ఓటేశారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో పక్కా ఆలోచన చేయకుండా ప్రజాప్రతినిధులను తమవైపే ఉండేలా నాయకత్వం చేసుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంతమంది నుంచి క్రాస్ ఓటింగ్ జరిగినా.. మిగతా వారి నుంచి జరగలేదు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వస్తామని చెప్పినా నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రుల చేరికలపై ఏమాత్రం స్పందించ లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లోకి వస్తామని చెప్పినా.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు అడ్డుకున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు జడ్చర్ల, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ గెలుపు కోసం చేసిన ప్రయత్నాలేమీ లేవనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తమదే కాబట్టి.. ఎమ్మెల్సీ స్థానం కూడా గెలుస్తామన్న ఎక్కువ అంచనాతో కనీస ప్రయత్నం చేయలేదనే విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రంగంలోకి దిగి ఎమ్మెల్సీ గెలుపుకోసం తీవ్ర కృషి చేశారు.స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 1439 ఓట్లు ఉన్నాయి. వారిలో మెజార్టీ సభ్యులు బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారే అయినా.. అందులో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి 762 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డికి 653 ఓట్లు పోలయ్యాయి. స్వతంత్ర్య అభ్యర్థి సుదర్శన్‌గౌడ్‌కు ఒక్క ఓటు మాత్రమే వచ్చింది. 21 ఓట్లు చెల్లకుండా పోయాయి. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్, ఎమ్మెల్యేలు మొత్తం 1000 మంది ప్రతినిధుల్లో మెజార్టీ సభ్యులు మొదట కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. ఆ తర్వాత వీరికి వివిధ రకాల ప్రలోభాలు.. బెదిరింపుల వల్ల బీఆర్ఎస్‌కే ఓటు వేసినట్టు సమాచారం.

శిబిరాల వల్ల మారిన రాజకీయ పరిణామాలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ శిబిరాల రాజకీయాలు నడిపింది. ఏ ఒక్కరిని వీడకుండా ఎన్నికలకు 15 రోజుల ముందే శిబిరాలకు తరలించి మానసికంగా వారిని మార్చేసింది. మాజీ మంత్రి కేటీఆర్ రంగంలోకి దిగి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం విశ్వ ప్రయత్నం చేశారు. ఓటర్లు చేజారకుండా జాగ్రతలు తీసుకున్నారు. బీఆర్ఎస్ ముఖ్యనేతలు వ్యూహాత్మకంగా పావులు కదిపారు. రాష్ట్రంలో అధికారం జారిపోయిన తర్వాత మొదటి ఎన్నిక కాబట్టి ఎట్టి పరిస్థితులోనూ ఓడిపోరాదని అహర్నిషలూ కృషి చేశారు. కాంగ్రెస్ మాత్రం ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచిన ధీమాతో ఉండి ప్రచారం చేయలేదు. స్థానిక నాయకులను ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్లే ఓటమి చవిచూసిందని చర్చ నడుస్తోంది.

జియోట్యాగింగ్‌తో 'చేనేత' కు తీవ్ర నష్టం

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిలిచిన సంక్షేమ పథకాలు
- రూ.222 కోట్ల బతుకమ్మ చీరల బిల్లుల పెండింగ్
- సీఎం దృష్టికి తీసుకెళ్తాం : చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్



నవతెలంగాణ-శాయంపేట

బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేనేత మగ్గాలకు జియోట్యాగింగ్ చేసి చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అందకుండా చేసి తీవ్ర నష్టం చేసిందని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ అన్నారు. హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సొసైటీని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమవారం సందర్శించి కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. చేనేత సొసైటీలో రాట్నం చుడుతున్న మహిళా కార్మికులతో మాట్లాడారు. మగ్గం నేస్తున్న కార్మికులతో మాట్లాడి రోజు కూలి ఎంత వస్తుందని, సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. చేతినిండా పని లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పొద్దంతా కష్టపడినా కూలీ గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సొసైటీలో 20 లక్షల వస్త్రాలు సిద్ధంగా ఉన్నాయని, టెస్కో కొనుగోలు చేయకపోవడం, బకాయి బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సొసైటీ చైర్మెన్ మామిడి శంకర్ లింగం తెలిపారు. అనంతరం మాజీ చైర్మెన్, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాపోలు వీరమోహన్ మాట్లాడారు. మూడేండ్ల క్రితం చేనేత ఐక్యవేదిక స్థాపించి చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పర్యటిస్తూ చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 17వేల మగ్గాలు మాత్రమే పనిచేస్తున్నట్టు జియో ట్యాగింగ్ ద్వారా అధికారులు చెప్తున్నారని, కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్, నేతన్న బీమా పథకాలను అందించకుండా చేనేతపై గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత సొసైటీ ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీలను నిర్వీర్యం చేసిందని, 2013లో ఎన్నికలు జరగగా ఆరేండ్లుగా ఇన్‌చార్జి పాలనతో సొసైటీ కొనసాగుతున్నట్టు తెలిపారు. బతుకమ్మ చీరలకు రూ.372 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉండగా, కేవలం రూ.150 కోట్లు నిధులు విడుదల చేసి రూ.222 కోట్లు పెండింగ్‌లో ఉంచారని అన్నారు. సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పించాలని, నేతన్న భరోసా పథకాన్ని అందించాలని, అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని, కూలి రేట్లు పెంచాలని.. పలు సమస్యలపై చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మెమోరాండం అందజేయనున్నట్టు తెలిపారు. అనంతరం సొసైటీ పాలకవర్గ సభ్యులు చేనేత ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులను చేనేత వస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యనిర్వాక అధ్యక్షులు కోమటిపల్లి సదానందం, సీనియర్ ఉపాధ్యక్షులు రాపోలు వెంకటేశ్వర్లు, క్రమశిక్షణ సంఘం చైర్మెన్ కొంగరి నారాయణ, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు చిందం సునీత, మహిళా కార్యదర్శి బీమానాదుల శారద, మీడియా కార్యదర్శి రావిరాల శ్రీనివాస్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కుడికాల భాస్కర్, సొసైటీ చైర్మెన్ మామిడి శంకర్ లింగం, డైరెక్టర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏసీబీ దాడులు

- రూ.45 వేల లంచం తీసుకుంటూ చిక్కిన ఇండస్ట్రీస్ అసిస్టెంట్ డైరెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట నర్సిరెడ్డి రూ.45 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కాడు. కలెక్టరేట్‌లో సోమవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన కేతావత్ రమేష్ కొన్ని రోజుల కిందట రూ.53 లక్షలతో టిప్పర్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఈ టిప్పర్‌ను ఎస్సీ, ఎస్టీ కోటా కింద గవర్నమెంట్ స్కీం (తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ రాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత ఎంటర్‌ప్రెన్యూర్స్ ఇన్సెంటీవ్ స్కీం) కింద వర్తింపజేయాలని అధికారులను కోరారు. దీనికి జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ రూ.45 వేల లంచం డిమాండ్ చేశారు. దాంతో రమేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం జీడిమెట్లలోని ఓ అసోసియేషన్ కార్యాలయంలో లంచం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వెంకట నర్సిరెడ్డిని పట్టుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌కు తీసుకొచ్చి జిల్లా పరిశ్రమల కార్యాలయంలో తనిఖీలు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ వ్యవహారంతో నర్సిరెడ్డితోపాటు మరెవరికైనా సంబంధం ఉందా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

లాసెట్‌కు 79.45 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం సోమవారం నిర్వహించిన లాసెట్ రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. 50,684 మంది దరఖాస్తు చేయగా, 40,268 (79.45 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 10,416 (20.55 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మూడేండ్ల లా కోర్సుకు ఉదయం మొదటి విడతకు 18,044 మంది దరఖాస్తు చేస్తే, 13,766 (76.29 శాతం) మంది, మధ్యాహ్నం రెండో విడతకు 18,035 మంది దరఖాస్తు చేయగా, 14,227 (78.89 శాతం) మంది, ఐదేండ్ల లా కోర్సు, పీజీలాసెట్‌కు 14,605 మంది దరఖాస్తు చేస్తే, 12,275 (84.05 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. లాసెట్ ప్రాథమిక కీని ఈనెల ఆరున విడుదల చేస్తామని తెలిపారు. ఏడో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం హ్టటజూ://శ్రీఱష్ఱవ్‌.ంఙష్ట్రవ.ఖఙ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. లాసెట్ రాతపరీక్షలను ఓయూ ఇన్‌చార్జీ వీసీ ఎం దానకిశోర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ రిజిస్ట్రార్ పి లక్ష్మినారాయణ పర్యవేక్షించారని తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి రూ. 20 కోట్ల టోకరా..!

- పరారీలో యువకుడు
- నిందితుని ఇంటి వద్ద బాధితుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఆవేదన

నవతెలంగాణ-బోడుప్పల్



(ఫైల్)

అధిక వడ్డీ ఆశ చూపి పలువురికి ఓ యువకుడు సుమారు రూ.20 కోట్లు టోకరా వేశాడు. అతడు పరారీలో ఉండగా.. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళన చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్, రాఘవేంద్రనగర్ కాలనీలో భాషెట్టి నాగరాజు నివసించేవాడు. పది రూపాయల వడ్డీ ఆశ చూపి చుట్టుపక్కల కాలనీ వాసుల వద్ద సుమారు రూ.20 కోట్లు తీసుకున్నాడు. ఒక్కొక్క వ్యక్తి వద్ద సుమారు రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు వసూలు చేశాడు. కొందరి నుంచి క్రెడిట్ కార్డుల ద్వారా డబ్బులు కట్టించుకున్నాడు. డబ్బులు తిరిగివ్వాలని అడిగినందుకు మూడు నెలలుగా అందుబాటులోకి రాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దాంతో మూడు నెలల కిందట బాధితులు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా, సమస్య కొలిక్కిరాకపోవడంతో బాధితులు సోమవారం నాగరాజు ఇంటి ముందు ఆందోళనకు దిగారు. వెంటనే తమ డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓ బాధితుడు విలేకరులతో మాట్లాడుతూ.. నిందితుడు స్నేహం ముసుగులో తమను మోసం చేశాడని.. క్రెడిట్ కార్డుల ద్వారా రూ. 10 లక్షలు తీసుకున్నాడని తెలిపారు. మూడు నెలలు వడ్డీ చెల్లించి.. ఆ తర్వాత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రెడిట్ కార్డు కంపెనీ వాళ్లు డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. తనలా కాలనీలో చాలా మంది దగ్గర డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదని తెలిపారు. అందరం కలిసి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఆ తర్వాత ఉప్పల్ ఏసీపీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు నరేష్, సాయి, సుల్తాన్, రఫీ, రఘునాథ్, నవీన్, అనీల్, సందీప్, మహేష్, సాయి కష్ణ, రాజశేఖర్, శివ కుమార్ పాల్గొన్నారు. అయితే నాగరాజు బాధితులు బయటకు రాని వారు ఇంకా ఉన్నారని తెలుస్తోంది.

కూలిన సెల్లార్ గోడ శిథిలాల కింద ఇరుక్కున్న కార్మికుడు

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ఆక్సిజన్ అందిస్తున్న వైద్య సిబ్బంది



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మరమ్మతులు చేస్తుండగా గోడ కూలి ఓ కార్మికుడు శిథిలాల కింద ఇరుక్కు పోయాడు. నడుము వరకు శిథిలాలు పడిపోయి బయటకు తీయలేని పరిస్థితిలో నరకయాతన పడ్డాడు. రాత్రి వరకు సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీ నిలయం ఎంక్లేవ్‌లోని సాయిరాం బృందావన్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి మురుగునీరు వస్తుండటంతో ఇదివరకు ఉన్న రిటైనింగ్ వాల్‌కు సమానంగా మరొక గోడ నిర్మించేందుకు ఐదుగురు కార్మికులు రెండ్లు ఫీట్ల లోతు గుంతను తీశారు. ఈ క్రమంలోనే శిథిలావస్థలో ఉన్న గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. దాంతో మహబూబాబాద్ జిల్లా, పూర్వి మండలం నేరేడు గ్రామంలోని కాకుల బోడ్ తండాకు చెందిన బానోత్‌రెడ్డిపై శిథిలాలు పడి ఇరుక్కుపోయాడు. మిగతా నలుగురు తప్పించుకోగలిగారు. వారు బానోత్ రెడ్డిని బయటకు లాగేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అధికా రులకు సమాచారం అందించడంతో జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సుమారు ఉదయం 11:30 నుంచి సహాయక చర్యలు కొనసాగాయి. అయితే, శిథిలమైన మిగతా గోడ ఎక్కడ కూలుతుందోనని చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బానోత్ రెడ్డి శిథిలాల కిందనే ఉండిపోయి నరకయాతన పడుతూ ఆర్తనాదాలు చేస్తుండగా అక్కడున్నవారందరినీ కలచివేసింది. బాధితు న్ని బయటకి తీసేందుకు ఓ పక్క సహాయక చర్యలు చేస్తుండగా.. మరోపక్క 108 వైద్య బృందం అతనికి సెలైన్, ఆక్సిజన్ పెట్టి చికిత్స అందిస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్స్ అరెస్ట్
- రూ.99,200 స్వాధీనం : ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర వెల్లడి



నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. బాధితుడి నుంచి మధ్యవర్తుల ద్వారా సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ పెద్దమొత్తంలో లంచం తీసుకుంటున్నట్టు ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో సోమవారం ఏసీబీ అధికారులు కార్యాలయంపై దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర తెలిసిన వివరాల ప్రకారం.. ఇటీవల సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ అక్రమ లేఔట్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్టు ఏసీబీకి ఫిర్యాదులందాయి. తన కూతురుకు ఇచ్చిన 800 గజాల స్థలం గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు 4 నెలలుగా సబ్ రిజిస్ట్రార్ తిప్పుకుంటున్నారని, పెద్ద మొత్తంలో సొమ్ము డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు మేక వెంకన్న ఏసీబీని ఆశ్రయించాడు. డబ్బులు ముట్టజెప్పేందుకు డాక్యుమెంట్ రైటర్లు కల్లూరి శ్రీనివాస్, తంగెళ్ల వెంకటరెడ్డిని సంప్రదించాలని సబ్ రిజిస్ట్రార్ సూచించాడు. వారు బాధితుని నుంచి రూ.99,200 తీసుకున్నట్టు ఏసీబీ అధికారులు దాడుల్లో గుర్తించారు. ఆ డబ్బులను వారు సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. మొత్తం ఫైళ్లను పరిశీలించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్, డాక్యుమెంట్ రైటర్లు కల్లూరి శ్రీనివాస్, తంగెళ్ల వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.99,200ను స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ గతంలోనూ రెండుసార్లు ఏసీబీ అధికారులకు చిక్కారు. అరెస్టు చేసిన వీరిని నాంపల్లిలోని ఏసీబీ కేసుల కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తుల ముందు హాజరు పరుచనున్నారు. ఏ ప్రభుత్వోద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ని ప్రజలు సంప్రదించాలని డీఎస్పీ కోరారు.

ప్రభాకర్‌రావుతో హరీశ్‌రావు భేటీ

- మా వద్ద ఆధారాలున్నాయి : కాంగ్రెస్ నేతలు సతీష్ మాదిగ, గజ్జల కాంతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అమెరికాలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు కలిశారని కాంగ్రెస్ సీనియర్ నేతలు సతీష్ మాదిగ, గజ్జల కాంతం విమర్శించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆ ఫోటోలు బయట పెడితే రాజకీయ సన్యాసం తీసుకుంటారా? అంటూ హరీశ్‌కు సవాల్ విసిరారు. లేదా రాష్ట్రం వదిలి పారిపోతారా? అని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. హరీశ్‌రావు రాష్ట్రంలో సంపాదించి అమెరికాలో పెట్టుబడులు పెట్టా రనీ, కేటీఆర్, కవితలు కూడా అంతులేని లేకుండా సంపాధిం చారని ఆరోపించారు. మీరు రాష్ట్రానికొస్తే అందరం జైలుకు వెళ్లాల్సి వస్తుందం టూ హరీశ్‌రావు ప్రభాకర్‌రావుకు చెప్పి వచ్చాడని ఆరోపించారు. అందుకు సంబం దించిన సీసీ కెమెరాల రికార్డు, లోకేషన్ వంటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు.

మామిడికాయ బస్తాల్లో గంజాయి

- దీని విలువ సుమారు రూ. 1,19,35,000
- ఐదుగురి అరెస్టు, మినీ వ్యాన్‌తో పాటు కారు స్వాధీనం

నవతెలంగాణ-మణుగూరు

మామిడికాయల పేరుతో వ్యాపారం నిర్వహిస్తూ గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో అరెస్ట్ చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా డొంకరాయి నుంచి మణుగూరు మీదుగా జహీరాబాద్‌కు మినీ వ్యాన్‌లో మామిడికాయల లోడ్ వెళ్తోంది. ఈ క్రమంలో అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. పోలీసులు ఖంగుతిన్నారు. ఏకంగా 477 కిలోల గంజాయి ఆ వాహనంలో లభించింది. దీని విలువ రూ.1,19,35,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. వాహనంలో ఉన్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అలాగే మినీ వ్యాన్‌తో పాటు ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు.





6 నుంచి బడి బాట

- 12న స్కూళ్లకు సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫారాల పంపిణీ
- 7న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్
- ఫీజు నియంత్రణ మార్గదర్శకాలను మంత్రివర్గ ఉపసంఘానికి

పంపిస్తాం : విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభిస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో పాలిసెట్ ఫలితాల విడుదల సందర్భంగా తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఈనెల 12న పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని వివరించారు. అదేరోజు పాఠశాలల్లో పండగ వాతావరణం ఉంటుందనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ బడులను సందర్శిస్తారనీ, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఒక జత బట్టలు (యూనిఫారాలు) విద్యార్థులకు అందనజేస్తారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని అన్నారు. ఫీజులు మిగులుతాయనీ, ఖర్చులుండబోవు, ఫలితాలు బాగుంటాయి, ఒత్తిడి లేని చదువు, అర్హులైన ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని వివరించారు. ట్రిపుల్‌ఐటీ బాసరలో ఆరేండ్ల ఇంట్రిగేటెడ్ బీటెక్ ప్రవేశాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంజినీరింగ్‌లో చేరితే వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని చెప్పారు. బడిఈడు పిల్లల్లో పౌష్టికాహార సమస్య ఉందన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలనీ, ఫీజుల బారినుంచి ఉపశమనం పొందాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆ డబ్బులను విద్యార్థుల పౌష్టికాహారానికి వినియోగించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ విద్యనందిస్తామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. పనులు పూర్తయ్యాయని వివరించారు. ఇంకా మిగిలిన పనులను ఈనెల 12 వరకు పూర్తి చేస్తామని అన్నారు. నూతన విద్యావిధానం (ఎన్‌ఈపీ) మీద అనేక అంశాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. దేశంలో ఏడు రాష్ట్రాలు ఎన్‌ఈపీని సైద్ధాంతికంగా, ఇతర అంశాల పరంగా అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు.

20 వరకు బదిలీలు, పదోన్నతులు పూర్తి

ఈనెల ఏడో తేదీన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని బుర్రా వెంకటేశం చెప్పారు. ఈనెల 20 వరకు ఆ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలనే అంశంపై ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకాభిప్రాయానికి రావాలంటూ ఆయా సంఘాల ప్రతినిధులకు వివరించామని అన్నారు. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 1,22,386 ఉపాధ్యాయ పోస్టులున్నాయనీ, అందులో ప్రస్తుతం 1,03,343 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని వివరించారు. 19,043 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. డీఎస్సీ ద్వారా 11,062 పోస్టులు, డీఎస్సీ-2008 ద్వారా మరో మూడు వేల మందికి కలిపి మొత్తం 14,062 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందుతారని అన్నారు. వారు వస్తే ఉపాధ్యాయుల కొరత తీరుతుందని వివరించారు. మారుమూల ప్రాంతాలు, తండాల్లో విద్యార్థులుండి ఉపాధ్యాయుల్లేకుంటే అవసరమైన చోట విద్యావాలంటీర్లను నియమిస్తామని చెప్పారు.

పుస్తకాలు, యూనిఫారాలు లాభాపేక్ష లేకుండా అమ్మాలి

ప్రయివేటు పాఠశాలల్లో లాభాపేక్ష లేకుండా పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫారాలను విక్రయించాలని బుర్రా వెంకటేశం యాజమాన్యాలను ఆదేశించారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేస్తారని అన్నారు. నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫారాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామనీ, జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఇంజినీరింగ్ తరహాలో ఫీజుల విధానం

ఇంజినీరింగ్ కాలేజీల తరహాలో ప్రయివేటు పాఠశాలల ఫీజుల విధానాన్ని రూపొందిస్తామని బుర్రా వెంకటేశం చెప్పారు. ప్రతిపాదనలను రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదానికి పంపించామని అన్నారు. ఆ తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘానికి పంపిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో ఐదుగురు సభ్యులతో ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి పాఠశాలల యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులే అమల్లో ఉంటాయన్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో ఫీజుల నియంత్రణ కమిటీ ప్రతిపాదించిన ఫీజులు అమల్లోకి వస్తాయని వివరించారు. ఆ ఫీజుల వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని చెప్పారు.

సీఎం రూటు మారింది



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రూటు మారింది. ఇకపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లే ద్వారాలు మారాయి. పశ్చిమ ద్వారం నుంచి సీఎం కాన్వాయి ఎంట్రీ ఇవ్వనున్నది. తూర్పు ద్వారం నుంచి ఆ కాన్వాయి బయటకు వెళ్లనున్నది. అదే సమయంలో ప్రస్తుతం సచివాలయం ఆరో అంతస్తులో ఉన్న సీఎం కార్యాలయాన్ని తొమ్మిదో ఫ్లోర్‌కు మార్చాలనే నిర్ణయం అధికారికంగా జరిగింది. దానికి తగ్గట్టుగానే తొమ్మిదో అంతస్తులో పనులు చకచకా జరుగుతున్నాయి. వాస్తు కోసం మార్పులు చేర్పులు చేయాలన్న సీఎం సూచనలతోనే ఈ మార్పు జరిగినట్టు చర్చ కొనసాగుతున్నది. టీపీసీసీ బాధ్యతలు చేపట్టగానే సీఎం రేవంత్‌రెడ్డి వాస్తుకు తగ్గట్టుగా గాంధీభవన్‌లో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. ఈ మార్పులు, చేర్పులపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. అత్యాధునిక సౌకర్యాలతో కట్టిన నూతన భవనంలో మార్పులు చేయాల్సిన అవసరమేంటి? అనే విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి.

నాడు కేసీఆర్.. నేడు రేవంత్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మన రాష్ట్ర పేరును సూచించే పొడి అక్షరాలైన టీఎస్‌ను టీజీగా మార్చిన సంగతి తెలిసిందే. వివాదాల నడుమ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జయజయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించిన విషయం విదితమే. ఇప్పుడు రాష్ట్ర చిహ్నం, తెలంగాణ తల్లి మార్పు దిశగా అడుగులు వేస్తున్నది. రాజముద్ర (చిహ్నం) మార్పుపై పెద్ద రాద్ధాంతమే నడుస్తున్నది. దీంతో సీఎం వెనక్కి తగ్గారు. మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఫైనల్ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. దీంతో రాజముద్ర మార్పునకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. సీఎం చేస్తున్న ఈ మార్పులను ప్రజలు స్వీకరిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు చేసిన మార్పులను గుర్తు చేసుకుంటున్నారు. సీఎం ఎవరైనా సరే ఇలా వాస్తు మార్పులు, చేర్పులు మామూలే అన్నట్టు చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్ ఓటమి చవిచూసిన తర్వాత కూడా తెలంగాణ భవన్‌కు కేసీఆర్ మార్పులు చేసిన విషయం తెలిసిందే. మొత్తమ్మీద చూస్తే రాష్ట్ర రాజకీయాల్లో వాస్తు మార్పులు పెద్ద దుమారాన్నే లేపుతున్నాయి.

మంచినీటి ట్యాంకులో మృతదేహం

- పది రోజుల నుంచి ఆ నీరే తాగిన ప్రజలు
- హిందూపూర్ వాటర్ ట్యాంక్‌లో ఘటన
- మున్సిపల్ సిబ్బందిపై స్థానికుల ఆగ్రహం



నవతెలంగాణ-నల్లగొండటౌన్

మంచినీళ్ల ట్యాంకులో మృతదేహం కలకలం సృష్టించింది. మున్సిపల్ సిబ్బంది గమనించక పోవడంతో పది రోజులుగా అక్కడి ప్రజలు ఆ నీటినే తాగుతున్నారు. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్తీలో సోమవారం వెలుగుజూసింది. గతంలో నాగార్జునసాగర్ మున్సిపాలిటీ వాటర్ ట్యాంక్‌లో పడి దాదాపు 30 కోతులు మృత్యువాత పడడం... చాలా రోజుల వరకు ఎవరూ గమనించకపోవడంతో స్థానికులు అవే నీటినీ తాగిన విషయం తెలిసిందే. ఇప్పుడు అలాంటి ఘటనే నల్లగొండలో జరగడంతో ప్రజలు మున్సిపల్ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. పాతబస్తీ హనుమాన్ నగర్‌కు చెందిన మతిస్థిమితం లేని ఆవుల వంశీ గత నెల 24వ తేదీ నుంచి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యల్లో భాగంగా సోమవారం హిందూపూర్‌లోని మంచినీటి వాటర్ ట్యాంకును పరిశీలించారు. లోపల వంశీ మృతదేహం లభ్యమైంది. కుళ్లిన స్థితిలో ఉండడంతో తప్పిపోయిన రోజే ఆయన వాటర్ ట్యాంకులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే పది రోజులుగా ఈ ట్యాంక్ నుంచి సరఫరా అయ్యే నీటినే ఆయా కాలనీవాసులు తాగుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వాటర్ ట్యాంక్‌పై కనీస సంరక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి సంఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ట్యాంక్‌పై మూత ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

ఇది ప్రజాపాలన కాదు..

- ప్రాణాలతో చెలగాటమాడే పాలన.. :

ట్విట్టర్ వేదికగా కేటీఆర్ విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఇది ప్రజాపాలన కాదు..ప్రాణాలతో చెలగాటమాడే పాలనంటూ' బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికార పార్టీని విమర్శించారు. కోతల్లేని కరెంట్ ఇవ్వలేరు..కోతకొచ్చిన పంటకు సాగునీళ్లు ఇవ్వలేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోతులు పడి చనిపోయినా వాటర్ ట్యాంకులను పట్టించుకోరని ఎద్దేవా చేశారు. చివరికి.. నల్గొండలోని నీటిట్యాంకులో పదిరోజులుగా శవం ఉన్నా కాంగ్రెస్ నేతలు నిద్రలేవలేదని గుర్తు చేశారు. సాగర్ ఘటన స్మృతిపథం నుంచి చెరిగిపోకముందే..కాంగ్రెస్ సర్కారులో మళ్లీ అదే నిర్లక్ష్యం.. అదే నిర్లిప్తత ..కొనసాగుతోందని తెలిపారు. సురక్షిత మంచినీళ్లు కూడా ఇవ్వలేని సర్కారిది.. ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేసిన గలీజు పాలన ఇదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పథకంతో.. దశాబ్దాల తాగునీటి తండ్లాటను తీరిస్తే.. కనీసం నీటిట్యాంకుల నిర్వహణ కూడా చేయడం లేదని విమర్శించారు. 'గుర్తుంచుకోండి.. జలమే జగతికి మూలం' అని పేర్కొన్నారు. ఈ సర్కారు తీరు మారకపోతే... జనమే కాంగ్రెస్‌ను తరిమికొట్టడం ఖాయం...అని హెచ్చరించారు.

పాలస్తీనాకు మద్దతివ్వడమే నేరమా !

(మొదటిపేజీ తరువాయి)

మొండిగా వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా మే 26వ తేదీన రఫాలోని నిర్వాసితులు తలదాచుకున్న తాత్కాలిక శిబిరంపై ఇజ్రాయిల్ ఆర్మీ విరుచుకుపడింది. ఆ ఘటనలో 45మంది మరణించారు. పెద్ద ఎత్తున లేచిన మంటలు, మాడిపోయిన మృతదేహాలు, తల లేని పిల్లాడి మృతదేహం వంటి భయానకమైన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటిని చూసి ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. సోషల్ మీడియా వ్యాప్తంగా తమ నిరసనలు, ఆందోళనలను పంచుకున్నారు. ఈ తరుణంలోనే "ఆల్ ఐస్ ఆన్ రఫా" పేరుతో ఎఐ సృష్టించిన గ్రాఫిక్ బాగా వైరల్ అయింది. 4కోట్ల సార్లకు పైగా దీన్ని షేర్ చేసుకున్నారు. రఫా నగరంపై దాడి చేస్తున్న ఇజ్రాయిల్ బలగాలకు ఒక హెచ్చరికగా ఈ గ్రాఫిక్‌ను తీసుకువచ్చారు. సోషల్ మీడియా వ్యాప్తంగా సాగిన ఈ ప్రచారంలో పలువురు అంతర్జాతీయ సెలబ్రిటీలతో సహా భారత్ సెలబ్రిటీలు పలువురు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియచేశారు. సోషల్ మీడియా యూజర్లు ముఖ్యంగా సెలబ్రిటీలు ఈ ట్రెండ్‌ను ఫాలో అయ్యారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్ తీరును ప్రశ్నిస్తూ, ఖండిస్తూ ఆ గ్రాఫిక్‌ను ఇతరులతో పంచుకున్న భారత సెలబ్రిటీలను మితవాద విభాగానికి చెందిన ఇన్‌ఫ్లూయన్సర్లు, ప్రచారకర్తలు బాగా లక్ష్యంగా చేసుకున్నారు. వారిని బెదిరించడం ఆరంభించారు. ఆన్‌లైన్ వేదికగా వేధింపులకు గురి చేశారు. ఇప్పుడు రఫాపై ఇంతలా గళమెత్తి ప్రశ్నిస్తున్న వారు గతంలో పాకిస్తాన్‌లో హిందువులపై జరిగిన వేధింపుల సమయంలో, అలాగే కాశ్మీరీ పండిట్లపై జరిగిన దాడులు, వేధింపులపై ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నిస్తున్నారు. పైగా ఆల్ ఐస్ ఆన్ రఫా అన్న గ్రాఫిక్‌లో రఫా స్థానంలో పిఒకె, పాకిస్తానీ హిందూస్ అనే పదాలను చేర్చి ఆన్‌లైన్‌లో ప్రచారం చేశారు. మరికొంతమంది రఫాపై వ్యక్తమవుతున్న సంఘీభావాన్ని కూడా మీమ్స్ రూపంలో తీసుకువచ్చారు.

ఇందుకు సంబంధించి కొన్ని ఉదాహరణలను చూద్దాం :

భారత్ క్రికెట్ టీమ్ కెప్టెన్ రోహిత్‌శర్మ భార్య రితికా సజ్దా ఈ గ్రాఫిక్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన మితవాదుల ట్రోలింగ్‌ను భరించలేక దాన్ని తొలగించారు. తప్పుడు సమాచారాన్ని తన సోషల్ మీడియా వేదికగా తరచుగా ప్రచారం చేసే దీపక్ శర్మ అనే వ్యక్తి రోహిత్ శర్మకు, భార్య రితికకు హెచ్చరిక చేశారు. 'తీవ్రవాదులు, ఆటవిక కృత్యాలకు పాల్పడుతున్న వారికి మద్దతుగా పోస్టులు పెడుతూ నీ భార్య తప్పు చేస్తోంది. అయినా ఏదో నాలుగు రూపాయిలు సంపాదించుకోవడానికా ఆమె ఇలాంటి పోస్టులు పెడుతోంది, ఆమెకు నువ్వు డబ్బులు ఇవ్వడం లేదా అంటూ తీవ్ర పదజాలంతో ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ఇది మొదటి తప్పు అనుకుని క్షమించి వదిలేస్తున్నాం, మరోసారి జరిగితే తీవ్ర పర్యవసానాలు వుంటాయని హెచ్చరించారు. భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్ కూడా ఇదే గ్రాఫిక్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేశారు. వెంటనే మితవాద విభాగాల నుండి తీవ్ర స్థాయిలో విద్వేషాలు వెల్లువెత్తాయి. మోనా ఎట్ లేడీ నేషనలిస్ట్ అనే ఎక్స్ యూజర్ సిరాజ్ పంచుకున్న స్టోరీపై తీవ్రంగా వ్యాఖ్యలు చేశారు. "వారిని మీరు ఎంతగా సొంతం చేసుకున్నా, చివరకు వారు వారి అసలైన స్వభావాన్ని బయటపెట్టుకుంటారు." అని హిందీలో పేర్కొన్నారు. మిగిలిన అనేకమంది సెలబ్రిటీలన కూడీ ఈ యూజర్ లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా ముస్లిం కమ్యూనిటీకి చెందిన వారిని లేదా ముస్లింలతో సంబంధమున్న వారిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. బిజెపి ఎంపి మనోజ్ తివారీ కుమార్తె, ఇటీవలే బిజెపిలో చేరిన రితి తివారీ కూడా ఈ గ్రాఫిక్‌ను షేర్ చేసి పోస్టు పెట్టారు. పిల్లల తలలు కోసి, వారిని సజీవంగా సమాధి చేయడంతో సహా లెక్కలేని అత్యాచారాలు, అకృత్యాలకు పాల్పడుతున్న ఈ దుష్టత్వాన్ని ఖండిస్తూ, అందరిలో చైతన్యం తీసుకురావడానికి మన గళాన్ని వినిపించాలి, మనకు న్యాయం కావాలి, ఇందుకోసం తిరగబడాలి అని పేర్కొన్నారు. అయితే మితవాదుల నుండి తీవ్రంగా విమర్శలు, అభ్యంతరాలు వెల్లువెత్తడంతో తన ఇన్‌స్టా పేజీ నుండి ఆ పోస్టును తొలగించారు. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని సమర్థించేవారు బిజెపిలో వుండడం సిగ్గుచేటైన విషయమంటూ మితవాద ఇన్‌ఫ్లూయన్సర్ షఫాలి వైద్య ఒక వీడియో కూడా షేర్ చేశారు. రితి తివారిని బెదిరిస్తూ అనేకమంది పోస్టులు పెట్టారు. మరోపక్క బాగా వైరల్ అయిన ఈ గ్రాఫిక్‌నే మరో రకంగా ఉపయోగించుకున్నారు . కర్ణాటకకు చెందిన బిజెపి ఎంపి పి.సి.మోహన్. "(ఆయేగా తో మోడీ హై) మోడీ విల్ బి బేక్" అని మార్చి ఆ గ్రాఫిక్‌ను షేర్ చేశారు.

దీన్ని బిజెపి ఎంఎల్‌ఎ అతుల్ భత్కాలక్కర్, మితవాద ఇన్‌ఫ్లూయన్సర్ రిషి బాగ్రీలతో సహా పలువురు యూజర్లు తమ సోషల్ మీడియా హేండిల్‌పై షేర్ చేసుకున్నారు. సోషల్ మీడియాలో ఇంతలా రగడ జరుగుతున్న నేపథ్యంలో మే 30వ తేదీన కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పాలస్తీనాపై భారత్ వైఖరిని పునరుద్ఘాటించారు.

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలన్నదే భారత్ వైఖరి అని స్పష్టం చేశారు. అయితే గాజాలో దాడులు ప్రారంభమైనప్పటి నుండి బిజెపి, ప్రధాని మోడీ మద్దతుదారులతో సహా మితవాద గ్రూపులు ఇస్లామోఫోబియాను రెచ్చగొట్టడానికి దీన్నొక అవకాశంగా మలుచుకున్నారు. పాలస్తీనాకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ సాగించే యుద్ధ నేరాలకు మద్దతుగా మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. గాజా నరమేధంలో బలైన వారిని అపహాస్యం చేసేలా, అమానవీయంగా చిత్రీకరిస్తూ పిచ్చి ఆనందం పొందుతున్నారు.

కొంగాల గుట్టల్లో పేలిన ప్రెజర్ బాంబ్

- ఒకరి మృతి

నవతెలంగాణ-వాజేడు



ములుగు ఏజెన్సీ ప్రాంతం వాజేడు మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో పోలీసులను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు సోమవారం పేలింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మరోపక్క బాంబ్ మోతతో అక్కడి ప్రజలు ఉలిక్కిపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టెల కోసం ఇల్లందుల ఏసు (55), ఇల్లందుల పకీర్, ఇల్లందుల పాల్గుణ, అరికెళ్ల లక్ష్మయ్య కలిసి సోమవారం ఉదయం కొంగాల అటవీ ప్రాంతానికి వెళ్లారు. గుట్టపైకి వెళ్తున్న సమయంలో దారిలో అమర్చిన బాంబు పేలి ఇల్లెందుల యేసు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన నలుగురికి ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. తెల్లవారుజామున ఒక్కసారిగా పేలిన ప్రెజర్ బాంబు శబ్దానికి చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని గుట్ట నుంచి కిందికి తీసుకువచ్చారు. సంఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

గోడ కూలి ఇద్దరు చిన్నారులు మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారులపై గోడ కూలి పడటంతో ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు, రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన నాజిం, అక్బర్.. కుటుంబాలు బతుకు తెరువు కోసం పదేండ్ల క్రితం కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలోని బాబురెడ్డినగర్ ప్రాంతానికి వలసొచ్చాయి. ఈ రెండు కుటుంబాలు స్థానికంగా ఉన్న కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. వీరి పిల్లలు నూర్జహాన్(8), ఆసిఫ్ ఫర్వీణ (3), మహ్మద్ అలీ, నాజిమా, అలిరేన్. ఈ ఐదుగురు ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. అయితే ఇంటి ప్రహరీ గోడ ఒక్కసారిగా కూలి వీరిపై పడింది. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు.. పిల్లలను బయటకు తీయగా అప్పటికే నూర్జహాన్, ఆసిఫ్ ఫర్వీణ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన పిల్లలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతి చెందిన చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ముగ్గురు చిన్నారుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చాలా కాలం క్రితం నిర్మించిన ఈ గోడ కొంతకాలం నుంచి పూర్తిగా శిథిలమైంది. కానీ ఇంటి యజమాని పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్, డీఆర్ఎఫ్ సిబ్బంది పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పరామర్శించారు. ఇంటి యాజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రాణహితలో మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-దహెగాం



ప్రాణహితలో మునిగి ఒకరు మృతిచెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా దహెగాం మండలంలోని రావులపల్లి గ్రామంలో జరిగింది.

ఎస్ఐ కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుడ్మెత గోవిందరావు(45) కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల తోగు వెంకటాపూర్‌లోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి వద్ద పనుందని కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరాడు. కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి గోవిందరావు లేడు. దీంతో చుట్టుపక్కల వెతికారు.

చివరకు తోగు వెంకటాపూర్‌లో వెతికించగా సోమవారం ఉదయం ప్రాణహిత నదిలో మృతదేహం లభ్యమైంది. అతని భార్య కసుమాంజలి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్ వైద్య బృందానికి గవర్నర్ ప్రశంసలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక గిరిజన యువకుడికి శస్త్ర చికిత్స చేసి కాపాడిన నిమ్స్ వైద్యులను రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ అభినందించారు. కొద్ది రోజుల క్రితం చత్తీస్‌ఘడ్‌లోని ఉసూర్ ప్రాంతానికి చెందిన సోది నంద శరీరంలోకి ప్రమాదవశాత్తు ఒక బాణం దిగింది. ఈ నేపథ్యంలో భద్రాచలం, వరంగల్ ఆస్పత్రులకు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో హైదరాబాద్ నిమ్స్‌కు అతడి బంధువులు తీసుకురాగా అతి తక్కువ సమయంలోనే అక్కడి వైద్యులు శస్త్ర చికిత్స చేసి నంద ప్రాణాలను కాపాడారు. ఈ క్రమంలో రాష్ట్ర గవర్నర్ నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పను, సీనియర్ వైద్యులు అమరేశ్వరరావు, డాక్టర్ గోపాల్‌ను రాజభవన్‌కు పిలిపించుకుని సత్కరించారు. వారు చేసిన కృషిని గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు.



లోక్‌సభ నియోజకవర్గాల

కౌంటింగ్ వివరాలు

క్రసం నియోజకవర్గం	పోలింగ్‌శాతం	పోలింగ్‌స్టేషన్లు	టేబుళ్లు	రౌండ్లు
1). అదిలాబాద్(ఎస్టీ)	77.04	2,200	114	23
2). మహబూబాబాద్(ఎస్టీ)	71.85	1,809	112	22
3). వరంగల్ (ఎస్సీ)	68.86	1,900	125	18
4). నాగర్ కర్నూల్ (ఎస్సీ)	69.46	2,057	120	22
5). పెద్దపల్లి (ఎస్సీ)	67.87	1,850	124	21
6). కరీంనగం	72.54	2,194	116	24
7). మెదక్	75.09	2,124	121	23
8). మల్కాజిగిరి	50.78	3,228	178	21
9). సికింద్రాబాద	49.04	1,810	119	20
10).నిజామాబాద్	71.92	1,808	140	15
11).జహీరాబాద్	74.63	1,973	112	23
12).హైదరాబాద్	48.48	1,944	108	24
13).నల్లగొండ	74.02	2,061	122	24
14).భువనగిరి	76.78	2,141	127	23
15).ఖమ్మం	76.09	1,896	116	21
16).మహబూబ్ నగర్	72.43	1,937	112	21
17). చేవెళ్ల	56.50	2,877	165	23

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జులై 7 నుంచి బోనాల జాతర

- అత్యంత వైభవంగా ఆషాఢం బోనాల ఉత్సవాలు నిర్వహిస్తాం
- ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు : కమిటీ అధ్యక్షులు గాజుల అంజయ్య



నవతెలంగాణ-ధూల్ పేట్

అత్యంత వైభవంగా ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని, జులై 7వ తేదీన గోల్కొండ అమ్మవారి బోనాల జాతర ప్రారంభమవుతుందని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు గాజుల అంజయ్య తెలిపారు. భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ మీరాలంమండిలోని ఆలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై 7వ తేదీన జరిగే గోల్కొండ అమ్మవారి బోనాల జాతరకు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామని తెలిపారు. 10వ తేదీన బల్కంపేట ఎల్లమ్మకు, 12న జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి, జులై 14వ తేదీన విజయవాడలోని కనకదుర్గమ్మకు, జులై 18న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళికి, 23వ తేదీన చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి ఆలయంలో, 25వ తేదీన శ్రీలాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారికి బంగారు పాత్రలో బంగారు బోనం, వడి బియ్యం సమర్పిస్తామని వివరించారు. పాతబస్తీలో అన్ని దేవాలయాల్లో జులై 19వ తేదీన కలశస్థాపన, ధ్వజారోహనతో ప్రారంభమవుతాయని తెలిపారు. జులై 21వ తేదీన శాలిబండలోని కాశీ విశ్వనాథ దేవాలయం నుంచి వివిధ దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి ఘటస్థాన సామూహిక ఊరేగింపు జరుగుతుందన్నారు. లాల్ దర్వాజ మోడ్ వద్ద పలువురు ప్రముఖులు అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకనున్నారని చెప్పారు. జులై 28వ తేదీన పాతబస్తీలోని అన్ని దేవాలయాల్లో పెద్ద ఎత్తున బోనాలు సమర్పిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రధాన దేవాలయాల అమ్మవార్లకు సంబంధిత మంత్రులు పట్టు వస్త్రాలు అందజేస్తారని తెలిపారు. అనంతరం 29వ తేదీన పాతబస్తీ ప్రధాన వీధుల్లో సామూహిక ఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు. బోనాల జాతర ఉత్సవాలకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకొని తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బీట్ ఆఫీసర్, వాచర్‌పై దాడి

- మద్యం మత్తులో అర్ధరాత్రి యువకుల దుశ్చర్య
- పలువురిపై కేసు నమోదు

నవతెలంగాణ-జన్నారం

మద్యం తాగిన మత్తులో కొందరు యువకులు అటవీ శాఖ అధికారులపై దాడి చేశారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తపాలాపూర్ ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ పులుల అభయారణ్యంలోని తాళ్లపేట రేంజ్ దమ్మన్నపేట అటవీ బీట్ ఆఫీసర్ అల్లం సాయికుమార్, వాచర్ శ్రీనివాస్ తపాలాపూర్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌పై విధుల్లో ఉన్నారు. రాత్రి 11గంటల సమయంలో అకస్మాత్తుగా వచ్చిన కొందరు యువకులు హంగామా చేశారు. తాను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అని చెప్పినప్పటికీ వినకుండా చేతికి ఉన్న కడెంతో శ్రావణ్ అనే వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తనతోపాటు వాచర్ శ్రీనివాస్‌ను కొట్టారని బీట్ ఆఫీసర్ తెలిపారు. దాడి చేసిన వారిలో ఇద్దరిని గుర్తించామని, ఆ ఇద్దరు దండేపల్లి మండలంలోని మేదరిపేటకు చెందిన ఆడెపు శ్రవణ్, తీగల ఉదయ్ అని చెప్పారు. గాయపడిన బీట్ ఆఫీసర్, వాచర్ లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్
మంగళవారం | జూన్ 04, 2024 | www.navatelangana.com

ఉద్యమకారులకు ఎమ్మెల్యే ఘన సన్మానం



నవతెలంగాణ-చైతన్యపురి

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అమర వీరుల కుటుంబాలను, ఉద్యమకారులను ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆర్.కె.పురం డివిజన్‌కు చెందిన ఉద్యమకారులైన నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, మంత్రి రవీందర్ రావు, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, సోమరాజు శ్రీరాములు, మహమ్మద్ జాహేద్, బాలు శ్రీ, ముచ్చింతల జగన్, శ్రీనివాస్ గౌడ్‌లను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు.



బాలాపూర్ లోని వై.ఐ.ఆర్ గార్డెన్స్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మేకల సంజీవ మాతమూర్తి మేకల నర్సమ్మ దశ దిన కర్మ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,మేయర్ చిగిరింత పారిజాత నరసింహా రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పన్నల రాజేందర్ రెడ్డి, నిరుడు శ్రీరాములు, శ్రీధర్, నాగరత్నం గ్రామ ప్రజలు, బంధువులు తదితరులు.. నవతెలంగాణ-బడంగ్‌పేట్

పాలిటెక్నిక్ ఫలితాల్లో లలిత్ మనోహర్ గుప్తాకు రాష్ట్ర రెండో ర్యాంకు



నవతెలంగాణ-మీర్‌పేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలిటెక్నిక్ పరీక్ష ఫలితాల్లో మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని త్రివేణి నగర్ చెందిన కె కిషోర్, శ్రీవేణి దంపతుల కుమారుడు కె.లలిత్ మనోహర్ గుప్తా 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో ర్యాంక్ సాధించాడు. దాంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ గర్వంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయి ఉండాలని సూచించారు.

వద్ధురాలు ఆత్మహత్య



నవతెలంగాణ-నాగోల్

మానసిక పరిస్థితి బాగోలేక అపార్ట్మెంట్ నుంచి దూకి ఓ వద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందూ అరణ్య పల్లవి అపార్ట్మెంట్‌లో నివసిస్తున్న ఎం నాగమణి(71) ఆదివారం అర్ధరాత్రి అపార్ట్మెంట్ రెండో అంతస్తు నుంచి దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలిని నాగోల్‌లోని సుప్రజ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఆమె మృతి చెందింది. మతురాలు రాసిన సూసైడ్ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన మరణానికి ఎవరూ కారణం కాదని, తమ కుటుంబ సభ్యులు కూడా బాగా చూసుకునేవారని అందులో రాసి ఉంది. మతురాలి కుమారుడు లక్ష్మీ నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు నాగోల్ పోలీసులు తెలిపారు.

పెద్దలలో టీబీ నివారణకు బీసీజీ టీకాపై అధ్యయనం



నవతెలంగాణ-హాయత్‌నగర్

పెద్దలలో టీ బీ నివారణకు బీసీజీ టీకాపై అధ్యయనం జరుగుతున్నట్టు రంగారెడ్డి జిల్లా వైద్య అధికారి వెంకటేశ్వర రావు తెలిపారు. ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025నాటికి మన దేశంలో క్షయ వ్యాధి ని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు 18సంవత్సరాలు పై బడిన వారందరికీ క్షయ వ్యాధి నివారణ టీకాలు వేయాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. 18సంవత్సరాలు పై బడిన వ్యక్తులు, గత 5సంవత్సరాల్లో క్షయ బారిన పడిన వారు, వారి కుటుంబ సభ్యులు, పొగ తాగిన వారు, 60సంవత్సరాలకుపై బడిన వారు,హెచ్ ఐ వీ,మధు మేహ వ్యాధి గ్రస్తులు, శారీరకంగా, బలహీనంగా ఉన్న వారు ఈ వ్యాక్సిన్ తీసుకోవడానికి అర్హులు అని చెప్పారు. ఈ టీకాల ద్వారా ఎలాంటి దుష్పలితాలు ఉండవన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఈ టీకా ని మొదటగా రంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నారన్నారు. బీ సీ జీ వ్యాక్సిన్ అధ్యయన కార్యక్రమం(పైలట్ ప్రాజెక్ట్)కోసం తెలంగాణ రాష్ట్రంలో 17జిల్లాలని ఎంపిక చేయగా అందులో రంగారెడ్డి జిల్లా ఒకటన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం పీ హెచ్ సీ,బస్తీ దవాఖాన,పల్లె దవాఖాన వైద్యులకు,సూపర్ వైజర్ లకు శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధి కారి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి అరుణ కుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణ కుమారి,డిప్యూటీ జిల్లా వైద్యాధి కారి గీతా,డాక్టర్స్ వినోద్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులను ఆధునికరించాలి

- తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ వత్తిదారుల సంఘం ఉపాధ్యక్షులు సుంకోజు యాదగిరి చారి

నవతెలంగాణ-మీర్‌పేట్

రాష్ట్రంలో కులవృత్తులను ఆధునికరించాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర విశ్వకర్మ వృత్తిదారుల సంఘం ఉపాధ్యక్షులు సుంకోజు యాదగిరి చారి డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిస్తున్న సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత పది సంవత్సరాలలో రాష్ట్రంలో కుల వృత్తులకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆధునికరణ సైతం ఏమాత్రం చేయలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం నాయకత్వంలో వివిధ కులవత్తుల ప్రజలు ఆశించిన స్థాయిలో వృత్తి పనులు అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కులవృత్తిదారులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ఆధునిక పద్ధతిలో శిక్షణ ఇచ్చి ఆధునికరించాలని కోరారు. అనేక కార్పొరేట్ కంపెనీలు కులవృత్తుల పేర్లు మార్చి కొత్త పేర్లతో వినియోగదారులను ఆకర్షిస్తూ వ్యాపారాలను ప్రారంభిస్తున్నాయని అదే తరహాలో రాష్ట్రంలో ఉన్న కులవృత్తులను వత్తిదారులను ప్రోత్సహిస్తూ అవకాశం కల్పిస్తూ అభివద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ చైర్మెన్‌గా కొండ శ్యాం సుందర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడ గ్రామంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీ నూతన చైర్మెన్‌గా కొండ శ్యాం సుందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామ పెద్దలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చైర్మెన్ కొండ శ్యాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ప్రకటించారు. వైస్ చైర్మెన్‌గా శివ, ప్రధాన కార్యదర్శిగా జక్కిడి మారుతి రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గుర్రం విశ్వనాథ్ రెడ్డి, కోశాధికారిగా గొరిగే సత్తి, డైరెక్టర్లుగా గుర్రం రేవంత్ రెడ్డి, కొండల్ రెడ్డి, పి.అరుణ్ గౌడ్, శ్రీనివాస్ చారి, కొలన్ మహిపాల్ రెడ్డి, అర్ల ప్రవీణ్,పుట్టగల్ల అశోక్ లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు చెప్పారు.దేవాలయ అభివద్ధితో పాటు గ్రామ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం తన వంతు కషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకం ఉంచి భాధ్యత అప్పగించిన ప్రజలకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

కార్మికుల కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. సంతోష్ నగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం గేటు ముందు కార్మికు లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఏఆర్, సీఐఆర్ఏ యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే క్రీడా యజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు గత 30 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నా వారికి సరైన వేతనం లేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారా నికి కనీస వేతనాలు పెంచాలని, కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణ మే కనీస వేతనాలను సమస్యలు పరిష్కరించాలని లేనిచో కార్మిక వర్గం సమ్మెలోకి వెళ్తుందని హెచ్చరించారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలని, మేనేజ్మెంట్ దఫదఫాలుగా చర్చలు జరిపి కాలయాపన చేస్తున్నదని ఆయన అన్నారు. సెంటర్ లేబర్ కమిషనర్‌లో జరిగినటువంటి మేనేజ్మెంట్ చర్చలలో త్వరలోనే వేతనాలు పెంచుతామని మినిట్స్‌లో సంతకాలు పెట్టి నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు పెంచలేదన్నారు. అందుకని కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులతో కలిసి సీఐటీయూ సమ్మె చేపడుతుందని తెలిపారు. సమ్మెకు క్రీడ మేనేజ్మెంట్ బాధ్యత వహించాలన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

బేకరీలో అగ్నిప్రమాదం





నవతెలంగాణ-మలక్‌పేట్

మలక్‌పేట్ ప్రాంతంలో ముసారం బాగ్ చౌరస్తాలోని రెడ్ రోజ్ బేకరీలో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం బేకరీలో భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు మలక్‌పేట పోలీసులు, అగ్ని మాపక సిబ్బ ందికి సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదు అగ్ని మాపక యంత్రాలతో అక్కడకు చేరుకుని మూడు గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బేకరీలో స్వీట్లు,కేకుల తయారీకి వాడే నూనె డబ్బాలు పగిలి రోడ్డు పైకి రావడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదంగా మారింది. కొంత మంది వాహనదారులు జారీ పడ్డారు. ఇక అగ్ని ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు



నవతెలంగాణ-మీర్‌పేట్

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళ అధ్యక్షురాలు జమాల్పూర్ సునీత బాల్ రాజ్ ఆధ్వర్యంలో నందీహిల్స్ చౌరస్తాలో మూడో రోజు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ 8,9,10వ డివిజన్ల నాయకులు కోప్షన్ సభ్యులు రజాక్, డివిజన్ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, నర్సిరెడ్డి, జగల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, సింగం రాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడ చందనచెరువు ప్రాంగణంలో..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందనచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆయచిత్తం శ్రీధర్ తదితరులు పాల్గొని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తీరుతెనులను నాయకులు, ప్రజలకు వివరించారు.



చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు అరెస్ట్



నవతెలంగాణ-నాగోల్

ఈ నెల 1న నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ జరిగిన స్నాచింగ్ దోపిడి కేసులో చేధించి ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు నాగోల్ పోలీసులు తెలిపారు. ఈనెల 1న ఉదయం ఐదు గంటల ప్రాంతంలో మన్సూరాబాద్ గ్రామానికి చెందిన గడ్డం కౌసల్య అనే వృద్ధురాలి మెడలో నుంచి ఐదు తులాల బంగారం గొలుసును ముసుగులు ధరించి ఇద్దరు దుండగులు దోచుకెళ్లి మోటార్ సైకిల్ పై పారిపోయిన సంగతి తెలిసిందే. కేసు దర్యాప్తులో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుండగా మన్సూరాబాద్ చౌరస్తాలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ఇద్దరు అనుమానితులను పోలీసులు ఎక్కడికి వెళుతున్నారని ప్రశ్నించగా వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వారిని పూర్తిస్థాయిలో విచారణ చేయగా మన్సూరాబాద్ లో జరిగిన గొలుసు దొంగతనంలో వారి ప్రమేయం ఉన్నట్లు తేలిందని దీంతో నేరంలో పాల్గొన్న నిందితులు సుంకిరెడ్డి శశిధర్ రెడ్డి, దేవులపల్లి సాయికుమార్ రెడ్డి, మునగాల శివారెడ్డిలు నేరం అంగీకరించారని పోలీసులు పేర్కొన్నారు. ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ తరలించినట్లు నాగోల్ పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి చోరీకి గురైన ఐదు తులాల బంగారు గొలుసు, మూడు మొబైల్ ఫోన్లను ,ఒక హీరో గ్లామర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నల్లగొండ జిల్లాకు చెందిన వారు కాగా వారిపై ఇప్పటికే పలు నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు నాగోల్ పోలీసులు తెలిపారు.

వైభవ్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హస్తినపురం

హస్తినపురం డివిజన్ పరిధిలోని జెడ్.పీ.రోడ్డు రహదారిపై నూతనంగా ఏర్పా టు చేసిన వైభవ్ రెస్టారెంట్ ను ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటా ్లడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువత ఆహారం విషయంలో విన్నూతంగా ఆలోచించడం జరుగుతుందని, వారి ఆలోచన లు తగ్గట్టుగా వారికి రుచికరమైన ఆహారం అందించాలని నిర్వ హకులను కోరారు. వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదగాలని సినీ నటుడు శివా రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గజ్జల మధు సూదన్ రెడ్డి,నిర్వాహకులు అనంత్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తిరుమల రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆందోజ్ సత్యంచారి, రఘుమా రెడ్డి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలి

- గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షులు కానుగుల అరుణ్



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో గుర్తింపు లేకుండా నడుపుతున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న విద్యా సంస్థల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షులు కానుగుల అరుణ్ ఒక ప్రకటనలో సోమవారం డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజులు వసూలు చేయకుండా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలే తనకంటూ ఒక చట్టం ఉన్నట్టుగా ఏర్పాటు చేసుకొని, వాళ్లకు నచ్చిన విధంగా ఫీజు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ఎల్బీనగర్ డివిజన్ పరిధిలో ఎల్‌కేజీ విద్యార్థికి రూ. రెండు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఫీజు వసూలు చేస్తున్నట్టు, అనేక పత్రికలలో వచ్చిందని, కానీ విద్యాధికారులు ఏ విద్యా సంస్థల్లో ఎన్ని ఫీజులు ఉండాలని బహిర్గతంగా ప్రకటిం చకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రయివేటు కార్పొరేట్ పాఠ శాలలో బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్టు అమ్మడం నేరమైనప్పటికి, చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యాధికారులు ఇప్పటికైనా స్పందించి అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, విద్యా సంస్థల్లో ఫీజులను అరికట్టే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ హయాంలో పైరవీకారులదే రాజ్యం

- ఉద్యమకారులు, సాహితీవేత్తలను అణిచి వేసిన కేసీఆర్
- అందెల శ్రీరాములు యాదవ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బీఆర్ఎస్ సర్కారులో ఉద్యమ కారుల కంటే పైరవీకారులకే పదవులు దక్కాయని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులు, సాహితీ వేత్తలు, మేధావులు, విద్యార్థిలోకాన్ని బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో గుర్తించకుండా సీఎం కేసీఆర్ అణిచి వేశారని తెలిపారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో బాలాజీ నగర్ కాలనీ వద్ద తెలుగుతల్లి విగ్రహానికి వారు పూలమాల వేసి అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ 1969 నుంచి 2014 వరకు వేలాది మందిని బలిగొన్న కాంగ్రెస్‌కు ఉద్యమం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. పార్లమెంట్ లో నాటి బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ తెలంగాణ కోసం రాజీ లేని పోరాటం చేశారని కొనియాడారు. అనంతరం తెలంగాణ సాధన కోసం కృషి చేసిన నాయకులతో మాట్లాడి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. నిధులు, నియామకాలు, నీళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ దష్టి పెట్టాలని కోరారు. పార్టీ బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు నడకుడి యాదగిరి, మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షులు రామకష్ణారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాప్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చిత్రం శ్రీను, రేసు నర్సింహారెడ్డి, మంత్రి మహేష్ ముదిరాజ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో కరాటే ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది



- సినీనటుడు సుమన్

నవతెలంగాణ-తుర్కయంజాల్

చిన్నారుల్లో కరాటే ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని సినీనటుడు, మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు సుమన్ అన్నారు. తుర్కయంజాల్‌లోని వీఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ 30వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. మలేషియా, గోవాలో జరిగిన ప్రపంచ కరాటే ఛాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అలాగే వీఎస్ అకాడమీ సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా దిగ్విజయంగా అకాడమీని నిర్వహించి వందలాదిమంది చిన్నారులకు ధైర్యం, ఆత్మ విశ్వాసాన్ని, శారీరక దృఢత్వం అందించినందుకు సంస్థ అధిపతి నరేందర్ ను ప్రత్యేకంగా అభినందించారు. కరాటే శిక్షణ తీసుకోవడం వల్ల జీవితంలో ఎటువంటి సమస్యనైనా తట్టుకొనే శక్తి చిన్నారులకు వస్తుందన్నారు. అలాగే సంస్థ విద్యార్థులు బంగారు, సిల్వర్‌తో పాటు ఇతర పథకాలు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆటలతో పాటు, చదువులోనూ ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. శారీరక, మానసిక ధృడత్వానికి కరాటే దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్ అకాడమీ చైర్మెన్ నరేందర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, కొత్త కుర్మ శివకుమార్, జొన్నాడ వెంకట రెడ్డి, సీనియర్ మాస్టర్లు ఎం.నర్సింగ్, కె. గణేష్, కె. సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది కాలంలో అభివృద్ధి చెందిన తెలంగాణ

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- రోగులకు పండ్ల పంపిణీ



నవతెలంగాణ-వనస్థలిపురం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి నందు రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివద్ధి చెంది ందని తెలిపారు. అదే విధంగా ఎల్.బి.నగర్ నియోజకవర్గం ఎంతో అభివద్ధి చెందిందని గుర్తు చేశారు. నాగోల్ నందు ఎస్.టీ.పీ.ప్లాంట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి అని తెలిపారు. అలాగే ఎస్.ఎన్.డి.పీ. పనుల వల్ల ఎన్నో సత్ఫలితాలు వచ్చాయన్నారు. అట్టి పనుల్లో భాగంగా ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించినట్టు చెప్పారు. ఇంకా కొన్ని పనులు చివరిదశలో ఉన్నాయని వాటిని కూడా అధికారుల దష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రధాన ట్రాఫిక్ సమస్యలు ఉన్న చోట స్కై, ఫ్లైఓవర్లు నిర్మించినట్టు చెప్పారు. అలాగే పేద ప్రజలకు మరింత వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మిస్తున్నదని అవి ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే రాబోయే రోజుల్లో ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధి లోని మరికొన్ని ఫ్లైఓవర్లు నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్.ఎం.ఓ. కష్ణ, వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, గజ్జల మధుసూదన్ రెడ్డి, సుమన్ గౌడ్, మాధవరం నర్సింహారావు, మధుగౌడ్, సామ బుచ్చిరెడ్డి, శివశంకర్, సత్యంచారి, ఖైసర్, సంజయ్, మిట్ట రామ్మోహన్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భార్య కేసు పెట్టడంతో భర్త అదృశ్యం



నవతెలంగాణ-జవహర్ నగర్

మద్యానికి బానిసైన భర్త పై భార్య పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టడంతో భర్త అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగ రాజు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నూతలపాటి లక్ష్మి రామలింగయ్య ఆర్మీ రిటైర్డ్. మద్యానికి బానిసై భార్య లక్ష్మిని ఇబ్బందులు పెడుతుండేవాడు. ఇటీవల అధిక మద్యం సేవించి భార్యపై శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేశాడు. దాంతో అతని పై పోలీస్ స్టేషన్‌లో భార్య లక్ష్మి ఫిర్యాదు చేసింది. దీంతో రామలింగయ్య గత శుక్రవారం ఎవరికీ సమాచా రం ఇవ్వకుండా ఇంటి నుండి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. అతని కోసం బంధు వుల ఇండ్లల్లో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం లక్ష్మి జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును వారి జన్మదినం పురస్కరించుకొని వారి స్వగృహంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, పాన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్ రెడ్డి, కొత్త రామారావు , బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. నవతెలంగాణ-కాప్రా



రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ ఆదేశానుసారం డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్‌లోని రౌండ్ బిల్డింగ్ వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ జెండా ఎగరవేశారు. తదంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, జి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, బేతాళ బాలరాజు, షేర్ మణెమ్మ, శిరీష రెడ్డి, సత్యనారాయణ, రామ్ భద్రయ్య, భాస్కర్ , సత్యనారాయణ గౌడ్, గడ్డం శీను, మొగులయ్య, పంతులు నరసింహ, సకినాల రవి, పెద్దాపురం కుమార్, హరినాథ్ రెడ్డి, బి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

నేడే కౌంటింగ్

- మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధం
- తొలుత పోస్టల్ బ్యాలెట్.. తర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకే కౌంటింగ్ ప్రారంభం
- ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు



నవతెలంగాన-సిటీబ్యూరో

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసిం ది. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్ప ల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కీసరలోని హెలీ మేరీ కాలేజీలో నిర్వహిస్తారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ఓట్లను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఓట్లను సీఎస్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వెస్లీ కాలేజీలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రెండు రౌండ్లలో పూర్తి చేస్తారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 20 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కవర్ ఓపెన్ చేసి డిక్లరేషన్, వ్యాలిడిటీ, ఇన్ వాలిడ్ ఓట్లను వేర్వేరు చేసి జాగ్రత్తగా ధ్రువీకరించుకుని బండల్స్ చేసి లెక్కించాలి. ఎలాంటి తప్పిదాలకు అవకాశాల్లేకుండా ఈసీ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని ఇప్పటికే ఆదేశాలు అందాయి. కౌంటింగ్ కేంద్రంలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

ఏర్పాట్లు పూర్తి

లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే ఓట్ల లెక్కింపునకు అవసరమైన సిబ్బందిని కేటాయించి, వారికి శిక్షణ కూడా ఇచ్చారు. రెండు విడతల్లో సిబ్బంది ర్యాండమైజేషన్ జరిపి, ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని కేటాయించారు. టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, సూపరింటెండెంట్, మరో అసిస్టెంట్‌ను నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి టేబుళ్ల ఆధారంగా సిబ్బంది కేటాయింపులు చేశారు. లెక్కించిన ఓట్ల వివరాలను వెంటనే ఎన్‌కోర్ పోర్టర్‌లో నమోదు చేస్తారు. గుర్తింపు పొందిన పార్టీల తరుపున, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన వారికి టేబుల్ ఒక ఏజెంట్ చొప్పున అవకాశం కల్పించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకే ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకునేలా ఇప్పటికే ఆదేశాలిచ్చారు.

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు

మల్కాజిగిరి లోక్‌సభ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీ వారీగా ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేశారు. రౌండ్ల వారీగా ఓట్లు లెక్కించి రిటర్నింగ్ అధికారి వివరాలు వెల్లడిస్తారు. ఈ కౌంటింగ్ ప్రక్రియలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్లు కీలక పాత్ర పోషించనున్నారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోనున్నారు. ఈవీఎంలలో ఏమైనా సాంకేతిక లోపం తలెత్తితే వెంటనే నిపుణులకు సమాచారం ఇవ్వనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తిరస్కరణకు గురైతే ఇందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని ఈసీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

ఈవీఎంల కౌటింగ్ వివరాలు ఇలా..

అసెంబ్లీ నియోజకవర్గం	కౌంటింగ్ హాల్స్	టేబుల్స్
మేడ్చల్	4	28
మల్కాజిగిరి	1	20
కుత్బుల్లాపూర్	1	28
కూకట్‌పల్లి	1	20
ఉప్పల్	1	20
ఎల్బీనగర్	1	28
కంటోన్మెంట్	1	14
పోస్టల్ బ్యాలెట్	1	20



డ్రయినేజీ పైప్ లైన్‌ను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా

డిసి కాలనీలో ఉన్న డ్రయినేజీ పైప్ లైన్ ను కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. నూతనంగా ఏర్పడిన కాలనీ అవ్వడంతో స్థానికులే అప్పుడు చిన్న పైప్ లైన్ అమర్చుకున్నారు. పైన ఉన్న కాలనీల నుంచి వరద ప్రవాహం పెరడగడంతో తరచూ సమస్య వస్తుందని గుర్తించారు. మొన్న వచ్చిన వర్షానికి మరల డ్రయినేజీ పొంగి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలియడంతో పెద్ద పైప్‌లైన్ అమర్చాలని అధికారులకు,సిబ్బందికి కార్పొరేటర్ సూచించారు.ఎలక్షన్ కోడ్ ముగియగానే మొదటగా పనులు చేస్తామని,ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ పనులు చేపడతామని కాలనీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ. సందీప్. సైట్ ఇంజనీర్ ప్రశాంత్, యూజీడీ భరత్, కాంగ్రెస్ డివిజన్ నాయకులు ప్రభు గౌడ్, కాలనీ వాసులు ఉమామహేశ్వర్, వెంకట్ రెడ్డి, అంబదాస్, కుమార్, అలివేలు, సరస్వతి, రత్నమ్మ, శ్రీలత, రాములు, లక్ష్మి నగర్ ఆర్ శ్రీనివాస్ రెడ్డి, నర్సింహా రెడ్డి, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థికి బీఎల్ఆర్ చేయూత

నవతెలంగాణ-కాప్రా

నల్లగొండ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి శ్రావణికి కాలేజీ ఫీజును బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందజేయించారు.



బాధిత కుటుంబానికి కార్పొరేటర్ పరామర్శ

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ఉద్యమకారుడు,యువజన నాయకుడు తెలంగాణ సంపత్ తల్లి హైమవతికి ఆరోగ్యం బాగోలేదని తెలియడంతో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట నాయకులు ఉన్నారు.



ఘనంగా తిప్పని సంపత్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఉప్పల్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తిప్పని సంపత్ జన్మదిన వేడుకలను రామంతాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాయకులు గంధం జోష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు కృషి



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- జర్నలిస్టులకు ఎమ్మెల్యే చేతులమీదుగా హెల్త్‌కార్డులు అందజేసిన టీఎక్స్ ఆస్పత్రి

నవతెలంగాణ-ఉప్పల్

జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో టీఎక్స్ హాస్పిటల్ యాజమాన్యం ఉప్పల్ జర్నలిస్టులకు అందిస్తున్న రాయితీతో కూడిన ప్రీమియం హెల్త్ కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు ఉప్పల్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి డాక్టర్లు తగు వైద్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప్పల్ జర్నలిస్టుల సంక్షేమం కోసం టీఎక్స్ హాస్పిటల్ యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. వృత్తిరీత్యా జర్నలిస్టులు నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, వారి ఆరోగ్య భద్రత కోసం తన వంతు సహాయ సహకారాలు కూడా అందిస్తామన్నారు. అంతకుముందు టీఎక్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆపరేషన్ చీఫ్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం తాము ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులందరికీ కొన్ని పరీక్షలను ఉచితంగా మరికొన్ని పరీక్షలను అత్యంత చౌకగా అందిస్తామన్నారు. తమ ఆస్పత్రి అందిస్తున్న ప్రీమియం హెల్త్ కార్డుతో జర్నలిస్టులు ఎవరి సిఫార్సులు లేకుండానే నేరుగా హాస్పిటల్ కు వచ్చి రాయితీ ధరలకు పరీక్షలు చేయించుకుని ఉచితంగా వైద్యులను సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ టీఎక్స్ హాస్పిటల్ అడ్మిన్ నవీన్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డి. వెంకట్ రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరోత్తం రెడ్డి, సలహాదారులు ధూపాటి సురేష్, కంచుకట్ల శ్రీనివాస్, వల్లా మహేందర్ రెడ్డి, వడ్డేపల్లి కిషోర్, రాజు, క్లబ్ ఉపాధ్యక్షులు మాదిరాజు సురేష్, ఏవి శ్రీధర్ రావు, పారెల్లి సాగర్, కోశాధికారి ఆర్. యాదగిరి గౌడ్, సంయుక్త కార్యదర్శులు జి శివాజీ, జి శేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం అశోక్, డి రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ కళాశాల ఆధ్వర్యంలో గ్లోబల్ అలుమ్ని మీట్



నవతెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గ్లోబల్ అలుమ్ని మీట్‌ను అమెరికాలోని డల్లాస్ నగరంలో ఘనంగా నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.ఈ సమావేశానికి సీఎంఆర్ కళాశాలలో చదువుకొని అమెరికాలో స్థిరపడిన విద్యార్థులు,ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ కలిసుకుని ప్రపంచ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, సీఎంఆర్ విద్యాసంస్థల కార్యదర్శి చామకూర గోపాల్ రెడ్డిలు హాజరయ్యారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థలలో చదువుకున్న విద్యార్థులు వివిధ దేశాలలో స్థిరపడి ఉన్నారని గుర్తు చేశారు. చామకూర గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థల్లో చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడినందుకు సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు నేర్చుకున్న టెక్నాలజీని ఇండియాలో కూడా ఉపయోగపడే విధంగా కృషి చేయాలని మార్గనిర్దేశనం చేశారు. మీ సూచనలు,సలహాలు ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమని అన్నారు. మీరు పనిచేసే సంస్థలలో ఎలాంటి వస్తువులు తయారు చేస్తారు దాని తయారీ విధానాన్ని ఇండియాకు వచ్చినప్పుడు తప్పని సరిగా సీఎంఆర్ కళాశాలకు వచ్చి మీ అనుభవాలు,సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులందరికి సీఎంఆర్ కళాశాల డైరెక్టర్ హిమబిందు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ లు,డీన్ లు, హెచ్ఓడిలు,అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలు చూసే యాప్..

- తయారు చేసిన సీఎంఆర్ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలో ఉన్న సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఎంఆర్ సెట్ థర్డ్ ఇయర్ విద్యార్థులు,గ్రేడియస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల ఆధ్వర్యంలో ఎన్నికల ఫలితాలను సులువుగా తెలుసుకునేందుకు వీలుగా result2024.in అనే యాప్‌ను తయారు చేశారు. ఈ అప్లికేషన్ దాని డేటాను అధికారిక ఎన్నికల సంఘం వెబ్ సైట్ నుంచి నేరుగా పొందుతుందని విద్యార్థులు తెలిపారు. అభ్యర్థుల వివరాలు కూడా సవివరంగా ఉంటాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సమాజానికి ఉపయోగపడే సాంకేతిక అంశాలను ఇంకా ఎన్నో తయారు చేయాలని కళాశాల కార్యదర్శి గోపాల్ రెడ్డి విద్యార్థులకు సూచించారు.కళాశాల ప్రిన్సిపల్ మేజర్ డాక్టర్ వి.ఎ. నారాయణ,డైరెక్టర్ హిమబిందు,అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి

- డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ అధికారులను కోరారు. సోమవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కౌన్సిల్ హల్ లో కమిషనర్ త్రిలేశ్వర్ రావు తో కలసి కార్పొరేటర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 26 డివిజన్లలో రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కావాల్సిన వసతులు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా ముంపు ప్రాంతాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టిన ఎస్ఎన్డీపీ ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చెయ్యాలని, అదే విధంగా రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చెయ్యాలని డిప్యూటీ మేయర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో అప్షన్ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య పనులు నిర్వహించాలి



- నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రభుత్వ పాఠశాలలు త్వరలో ప్రారంభం కానుండటం తో నాగారం మున్సిపాలిటీ లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని నాగారం మున్సిపల్ ఛైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ లోని ప్రభుత్వ పాఠశాల పరిసరాలను, బిల్డింగ్ పైన ఉన్నటువంటి ప్రదేశాలను, టాయిలెట్ లను ఛైర్మెన్ పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యే రోజు వరకు అన్ని ప్రభుత్వ పాఠశాల నందు పారిశుధ్య పనులు, క్లీనింగ్ అవ్వాలని సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ జి. రాజేందర్ కుమార్ , మున్సిపల్ మేనేజర్ కె. చంద్రశేఖర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన సందర్భంగా ఆయనకు కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు పుష్పగుచ్ఛాన్ని అందించారు.
నవతెలంగాణ-కాప్రా



మలిదశ ఉద్యమంతో సరికొత్త విప్లవం



- తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే.
- ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకల ముగింపులో భాగంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ సూచనలతో పార్టీ కార్యాలయంలో జాతీయజెండాను కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి, పార్టీ జెండా ను ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆవిష్కరించి రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులందరికీ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... 2001లో మలిదశ ఉద్యమంతో సరికొత్త విప్లవం సృష్టించి చరిత్రను తిరగరాసి తెలంగాణ రాష్ట్ర సమితి అనే పార్టీని స్థాపించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. జాతి కోసం ప్రాణాలు అర్పించినా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం దశాబ్ద కాలంలోనే అద్భుతమైన ప్రగతిని సాధించిందన్నారు. తెలంగాణ సాధన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దశాబ్ది వేడుకల సందర్భంగా తెలంగాణ మరింత అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,డివిజన్ల అధ్యక్షులు జావీద్ ఖాన్, ఆంజనేయులు, బాలరాజు,వెంకన్నయాసారం శ్రీనివాస్, కిరణ్, జగన్ రెడ్డి,శంకర్ రావు, జోగి రెడ్డి,మల్లం వెంకట్ గౌడ్, వరికల శ్రీనివాస్, చిర్ర సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | జూన్ 04, 2024 | www.navatelangana.com

జహంగీర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బేగంపేట డివిజన్ మైనార్టీ మాజీ అధ్యక్షుడు జహంగీర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కాలును కొల్పోయాడు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, డివిజన్ అధ్యక్షులు సురేష్ యాదవ్‌లు సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జహంగీర్ కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ధైర్యంగా ఉండాలని హామీ ఇచ్చారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కొలన్ శ్రీనివాస్ రెడ్డిని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్‌ల ప్రజలు కలిసి వారి సమస్యలను తెలియజేశారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి, ప్రజా సమస్యల పరిష్కారానికి, పజా సంక్షేమమే తమ ధ్యేయమని, దానికోసం తాను ఎల్లప్పుడు ముందుంటనన్నారు. ప్రజలు తమ సమస్యలు ఏవైనా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.
నవతెలంగాణ-దుండిగల్

ముగిసిన దశాబ్ది వేడుకలు





- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

అమరవీరుల త్యాగాల ఫలితంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు అవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు దశాబ్ది వేడుకల ముగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ జెండా, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మట్లాడుతూ సమైక్య పాలకుల పాలనలో తెలంగాణ ప్రాంతం నీళ్లు, నిధులు, నియామకాల్లో అడుగడుగున వివక్షకు గురైందన్నారు. ఈ వివక్షతతో స్వరాష్ట్ర సాధనతోనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఆమరణ నిరాహారదీక్షతో రాష్ట్రాన్ని సాధించారన్నారు. బీడు భూములతో ఎంతో వెనుకబడిన తెలంగాణ ప్రాంతాన్ని పదేండ్ల కాలంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధితో బంగారు తెలంగాణగా మార్చారన్నారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మరిచి పేర్లను, లోగోలను మారుస్తూ కాలం గడిపేస్తుం దన్నారు. నాడు పరిశ్రమలకు స్వర్గధామంగా నిలిచిన హైదరాబాద్ నగరం నేడు కాంగ్రెస్ పాలకుల అవగాహ న లేమి, అనుభవ రాహిత్యంతో పరిశ్రమలు హైదరా బాద్‌ను వదిలి ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్ళిపోతున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పలువురు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను రోడ్ల పై కాకుండా.. స్వచ్ఛ ఆటోలోనే వేయాలి



- జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది

నవతెలంగాణ-బాలానగర్

చెత్తను రోడ్లపై కాకుండా... స్వచ్ఛ ఆటోలోనే వేయాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని దిల్ కుష్ నగర్ ప్రెసిడెంట్ ఎండీ అబ్దుల్ ముజీబ్, జనరల్ సెక్రటరీ ఎండీ. ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ సలీమ్, జాయింట్ సెక్రటరీ ఎండీ ముఖ్తర్, అడ్వైజర్లు మహబూబ్ అలీ సాహెబ్, ఎల్లయ్య, తదితరులు అసోసియేషన్ సభ్యులు జీహెచ్ఎంసీ అధికారల ఎస్ఎస్ మనోహర్ రెడ్డి, జవాన్లతో సమావేశం నిర్వహించారు. నర్సింగ్ రావు, డా.మమత, ఎస్.ఎఫ్.ఎ. భోళా శంకర్, దిల్ ఖుష్ నగర్ కొత్త రోడ్డులో పడుతున్న చెత్త సమస్య గురించి, వ్యాధులు, వివిధ రోగాలు, వచ్చే విధంగా స్థానిక ప్రజలు చెత్తను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాలలో జీహెచ్ఎంసీ కంట్రోల్ బూత్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వారిని అడ్డుకునేందుకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రతీ ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరించేందుకు, చెత్త సేకరించే వాహనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెలా బస్తీ నాయకులతో సమావేశాలు నిర్వహించి మన పరిసరాల్లో చెత్త వేయడం వల్ల కలిగే లోపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

డ్రయినేజీ పనులను పూర్తి చేయండి





- అధికారులకు బస్తీవాసులు మొర

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీనదయాల్ నగర్ బస్తీలో డ్రయినేజీ పైపులు సగం వరకు మాత్రమే వేసి ముగించి వదిలేశారు. అభివృద్ధి పనులను పూర్తి చేయాల్సిన ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ కూడా మారడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారినా నియోజకవర్గంలో అభివృద్ధి పనులును కొనసాగించాల్సిన స్థానిక ప్రజా ప్రతినిధులు బస్తీ అభి వృద్ధి పనులను అసంపూర్తిగా వదిలేసిన వారిపై ఎలాం టి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం 2023లో సగం డ్రయినేజీ పైపులు వేసి, ఆరు నెలలు గడిచినప్పటికీ అభివృద్ధి పనులకు నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తు న్నాయి. నిధులు మంజూరు చేసినప్పటికీ అభివృద్ధి పనులను కొనసాగడం లేదని ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. ఇదేమిటని బస్తీ నాయ కులు కాంట్రాక్టర్‌ను అడిగితే ప్రభుత్వం మారిందని మేమేం చేయలేమని చేతులెత్తేస్తున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బస్తీ వాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అసంపూరితగా ఉన్న డ్రయినేజీ పనులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బస్తీ వాసులు కోరారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కీసర

రాంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998 - 1999 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థి చీర ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మతి చెందగా వారి పిల్లల చదువుల కోసం పదవతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేసీ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఇక ముందు మిత్రుడు ఆంజనేయులు కుటుంబానికి చేదోడుగా ఉంటామన్నారు. అంతకు ముందు పూర్వ విద్యార్థులు మిత్రుడు ఆంజనేయులు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలోఎల్లసాని బాలరాజు, శ్రీశైలం, మీసాల మల్లేష్, మీసాల భాస్కర్, జిన్నా శ్రీనివాస్, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తోటకూర సుధాకర్ రెడ్డి, చీర గోపాల్, పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా, దిలీప్ ధ్యాన్ దేవ్, నిరంకర్‌సింగ్, మన్‌జూర్ అహ్మద్ ఖాద్రి, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పర్యవేక్షణలో చేపట్టారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఏన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం టేబుల్స్ 158, కౌంటింగ్ సూపర్ వైజర్స్ 158, కౌంటింగ్ అసిస్టెంట్స్ 158, మైక్రోఅబ్జర్వర్స్ 158, ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఈఓ విజయకుమారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'డాక్టర్స్ ఓన్లీ' బ్యాడ్మింటన్ టోర్నమెంట్



- పల్స్ హార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రత్యేకంగా డాక్టర్ల కోసమే, డాక్టర్లే క్రీడాకారులుగా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను పల్స్ హార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించింది. మాదాపూర్‌లోని గేమ్ పాయింట్‌లో జరిగిన ఈ టోర్నమెంటులో తెలంగాణ లోని వేర్వేరు ప్రదేశాలు, వేర్వేరు హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎప్పుడూ బిజీగా కనిపించే వైద్యులు కాస్త ఉల్లాసంగా, బ్యాట్మింటన్ ఆడుతూ, తోటి వైద్యులతో సరదాగా సమయం గడిపుతూ కనిపించారు. "అసలు విశ్రాంతి లేకుండా నిరంతరం వత్తిలో మునిగిపోయి ఉండే వైద్యులకు మేమిచ్చే చిన్న ప్రశంస ఈ టోర్నమెంటు. వైద్యులకు శారీరక, మానిసక ఆరోగ్యం చాలా ముఖ్యమని మేం నమ్ముతాం. ఆ క్రమంలోనే మెడికల్ ఫీల్డులోని వారిలో ఒక సమతుల జీవన శైలి (బాలెన్స్డ్ లైఫ్ స్టైల్) పెంపొందించడానికి, ప్రోత్సహించడానికి మేం వేసిన తొలి అడుగు ఈ టోర్నమెంటు." అని పల్స్ హార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎస్ ముఖర్జీ చెప్పారు. డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ సంజూష, డాక్టర్ మొవ్వ శ్రీనివాస్, డాక్టర్ సాయిచంద్ర, డాక్టర్ తనోజ్ ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి నిర్వహించారు.

యువత కృతిమత్వానికి ఆకర్షితులవుతున్నారు



నవతెలంగాణ-కల్చరల్

నేటి యువత సమాజంలో కృత్రిమతం పట్ల ఆకర్షితులు అవుతున్నారని ప్రకృతి ప్రసాదించిన సహజత్వానికి దూరం అవుతున్నారని రాష్ట్ర శాసన సభ తొలి సభాపతి సిరికొండ మధుసూదనాచారి అవేదన వ్యక్తం చేశారు. త్యాగరాయ గాన సభ శాస్త్రీయ కళలకు ప్రాధాన్యత ఇస్తోందనీ యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేయాలని కోరారు. శ్రీ త్యాగరాయ గానసభ 58వ వ్యవస్థాపక దినోత్సవం గాన సభ ప్రధాన వేదిక పై సోమవారం ఆరంభమైనాయి. ముఖ్య అతిథిగా మధుసూదనా చారి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంట నగరాలలోనే కాక రెండు తెలుగు రాష్ట్రాలలో గాన సభ ప్రాచుర్యం పొందిందనీ ఐదున్నర దశాబ్దాల పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కల్పిస్తూ నిర్వాహకులు త్యాగరాయ గానసభ ప్రతిష్ఠ కాపాడుతున్నారని అభినందిం చారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ గాన సభ 58 ఏండ్ల ప్రయాణంలో ప్రఖ్యాత సంగీత నృత్య నాటక కళాకారులు ప్రదర్శన ఇచ్చారనీ గుర్తు చేసుకున్నారు. రెండు రోజుల పాటు వ్యవస్థాపక వేడుక జరుపుతున్నామని తెలిపారు. గాన సభ సంగీత గురువు సంయుక్త శిష్య బృందం రాగ రమ్య ఫైన్ ఆర్ట్ మంజుల శిష్య బృందం శాస్త్రీయ గాన గోష్ఠి శ్రోతలను ముగ్ధులను చేసింది.

వెంకటేశ్వరుని మహిమలు అనుభవంలోకి రావాలి



నవతెలంగాణ-కల్చర్

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలలు, మహిమలు వారి వారి అనుభవంలోకి రావాలని అనుభవించి ఇతరులు చెప్పేది కొంతేనని తిరుమల తిరుపతి దేవస్థానం విశ్రాంత కార్య నిర్వహణాధికారి డాక్టర్ కె.వి రమణ అన్నారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో శ్రీ వెంకటేశ్వర మహా మంత్ర పీఠం నిర్వహణలో గోవింద దాసు రచించిన తిరుమల శ్రీ వేంకటేశ్వర దిశానిర్దేశం ప్రథమ సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొన్నారు. సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ సంపుటిలోని అధ్యాయాలు అన్నీ ఆసక్తి కరంగా స్వామి వారి లీలలు వర్ణించారని వివరించారు. దేవనాథ్ జీయర్ స్వామి తమ శుభ ఆశీస్సులు రచయితకు అందజేశారు వేదిక పై పూర్వ శాసన సభ సభ్యుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ అధ్యక్షత వహించారు. సభా కార్యక్రమం తొలుత సంగీత గురువు రమాప్రభ శిష్య బృందంతో భజగోవిందం కీర్తనలు మధురంగా ఆలపించారు.

ఆరోగ్య సంరక్షణలో 'పీఐసీయూ'లు కీలకం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సామాన్య ప్రజలు ఇంకా సరిగా అర్థం చేసుకోలేప్పటికీ దేశంలోని ఆరోగ్య సంరక్షణలో కీలకమైన అంశంగా పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు నిలుస్తున్నట్టు డాక్టర్ ఫర్హాన్ ఏఆర్ షేక్, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ విభాగం అధిపతి, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బంజారాహిల్స్ తెలిపారు. బాల్యం నుంచి యుక్త వయస్సు వరకు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న, కొన్ని ప్రాణాంతక వైద్య పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న పిల్లలకు ఉన్నత స్థాయి వైద్య సంరక్షణను అందించడానికి ప్రత్యేకంగా పీఐసీయూలు రూపొందించినట్టు తెలిపారు.

ఓట్ల లెక్కింపు పై సిబ్బందికి శిక్షణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సెగ్మెంట్ పరిధిలో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలో భాగంగా హెూలీ మేరీ కాలేజీ, బోగారం గ్రామంలో నేడు ఓట్ల లెక్కింపు.. అందులో పాల్గొనే ప్రతీ ఒక్కరు బాధ్యత యుతంగా పనిచేయాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు పేర్కొన్నారు. సోమవారం కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన నిధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అ జాగ్రత్తగా ఉండకూడదన్నారు. కౌంటింగ్ వచ్చే ప్రతీ ఒక్కరిని గౌరవిస్తూ ఎన్నికల కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వి.నర్సింలు, ఈఆర్ఓ, కుత్బులాపూర్ నియోజవర్గం సెగ్మెంట్ కుత్బుల్లాపూర్, గండిమైసమ్మ, బాచుపల్లి తహశీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

నవతెలంగాణ-నేరేడ్‌మేట్

నేరేడ్‌మేట్ బలరాం నగర్‌లో నివాసముంటున్న గుంట్రాలు మాధవి (34) అనుమానాస్పదంగా మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్న నేరేడ్‌మేట్ పోలీసు తెలిపిన వివరాలు ప్రకారం.. గుంట్రాల మాధవి నేరేడ్‌మేట్ బలరాం నగర్‌లో పెంట్ హౌస్‌లో నివాసం ఉంటున్నారు. తన భర్త గుంట్రాల రాజు మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వారికి ముగ్గురు పిల్లలు తన పిల్లలు తన అమ్మగారి ఇంటి దగ్గర పెరుగుతున్నారు. మృతురాలు ఫెసిలిటీ ఆఫీస్ నడుపుతుంది. మరియు అవసరమైన వారికి ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్‌ని అందిస్తుంది. మృతురాలి కుమారుడికి సాయి వ్యక్తి ద్వారా తన అమ్మ గారి ఫోను లిఫ్ట్ చేయట్లేదు అని చెప్పగా, మృతురాలి కుమారుడు తన తల్లి ఇంటికి వెళ్లి చూడగా.. అతని తల్లి తల నుంచి రక్తం రావడం, మెడకి తెల్లటి రంగు గల చున్ని గట్టిగా చుట్టి, అపస్మారక స్థితిలో పడి ఉంది. ఈ స్థితిని గమనించిన తనునేరేడ్‌మేట్ పిఎస్‌కు వారికి సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



వార్మికరావు ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెన్నమనేని విష్ణురావుకు సన్మానం. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రకరణ్ రెడ్డి మరియు మాతృదేవోభవ అనాథ ఆశ్రమం చేతుల మీదుగా గత 5 సంవత్స రాలుగా సామాజిక కార్యక్రమాలు చేస్తూన వీవీఆర్ ఫౌండేషన్ అధినేతకు ఉత్తమ తెలంగాణ సేవారత్న అవార్డు 2024 అందుకున్నారు.
నవతెలంగాణ-ఆల్వాల్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | జూన్ 04, 2024 | www.navatelangana.com

ఆవిర్భావ వేడుకల్లో మేయర్, డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

నగరంలో ట్యాంక్‌బండ్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన తెలంగాణ పదేండ్ల పండుగలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, డిప్యూటీ మే యర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సీపీ రాధ కష్ణకు వారిని సీఎం రేవంత్ రెడ్డి పరిచయం చేశారు. అనంతరం ఇరువురికి గవర్నర్ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు.

సెల్ ఫోన్ దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

సెల్‌ఫోన్ దొంగతనం చేస్తున్న వ్యక్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బోరబండ డివిజన్‌లోని హరి నగర్ ,బిస్మిల్లా హోటల్ వద్ద నివసిస్తున్న మహమ్మద్ ముజాకీర్ బోరబండ హాజీ మస్తాన్ బేకరీ లో పనిచేస్తున్నాడు. అతను సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నా డు. ఇటీవల కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ ఫెస్టివ్ పార్క్ వద్ద ఒక వ్యక్తి వద్ద నుంచి సెల్ ఫోన్ దొంగతనం చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సార్ నగర్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్ హెచ్ ఓ వీరశేఖర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్, డిటెక్టివ్ పోలీస్ సిబ్బంది సహకారంతో నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు గతంలో కూడా మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ దొంగతనాలు చేసి అరెస్టై జైలుకు వెళ్లినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.

ఓట్ల లెక్కింపునకు అంతా సిద్ధం



- మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడి
- పాసులు ఉన్నవారికే అనుమతి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని, మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపునకు అంతా సిద్ధం చేశామని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కౌంటింగ్ కేంద్రాలను ఆయన సంద ర్శించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమల నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్, సరోజినీ నాయుడు కళాశాలలో యాకుత్‌పూరా, నిజాం కళాశాలలో చాంద్రా యణగుట్ట, కోఠి మహిళా డిగ్రీ కళాశాలలో గోషామహల్, అంబర్‌పేటలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో మలక్‌పేట్, బండ్ల గూడలో ఆరోరా ఇంజనీరింగ్ కాలేజీలో బహదుర్ పూర, మాసాబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కార్వాన్ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. కలెక్టర్ వెంట ఏఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు, టెబుల్స్, రౌండ్లు ఇలా..

గతనెల 13న హైదరాబాద్ పార్లమెంటు నియోజ కవర్గ ఎన్నికల పోలింగ్ జరగ్గా.. మొత్తం 30 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 22,06,654 మంది ఓటర్లు ఉండగా,46.08 శాతం పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. వయోవృద్ధులు వికలాంగులు 121 మంది ఉండగా హోమ్ ఓటింగ్ ద్వారా 119 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సిబ్బంది 7620 మంది ఉండగా.. 6084 మంది, సర్వీస్ ఓటర్లు 8 మంది ఉండగా ఇద్దరు ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు చెందిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ మేరకు ఓట్ల లెక్కింపునకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనల మేరకు సర్వం సిద్ధం చేశారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లను వేరువేరుగా ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు.

మలక్‌పేట్ అసెంబ్లీ సెగ్మెంట్ లోని 300 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్.. 22 రౌండ్లు, కార్వాన్ లోని 311 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్.. 23 రౌండ్లు, గోషామహల్ లోని 235 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్.. 17 రౌండ్స్ ,చార్మినార్ 198 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్.. 15 రౌండ్స్, చాంద్రాయణగుట్ట 305 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్.. 22 రౌండ్లు, యాకుత్ పూర 322 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్.. 24 రౌండ్స్, బహదూర్ పూర 263 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 19 రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల కోసం సీట్లు కేటాయించారు. లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు నిరంతరయంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు

కౌంటింగ్ కోసం సిబ్బందిని సెగ్మెంట్ వారీగా అలాట్ చేశారు. పోస్టల్, ఈవీఎం కౌంటింగ్ కోసం 108 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్స్, 125 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు 123 మంది మైక్రోఅబ్జర్వర్లు కేటాయించారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు ఫలితాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌తో పాటు ఎంకోర్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయనున్నారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లకు గుర్తింపు కార్డులను అందిస్తున్నారు. గుర్తింపు కార్డులు లేని ఏజెంట్లు, సిబ్బందిని అనుమతించేది లేదని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని పార్లమెంట్ నియోజకవర్గం ఆర్వో, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.





మూడోరోజు బీఆర్ఎస్ తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ సోమవారం యూసఫ్ గూడా డివిజన్‌లో జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి పండ్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ సంతోష్ ముదిరాజ్, నర్సింగ్ దాస్, తలరి వెంకటేష్, సంతోష్, హస్సన్, వేణుగోపాల్, సత్యనారాయ, శ్రీనివాస్, శరత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఓయూలో హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు 52వ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఓయూలో ఆర్ట్స్ కళాశాల ఎదుట పుట్టినరోజు వేడుకలు బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా బోల్లు నాగరాజు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో హరీశ్‌రావు అనేక అభివద్ధి పనులు చేపట్టి వైద్యరంగంలో, ఇరిగేషన్ రంగంలో తనదైన ముద్ర వేసుకొని తెలంగాణను అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తూ, కేసీఆర్ అడుగుజాడల్లో ముందుకు వెళుతూ, తెలంగాణ కోసం అహర్నిశలు కష్టపడ్డ వ్యక్తి హరీశ్ రావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తొట్ల స్వామి యాదవ్, తుంగ బాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు సూరంపల్లి పరశురాం, జంగా అవినాష్, జంగయ్య, పెద్దమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'సోనియా గాంధీ నిజంగా తెలంగాణ తల్లయితే వీహెచ్‌ను సీఎం చేసేది'



నవతెలంగాణ-ఓయూ

సోనియాగాంధీ నిజంగా తెలంగాణ తల్లి అయితే సీనియర్ బీసీ నాయ కులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, తన జీవితకాలం కాంగ్రెస్ పార్టీకి అంకితమైన వి హనుమంతరావును ముఖ్యమంత్రి చేసేదని సౌత్ ఇండియా జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, తెలంగాణ రాష్ట్రంలోనూ బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. సోమవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనియా గాంధీ సొంత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్ దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం అని, 25 కోట్ల జనాభా కలిగి ఉందని, అయితే ఆంధ్రప్రదేశ్ కంటే అత్యంత వెనుకబడిన రాష్ట్రమే కాకుండా దేశంలోనే అతిపెదరికం కలిగిన రాష్ట్రం అన్నారు. ఉత్తరప్రదేశ్‌ను నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని 2013 సంవత్సరంలోనే ఆనాటి ముఖ్యమంత్రి కుమారి మాయావతి అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకించిందన్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌ను మాత్రం విడగొట్టి తెలంగాణను ఏర్పాటు చేశారన్నారు. బీజేపీ కూడా ఆంధ్రప్రదేశ్ విభజన చట్ట ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరానికి జాతీయ హోదా కల్పించలేదన్నారు. తెలంగాణలోనూ బయ్యారం ఫ్యాక్టరీ కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాళేశ్వరానికి జాతీయ హోదా లాంటి అనేక హామీలను విస్మరించారన్నారు. దక్షిణాది ప్రజల అన్న ఆ రాష్ట్రాల సమస్యలు అన్న కాంగ్రెస్, బీజేపీలకు పట్టింపులేదు అన్నారు. ఉత్తరాది పాలకుల ఆధిపత్యం నుంచి దక్షిణాదిని పరిరక్షించుకోవాలంటే స్వయం పాలన ఆత్మగౌరవం దిశగా దక్షిణాది ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావలసిందిగా ఆయన పిలుపునిచ్చారు.



ఇన్‌చార్జ్ వీసీకి బోధనేతర ఉద్యోగుల వినతిపత్రం

నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఇన్‌చార్జ్ వీసీ దాన కిషోర్‌ను బోధనేతర ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం కలిసి ఉద్యోగుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001 నుండి ఆగస్టు 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్, సెప్టెంబర్ 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఛార్జ్ అలోవెన్స్, టైం బార్ ఆర్డర్స్, బోధనేతర ఉద్యోగుల పదవుల్లో ప్రొఫెసర్స్ ను నియమించవద్దని, యూనివర్సిటీ యాక్ట్ ప్రకారము అడ్మినిస్ట్రేషన్ పొజిషన్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించి ప్రమోషన్స్ ను కల్పించాలని కోరారు. రెమ్యునరేషన్ స్ట్రీమ్ లైన్ చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పక్షపాత ధోరణి సరియైనది కాదని టీచింగ్, నాన్ టీచింగ్ మధ్య ఒకేరకమైన సర్వీస్ కండిషన్స్ అమలు చేయాలని కోరారు. ఈ విషయంలో వీసీ సానుకూలంగా స్పందించి అధికారులను పిలిచి వెంటనే ఓపీఎస్/సీపీఎస్ అమలుచేసేందుకు కావలిసిన సమాచారాన్ని/ఆర్థిక వ్యయాన్ని లెక్కించి వెంటనే ఇవ్వాలని కోరారు. త్వరలో ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఓయూ ఎన్‌జీఓఎస్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, అద్యక్షులు,నాగరాజు,శివ శంకర్,విజయ్ కుమార్, అక్బర్ బైగ్, భీమయ్య,శంకరయ్య, అశోక్, యూసఫ్,రాకేష్,కృష్ణ,జలీల్, ఇక్బాల్, సాంబయ్య, గోపాల్, భిక్షపతి,రాజేశ్వరరావు, మెహతాబ్ , నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి



- అమరవీరుల సంస్మరణ సభలో వక్తలు

నవతెలంగాణ-ఓయూ

ఉద్యమకారులకు న్యాయం చేయాలని అమరవీరుల సంస్మరణ సభలో వక్తలు అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో చైర్మెన్ కంచర్ల బద్రి అధ్యక్షతన తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో గత ప్రభుత్వం దశాబ్ద కాలంగా తెలంగాణను అభివృద్ధి మాటున అన్ని రంగాల్లో వెనక్కు నెట్టేసిందన్నారు. ప్రాజెక్టుల పేరు మీద దోపిడీకి పాల్పడిందని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల పైన నిర్బంధం ఎక్కు పెట్టిందని ఆరోపించారు. దశబ్ద కాలంగా నియంత పోకడలు పోయిందని అభిప్రాయపడ్డారు. అలాగే గత ప్రభుత్వం దశాబ్ద కాలంగా ఉద్యమ కారులను విస్మరించిందని, మొదటిసారి ఉద్యమకారులను రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన హామీలను నెరవేర్చాలని, అందుకోసం వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలంతో పాటు నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయాన్ని కూడా అందించాలని, దాంతోపాటు తెలంగాణ అమర వీరుల స్థూపాన్ని ఓయూ వేదికగా నిర్మించాలని, ఇప్పట వరకు సహాయం అందని అమరులైన కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. 2009 నుంచి 2014 వరకు తమ విలువైన సమయాన్ని కోల్పోయామని, అందుకోసం ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్లలో ఉద్యమకారులకు వయసు పరిమితిని సడలించాలని, వెయిటేజ్ మార్కులు కూడా కల్పించాలని, ఉద్యోగాలు రానటువంటి ఉద్యమకారులకు ఉపాధి అవకాశాలను, ఆర్థిక ప్రోత్సాహాన్ని అందివ్వాలని, స్వతంత్ర సమరయోధుల మాదిరిగా గుర్తింపు కార్డులతో పాటు హెల్త్ కార్డులు కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే ఉద్యమ కేసులతోపాటు కేసీఆర్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను కూడా ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్య, ప్రొఫెసర్ పంత్కాల శ్రీనివాస్, విద్యార్థి ఉద్యమ నాయకులు కాంగ్రెస్ టీపీసీసీ మెంబర్స్ దరువు ఎల్లన్న జంపాల రాజేష్, మందల భాస్కర్, దుర్గం భాస్కర్, రవీందర్ నాయక్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక కన్వీనర్లు కష్ణ లత,రాధిక, భూలత, ఓయూ జేఏసీ నాయకులు చాగంటి రాములు, భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నికల కౌంటింగ్‌కు రంగం సిద్ధం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో ఎన్నికల ఇన్‌చార్జి మధుకర్ నాయక్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వెస్లీ కాలేజీలో ఉదయం ఆరు గంటల నుంచి కౌంటింగ్ మొదలవుతుందని తెలిపారు. 17 టేబుళ్లలో 14 రౌండ్లలో ఈ కౌంటింగ్ సాగుతుందని వివరించారు. ఒక్కొక్క టేబుల్‌కు ముగ్గురు ఎన్నికల అధికారులు ఇన్‌చార్జిలుగా ఉంటారని తెలిపారు. ఒక టేబుల్‌కు ప్రతి అభ్యర్థి నుంచి ఒక ఏజెంట్‌ను అనుమతి ఇస్తారని వివరించారు ఉదయం తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కిస్తారని, 8 గంటల నుండి ఈవీఎంల కౌంటింగ్ మొదలవుతుందని ఆయన తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకల్లా ప్రక్రియ పూర్తవుతుందని, గెలుపొందిన వారికి 5 గంటల తర్వాత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని తెలిపారు. ఈసారి 51 శాతం ఓటింగ్ అయిందని, 15 మంది అభ్యర్థులు ఎన్నికల్లో తలపడ్డారన్నారు. ముగ్గురు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కాగా మిగతావారు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే కంటోన్మెంట్‌లో మల్కాజిగిరి పార్లమెంటరీ ఓట్ల లెక్కింపు కూడా ఇక్కడే సాగుతుందని తెలిపారు. ఈసారి మూడింతల సెక్యూరిటీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే కౌంటింగ్ పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు

బీమా బైపాస్ సర్జరీతో అత్యల్ప సమస్యలు



- డా.ప్రతీక్ భట్నాగర్, మధవీలత కొంపెల్ల

నవతెలంగాణ-బంజారాహిల్స్

బీమా బైపాస్ శస్త్రచికిత్సతో(బైలటేరియల్ ఇంటర్నల్ మమ్మరీ ఆర్టరీ-బీఐఎంఏ) అనారోగ్య సమస్యలు స్వల్పంగా ఉంటాయని, ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఛాతీలో అతి చిన్నకోతతో ఈ శస్త్ర చికిత్స చేయవచ్చని హార్ట్ ఫౌండేషన్ చైర్మన్,మేనేజింగ్ ట్రస్టీ డా.ప్రతీక్ భట్నాగర్, లతామా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మాధవీలత కొంపెల్లలు తెలిపారు. హార్ట్ ఫౌండేషన్, లతమ ఫౌండేషన్ సంయుక్తంగా కలిసి 'లైవ్ ఇన్ బాక్స్ బీమా బైపాస్ సర్జరీ' పేరిట రెండురోజుల అంతర్జాతీయ వైద్యసదస్సు ఆదివారం బంజారాహిల్స్‌లోని తాజ్ కష్ణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

అతిథిగా హాజరైన డా.ప్రతీక్ భట్నాగర్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశ వైద్య విద్యలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. సాంకేతికత నిపుణత చాలా తక్కువ మంది వైద్యులకే ఇంకా తెలుసునని అన్నారు. సాంకేతికత నిపుణత అందిపుచ్చుకోవడానికి వైద్యులు తమ వంతు కృషిని చేయాలని, అప్పుడే శస్త్ర చికిత్సలు 90 శాతం రోగుల్లో 20 ఏండ్ల తరువాత కూడా పనిచేస్తుందనీ విస్తతం చేస్తే కుటుంబాలు, ప్రభుత్వంపై ఆర్థికభారం తొలగిపోతుందని అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి పలువురు ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు దాదాపు వంద మంది సీనియర్ హార్ట్ సర్జన్లకు అధునాతన మెలకువలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలియజేస్తూ ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్క వైద్య నిపుణులు సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వందల మంది వైద్యనిపుణులతో పాటు జూనియర్ వైద్యులు, ప్రస్తుతం విద్యాబోధన చేస్తున్న వైద్యులు సైతం పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : ప్రొ. మల్లేశం



నవతెలంగాణ-ఓయూ

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ టీచర్స్ అసోసియేషన్ ఔటా ఉపాధ్యక్షులు ప్రొ. గడ్డం. మల్లేశం కోరారు. సోమవారం ఇన్‌ఛార్జ్ ఉపకులపతి దానకిశోర్‌ను ఓయూ బోధన, బోధనేతర సంఘాల ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌చార్జి దాదాపు గంటపాటు తమ సమస్యలను విని సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీస్, ఎరియర్స్, ఆరోగ్య కార్డులు, వయోపరిమితి పెంపు, సీఏఎస్ పై ప్రధానంగా చర్చ జరిగిందని వెల్లడించారు. ఇందులో సత్వరమే సీఏఎస్ నోటిఫికేషన్ విడుదల చేసి ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను అదేశించారని తెలిపారు. సీపీఎస్, ఎరియర్స్‌కు సంబంధించి అవసరమైన పూర్తి సమాచారం, బడ్జెట్ వివరాలను అందించాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే సీపీఎస్, ఎరియర్స్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. వయోపరిమితి పెంపు, ఆరోగ్య కార్డులపై ప్రభుత్వానికి నివేదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు.

ఇదిలా ఉండగా ఓయూ టీఎన్జీఓ అధ్యక్షుడు బి. జ్ఞానేశ్వర్ నేతృత్వంలోని బోధనేతర సంఘాల ప్రతినిధులు నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విజ్ఞాపన పత్రం అందజేశారు. సీపీఎస్‌తో పాటు ఆరోగ్య కార్డులు, చార్జ్ అలయెన్స్, అదనపు పనికి అదనపు వేతనం, ప్రమోషన్స్ తదితర అంశాలను వీసీ దష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఔటా ఉపాధ్యక్షురాలు ప్రొ. సరస్వతమ్మ, కోశాధికారి డాక్టర్ చలమల్ల వెంకటే శ్వర్లు, ప్రొ. సిహెచ్ శ్రీనివాస్, ప్రొఫెసర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, ప్రొ. మంగు, డాక్టర్ చంద్రునాయక్, డాక్టర్ ఆమంచి నాగేశ్వర్, డాక్టర్ వంశీ, డాక్టర్ రమేష్, డాక్టర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆషాడపు మధు



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ విద్యార్థి ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఓయూ విద్యార్థి, ఉద్యమ నేత ఆషాడపు మధు ఎన్నికయ్యారు. ఉమ్మ డి వరంగల్ జిల్లా, ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని గణపురం మండలం, సీతారాంపురం గ్రామ యువ కుడు ఆశాడపు మధు పాఠశాల స్థాయి నుంచే తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొని అటు చదువును ఇటు ఉద్యమాన్ని కొనసాగిస్తూ అంచలంచెలుగా ఎదిగి ఉస్మా నియా యూనివర్సిటీలో న్యాయ విద్యార్థిగా కొనసాగుతున్నారు. ఉద్యమాల గడ్డ ఓయూలో కీలకమైన విద్యార్థి ఉద్యమ నాయకుడుగా ఎదిగి నేడు నూతనంగా ఏర్పడిన తెలంగాణ విద్యార్థి ఫోరం టీవీఎఫ్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా తనను అధ్యక్షుడిగా రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకోవడం పట్ల మధు హర్ష భావం వ్యక్తం చేస్తూ కతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలపైన, విద్యార్థుల సంక్షేమం కోసం, విద్యార్థుల సమస్యల పైన పోరాడుతానని తెలిపారు. ముఖ్యంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ద కాలంగా విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. విద్యారంగం పూర్తిగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయి, సాధారణ పౌరులు విద్యను అభ్యసించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల మాదిరిగా నేడు నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించకుండా, విద్యారంగానికి తగిన ప్రాధాన్యతను ఇచ్చి, విద్య అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఫీజుల నియంత్రణ తీసుకురా వాలని, తద్వారా అందరికీ ఉచిత విద్యను అందించడానికి కషి చేయాలని సూచించారు. అందుకోసం తమ సంఘం ఆధ్వర్యంలో త్వరలోనే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఫుట్ పాత్ పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్న సంఘటన సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే విధులు నిర్వహించే పోలీస్ పెట్రోలింగ్ చేస్తుండగా కాలనీ సమీపంలోని ఫుట్ పాత్ పై ఓ గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి కనిపించాడు. వెంటనే దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు తెలిసింది. అతని వయసు సుమారు 45 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని సీఐ దర్యాప్తు చేపట్టారు.



ప్రతీ ఒక్క అభ్యర్థి మనవారే ఎన్నికల కమిషన్ నియమాలకు లోబడి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శాంతియుతంగా అందరూ మనవారే అని భావిస్తూ ఐక్యమత్యంతో పని చేయాలని సికింద్రాబాద్ పార్లమెంటు ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు ఎన్నికల బూత్ ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి చర్చ గోష్టి నిర్వహించారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- 'సికింద్రాబాద్'లో నేతల భవితవ్యం తేలేది నేడే
- ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం
- 14 టేబుళ్ళు..17 రౌండ్లలో లెక్కింపు భారీ బందోబస్తు

నవతెలంగాణ-అంబర్‌పేట

ఎంత మంది పోటీలో ఉన్న విజేత ఒక్కరే... సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో విజేత ఎవరో తేలేది నేడే... ఈవీఎంలలో దాగిన అభ్యర్థుల జాతకం బయటకు రానుంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే అంబర్పేట అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపుకు నారాయణగూడలోని రెడ్డి మహిళా కళాశాల వేదిక కానుంది. అధికారులు కౌంటింగ్ ప్రక్రియ కోసం ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు నియోజకవర్గం అసిస్టెంట్ ఎన్నికల అధికారి అపర్ణ నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. వాటి వివరాలను ఆమె వివరించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఓట్ల లెక్కింపుపై అధికారులు దృష్టి సారించారు. ఇందుకోసం సకల ఏర్పాట్లు సిద్ధం చేశారు. నియోజకవర్గానికి చెందిన



ఈవీఎంలను నారాయణగూడలోని రెడ్డి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్రూమ్లో భద్రపరిచారు. భారీ బందోబస్తు మధ్య భద్రపరిచారు. దీన్ని పోలీసుల, జిల్లా ఎన్నికల అధికారులు పరిశీలించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారితో చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. అభ్యర్థులు, ఏజెంట్లు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. ఓట్ల లెక్కింపు రోజున 144 సెక్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్లకు మూడు అంచెల పటిష్ట భద్రత ఏర్పాటు. లెక్కింపు కేంద్రంలో 14 టేబుళ్ల ఏర్పాటు, రిటర్నింగ్ అధికారికి ప్రత్యేక టేబుల్.

ప్రతీ టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, అసిస్టెంట్ సూపర్వైజర్, మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. ఇప్పటికే లెక్కింపు సిబ్బందికి రెండు విడతల శిక్షణ పూర్తి. లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఆర్వో దగ్గర ఉంటుంది. కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చారు. కౌంటింగ్ ఏజెంట్లు మంచి ప్రవర్తన కలిగినవారై ఉండాలి. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉంటారు. మొబైల్ ఫోన్లు, పేపర్లను కౌంటింగ్ హాల్లోకి అనుమతించరు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం. కౌంటింగ్ పూర్తి అనంతరం డ్రా ద్వారా ఎంపిక చేసిన ఐదు వీవీప్యాట్లను ఒకటి తర్వాత ఒకటిగా అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో వీవీప్యాట్ లోని ముద్రిత ఓటర్ స్లిప్లను లెక్కిస్తారు. లెక్కింపు ప్రక్రియను సీసీటీవీ ద్వారా ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, భారత ఎన్నికల సంఘం కూడా పర్యవేక్షించేందుకు అవకాశం కల్పించారు. అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 236 పోలింగ్ బూత్లలో ఓట్లను 17 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రౌండ్ రౌండ్కు వచ్చే ఫలితాలను తెలియజెప్పేందుకు డిజిటల్ స్కీన్, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు.

విద్యార్థుల బస్సు పాసుల జారీకి ఆర్టీసీ సిద్ధం

- 2024-25 విద్యాసంవత్సరానికి ఏర్పాట్లు
- ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లకు అడ్మినిస్ట్రేటివ్ చార్జీల మినహాయింపు
- అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించే ప్రయివేట్ విద్యాసంస్థలకే బస్సు పాసుల జారీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

త్వరలో పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో టీఎస్ ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ స్టూడెంట్ బస్‌పాసుల జారీకి సిద్ధమవుతోంది. 2024-25 సంవత్సరానికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా స్టూడెంట్స్ బస్సు పాస్‌లను జారీ చేయటానికి ఏర్పాట్లు చేసింది. బస్సు పాసుల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా టీఎస్ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, అన్ని ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రతి విద్యా సంవత్సరం లాగానే ఈ సారి కూడా అడ్మినిస్ట్రేటివ్ చార్జీలను చెల్లించాలన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించకుండా మినహాయింపునిచ్చారు. అడ్మినిస్ట్రేటివ్ ఫీజు చెల్లించిన ప్రయివేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు మాత్రమే బస్సు పాసులు ఇవ్వనున్నారు. విద్యార్థులు బస్సు పాస్ కోసం టీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ https://tgsrtcpass.com ద్వారా దరఖాస్తు చేసుకుని, తమ విద్యాసంస్థ నుంచి ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేయించుకొని, దరఖాస్తు ఫారంపై ప్రిన్సిపల్ సంతకం, సీల్ వేయించుకొని, వారు ఎంచుకున్న బస్సు పాసు కేంద్రంలో పాస్ పొందవచ్చు.

బస్సు పాసులు జారీ చేయు కేంద్రాలు ఇవే..

విద్యార్థులు ఈనెల ఒకటో తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని అబిడ్స్, అఫ్జల్‌గంజ్, ఆరాంఘర్, బాలానగర్, బోరబండ, సీబీఎస్, చార్మినార్, దిల్‌సుఖ్ నగర్, ఈసీఐఎల్ క్రాస్ రోడ్, ఫారుఖ్‌నగర్, జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, ఘట్కేసర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, జేబీఎస్, కాచిగూడ, కోఠి టెర్మినల్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి బస్సు స్టేషన్, ఎల్‌బీ నగర్, లింగంపల్లి, లోతుకుంట, మేడ్చల్, మెహిదీపట్నం, మిధాని, మొయినాబాద్, ఎన్‌జీవో కాలనీ, పటాన్‌చెరు, రైతీఫైల్-సికింద్రాబాద్, ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు, రిసాలా బజార్, సనత్‌నగర్, శంషాబాద్, ఎస్ఆర్‌నగర్, షాపూర్‌నగర్, సుచిత్ర, తార్నాక, తక్కుగూడ, ఉప్పల్ క్రాస్ రోడ్, వనస్థలిపురం, ఉమెన్స్ కాలేజీ కోఠిలోని బస్సు పాసు కేంద్రాల్లో పాస్‌లు పొందవచ్చు. 12 ఏండ్లలోపు బాలురు (7వ తరగతి), 18 ఏండ్లలోపు బాలికలకు(10వ తరగతి) ఉచిత బస్‌పాసులు జారీ చేస్తారు. దరఖాస్తు ఫారాన్ని ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిని పూర్తిచేసి ఫొటో పైన, బోనఫైడ్ సర్టిఫికెట్ కాలమ్‌లో ప్రిన్సిపాల్/హెడ్ మాస్టర్ సంతకం చేయించాలి. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిం చారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి



ప్రత్యేక కౌంటర్‌లో పాసులు జారీ చేస్తారు. మరిన్ని వివరాలకు టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ లేదా 8008204216కు సంప్రదించాలి.

విద్యార్థులకు జారీ చేయు బస్సు పాసులు ..

క్రసం బస్ పాస్‌ల వివరాలు	ధర(రూ.లలో)
1.స్టూడెంట్ జనరల్ పాస్ (నెలకు)	400
2.స్టూడెంట్ జనరల్ పాస్ (మూడు నెలలకు)	1200
3.స్టూడెంట్ రూట్‌పాస్(మూడు నెలలకు)	450(4కి.మీ) (600(8కి.మీ),900(12కి.మీ),1150(18కి.మీ),1350(22కి.మీ))
4. స్టూడెంట్ గ్రేటర్ హైదరాబాద్ పాస్ (నెలకు)	400+70 (ప్రతి 2కి.మీటర్లకు)
5. స్టూడెంట్ గ్రేటర్ హైదరాబాద్ పాస్ (మూడు నెలలకు)	1200+210 (ప్ర.2కి.మీ.కు)
6. స్టూడెంట్ సిటీ స్పెషల్ పాస్ (నెలకు)	450
7. స్టూడెంట్ సిటీ స్పెషల్ పాస్ (మూడు నెలలకు)	1350
8. స్టూడెంట్ ఎక్స్‌క్లూజివ్ పాస్ (నెలకు)	1020 (16కి.మీ.కు)
9. స్టూడెంట్ ఎక్స్‌క్లూజివ్ మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్(నెలకు)	1190 (16కి.మీ)
10. 12 ఏండ్లలోపు విద్యార్థులకు ఉచిత పాస్ (7వ తరగతి వరకు)	ఉచితం
11. 18 ఏండ్లలోపు విద్యార్థినులకు ఉచిత పాస్ (10వ తరగతి వరకు)	ఉచితం

ప్రజా సేవలో సంతృప్తి



- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ డా.రామిడి మధుకర్ రెడ్డి
- అనాథాశ్రమంలో పండ్ల పంపిణీ

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రజా సేవలో సంతృప్తి ఉందని డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామ పరిధిలోని అనాధ ఆశ్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండ్లపల్లి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో అనాధలకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలపట్ల స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజా సేవే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, జాము రవి, మండల కో ఆప్షన్ గౌస్ పాషా, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నాగరాజు గుప్తా, బీఆర్ఎస్ నాయకులు భూమేష్, బలరాం, లక్ష్మీనారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇఎస్‌సీఐ కాలేజ్‌లో
ఆర్బిట్రేషన్ ప్రోగ్రాం



- ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికేషన్ కోర్సు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గుర్తింపు కలిగివున్న ఏ యూనివర్సిటీ నుండైనా బ్యాచిలర్ డిగ్రీ కలిగి వున్న విద్యార్థులకు 'వన్ ఇయర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఆర్బిట్రేషన్'లో చేరడానికి ఇఎస్‌సీఐలో అడ్మిషన్స్ ఇస్తున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మధ్య సోమవారం ఎం.ఓ.యూ కుదిరింది. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావ్ ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను కాలేజీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవస్థలో అనేక రకాలైన వివాదాలు వుంటాయని, అవి, ఇద్దరు వ్యక్తులు, లేదా అంతకంటే ఎక్కువ మంది మధ్య ఉండవచ్చని, ఆర్బిట్రేషన్ ద్వారా ఆ వివాదాలను న్యాయ పరంగా పరిష్కరించ వచ్చన్నారు. అందుకు సంబంధించిన అరిబిట్రేషన్ యాక్ట్, అరిబిట్రేషన్ సంస్థలు, వాటి రూల్స్ వివిధ రకాలైన సిలబస్‌తో కూడుకున్న పాఠ్యాంశాలను హైకోర్టుతో పాటుగా లీగల్ కోర్టుల్లో టెక్నికల్ లీగల్ సెల్స్‌లో పనిచేసిన, చేస్తున్న సీనియర్ ఫ్యాకల్టీ ఆర్బిట్రేటర్ల ద్వారా విద్యాబోధన చేస్తారని స్పష్టం చేశారు. ఈ కోర్సులో చేరాలనుకున్నవారికి మొదట రాత పరీక్ష ఆ తరువాత ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అడ్మిషన్ ఫీజు ప్రతి ఒక్కరికి ఒక లక్ష ఇరవై వేలు కాగా, ఈ కోర్సు పూర్తి చేసినవారు తమకు తాము అరిబిట్రేషన్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ఇంజి నీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా లోని సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం ఈ కోర్సును నిర్వహిస్తుం దన్నారు. గ్రాడ్యుయేట్స్ అయినవారు, లేదా గ్రాడ్యుయేషన్ చివరి పరీక్షలు రాస్తున్నవారు, అయిదేండ్ల ఎల్.ఎల్.బి కోర్సులో మూడేళ్ల పూర్తి చేసికున్నవారు కూడా ఆర్బిట్రేషన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేషన్ కోర్సులో చేరవచ్చని తెలిపారు. ఈ సర్టిఫికేషన్ కోర్సులో చేరాలనుకునేవారికి అప్లికేషన్స్ ఫారాలు కాలేజ్ నుంచి పొందవచ్చని, చివరి తేదీ జులై 30లోగా సమర్పించాలని సూచించారు.

వీఎస్ఆర్ జిమ్ ఓనర్ శ్రీకాంత్ రెడ్డి కన్నుమూత



నవతెలంగాణ-సిటీబ్యూరో

శామీర్‌పేట్ వీఎస్ఆర్ జిమ్ ఓనర్ శ్రీకాంత్ రెడ్డి (38) సోమవారం బంజారాహిల్స్ అపోలో హాస్పిటల్ లో అనారోగ్యంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నట్టు తెలిసింది. ఆయన మృతికి జిమ్ సభ్యులు సంతాపం తెలిపారు.

IN THE COURT OF HON'BLE XII ADDL.DISTRICT & SESSIONS JUDGE, R.R.DISTRICT AT: L.B.NAGAR
O.S.No. 289 OF 2023

Between :
Sri.Setty Yellaiah &another ...Plaintiffs
AND
M/s.Padmini Industries, Rep. by its Partner Ageeru Narender ....Defendant
To,
M/s.Padmini Industries,A registered Partnership Firm,Consisting of its Partner,Ageeru Narender S/o. A.Kistaiah,Aged about 63 years, Occ: Business,R/o. H.No.14-82/1, P & T Colony, Dilsukhnagar, Hyderabad. ...Defendant

Please take Notice that, the above said Plaintiff have filed the Suit for Specific Performance of Agreement of Sale Dated:27-09-2017 in respect of suit schedule property against you the said case is posted on 13-06-2024 for your appearance at 10.30 a.m. on the above said court, as such please make it convenient to attend on the said date i.e., 13-06-2024 either in person or through an Advocate, failing which, the matter will be decided Ex-parte.

// BY ORDER OF THE COURT //
(D. VENKAT REDDY)
Advocate.
H.No.11-8-157/A, Road No.9, Kranthi Nagar, Kothapet, Hyderabad
Cell: 99480 97075.

IN THE COURT OF THE 1ST JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS AT : SECUNDERABAD
O.S.No. 186 of 2024

Between:
Guru Prasad ....Plaintiff
AND
Arcot Sanath kumar & Another ...Defendants
To
All Concerned.
Please take notice that the above named Plaintiff had filed the above suit against you and another for declaration to declare the plaintiff as legal heir. The Hon'ble Court was pleased to order notice through substitute service, by publishing the same in the news paper. Thus, take notice that the above suit is posted to 25/06/2024 for your appearance. Therefore, please take notice and appear in person or through advocate before the Hon'ble 1 Junior Civil Judge, City Civil Courts, at Secunderabad on 25/06/2024 at 10.30 A.M. failing which the matter will be adjudicated in your absence.

(By Order of the Court)
G.V.S.RAMAJAH NAIDU
M.B.MANDAKINI
B.VIDYA LAKSHMI
ADVOCATES
VENKATESHWARI FLAT No.202, 12-5-35, DEEPTHI CHAMBERS, OPP. N.I.N.. TARNAKA, SECUNDERABAD.

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE, R.R.DISTRICT, AT: L.B.NAGAR
I.A.No.451 OF 2022 IN O.S.NO.1301 OF 2022

Between:
Mamidi Ashok Petitioner/Plaintiff
AND
Jeevan Singh and others ...Respondents/Defendants
To,
R-2. K.Vishnu S/o. Late K.Papaiah, Aged about 48 years, Occ: Business, R/o. Flat No.1, 1st floor, H.No. 14-2-332/A/4/1/1, Gyan Bagh Colony, Hyderabad.
R-7. Kondegari Swarupa W/o. Late K.Vittalaiah, Aged about 44 years, Occ: Household, R/o. Chilkur Village, Moinabad Mandal, R.R.District.
R-10. Kondegari Madhav D/o. Late K.Vittalaiah, Aged about 20 years, Occ: Household, R/o. Chilkur Village, Moinabad Mandal, R.R.District.

Take notice that my client Mamidi Ashok S/o. Late Mamidi Mallaiah filed O.S.No.1301 of 2022 now pending before the Hon'ble IX Addl. District Judge, R.R. District, at L.B. Nagar, seeking the reliefs of perpetual injunction and to declare the registered document No. 7290/2016, dated 01- 10-2016 registered at Sub-Registrar, Chevella, R.R. District, as null and void in respect of land in Sy.Nos.484/part (Ac.1-10 Gts., out of Ac.1-16 Gts.,) and 521/part (Ac.0-30 Gts.,), total admeasuring Ac.2-00 Gts., situated at Chilkur Village, Moinabad Mandal, Ranga Reddy District.

Further take notice that in the above case in O.S.No. 1301 of 2022 you are the Defendant Nos.2, 7, and 10. My client also filed IA No. 451/2022, in which you are the Respondent Nos.2, 7, and 10, seeking injunction pending disposal of the suit. The said IA No.451/2022 is posted for your appearance on 26.06.2024, at 10:30 a.m., before the Hon'ble IX Addi. District, Judge, Ranga Reddy District, at L.B. Nagar. In spite of this notice if you do not appear in the above case on the above said day and time either in person or through your advocate, the said case will be decided upon merits in your absence. Hence, this notice.

//BY ORDER OF THE COURT//
B.BAL REDDY
Advocate
#Flat No.302, Devi Midtown, 3rd Floor, Dwaraka Honda Showroom Building, Beside Ganesh Temple Suncity, Gandipet Mandal, Ranga Reddy District, TS-91

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE, R.R.DISTRICT, AT: L.B.NAGAR
I.A.No.450 OF 2022 IN O.S.NO.1301 OF 2022

Between:
Mamidi Ashok Petitioner/Plaintiff
AND
Jeevan Singh and others ...Respondents/Defendants
To,
R-2. K.Vishnu S/o. Late K.Papaiah, Aged about 48 years, Occ: Business, R/o. Flat No.1, 1st floor, H.No. 14-2-332/A/4/1/1, Gyan Bagh Colony, Hyderabad.
R-7. Kondegari Swarupa W/o. Late K.Vittalaiah, Aged about 44 years, Occ: Household, R/o. Chilkur Village, Moinabad Mandal, R.R.District.
R-10. Kondegari Madhav D/o. Late K.Vittalaiah, Aged about 20 years, Occ: Household, R/o. Chilkur Village, Moinabad Mandal, R.R.District.

Take notice that my client Mamidi Ashok S/o. Late Mamidi Mallaiah filed O.S.No.1301 of 2022 now pending before the Hon'ble IX Addl. District Judge, R.R. District, at L.B. Nagar, seeking the reliefs of perpetual injunction and to declare the registered document No. 7290/2016, dated 01- 10-2016 registered at Sub-Registrar, Chevella, R.R. District, as null and void in respect of land in Sy.Nos.484/part (Ac.1-10 Gts., out of Ac.1-16 Gts.,) and 521/part (Ac.0-30 Gts.,), total admeasuring Ac.2-00 Gts., situated at Chilkur Village, Moinabad Mandal, Ranga Reddy District.

Further take notice that in the above case in O.S.No. 1301 of 2022 you are the Defendant Nos.2, 7, and 10. My client also filed IA No. 450/2022, in which you are the Respondent Nos.2, 7, and 10, seeking injunction pending disposal of the suit. The said IA No.450/2022 is posted for your appearance on 26.06.2024, at 10:30 a.m., before the Hon'ble IX Addi. District, Judge, Ranga Reddy District, at L.B. Nagar. In spite of this notice if you do not appear in the above case on the above said day and time either in person or through your advocate, the said case will be decided upon merits in your absence. Hence, this notice.

//BY ORDER OF THE COURT//
B.BAL REDDY
Advocate
#Flat No.302, Devi Midtown, 3rd Floor, Dwaraka Honda Showroom Building, Beside Ganesh Temple Suncity, Gandipet Mandal, Ranga Reddy District, TS-91

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
O.S. No:201 OF 2022

BETWEEN:
SINGIREDDY ANJI REDDY and Others ... PLAINTIFFS
AND
SINGIREDDY MAHENDER REDDY and others . ..DEFENDANT
To,
D-17: NITI TRIVEDU, W/o.Dr. Rajiv Trivedi,aged about 58 years, Occ: Service,R/o.Plot No.79, Amulya Homes,G.R. Reddy Nagar, Kushaiguda, under GHMC, Kapra Mandal, Medchal-Malkajgiri District.
D-24: P. SHARATH BABU,S/o. Late. P. Narsaiah,aged about 45 years, Occ: Soft. Professional, R/o.H.No.43/57, Hanuman Nagar, Moula Ali, Hyderabad

NOTICE

Please take notice that the Plaintiffs herein had filed the above suit for Declaration and Recovery of Possession against defendants before the Hon'ble I Additional District Judge, Medchal-Malkajgiri District at Malkajgiri with respect to Suit Schedule Properties. On 02.04.2024 the Hon'ble Court posted the matter for your appearance. Hence make it convenient to appear before the Hon'ble Court on 18.06.2024 at 10:30 A.M. either personally or through authorized person of law or otherwise the matter will be decided in due process of law. Hence, this NOTICE,

//BY ORDER OF THE COURT//
J. GOVARDHAN REDDYK.SNIGDHAAdvocates
#104, Monte-Cristo Apts, Vayupuri, Sainikpuri, Secunderabad -500094.

IN THE COURT OF HON'BLE XIV ADDL.METROPOLITAN MAGISTRATE CUM JUNIOR CIVIL JUDGE, R.R.DISTRICT AT: HAYATHNAGAR
O.S.No. 331 OF 2024

Between:
1. Smt.Vaseema Rafath W/o. Siraj Mohiuddin,D/o. Late Mohd. ShahabuddinAged about 68 years, Occ: House wife,R/o. H.No.17-1-376/H/B/17, Housing Board,Santoshnagar, Saidabad, Hyderabad-500059.
2. Zakia Rafath W/o. Mohd.Talebuddin Taher,D/o. Late Mohd.Shahabuddin,Aged about 62 years, Occ: House wife,R/o. H.No.11-6-672, Flat No.402, Red Hills,Opp: Safa Kids School, Khairatabad, Hyderabad-500004.
3. Razia Rafath W/o. Azher Mohiuddin Siddiqui,D/o. Late Mohd.Shahabuddin,Aged about 61 Years, Occ: House wife,R/o. H.No.21-7-635, Chelapura, Near Chowck Masjid,Charminar, Hyderabad-500002. ...Plaintiffs
AND
1. The Tahsildar Hayathnagar Mandal,Ranga Reddy District.
2. Cherripalli Sai Krishna S/o Cherripalli Venkata Sravan Kumar, Aged about 28 years, Occ: Business,R/o. H.No.2-124, St. No.1, Sai Nagar,Chaitanyapuri, Hyd beside ICICI Bank, R.R.District.
3. All concerned ...Defendants
To
ALL CONCERNED
Please take Notice that, the above said Plaintiffs have filed the Suit for Declaration to declare the Plaintiffs are the Legal Heirs of Late Mohd.Shahabuddin & Rafath Unnisa Begum in respect of suit schedule property, in which if any person or persons having any claim, interest or objections, they may appear before the above said court on 12-06-2024 at 10.30 a.m., as such please make it convenient to attend either in person or through an Advocate, failing which, the matter will be decided Ex-parte.

SUIT SCHEDULE PROPERTY

All that the Part of Open Plot No.266, in Category II, in Phase IV of Vanasthalipuram Residential Complex, admeasuring 261.20 Sq.yards or its equivalent to 218.40 Sq.meters., in Sy.No.201, situated at Sahebnagar Kalan Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, under Ward No.6, Block No.3, GHMC Limits, Hayathnagar Circle-III and bounded as follows:
NORTH : Plot No.267.
SOUTH : Plot No.265.
EAST : Plot No.63.
WEST : 9 Mtrs., Wide Road.

// BY ORDER OF THE COURT //
D.VENKAT REDDY
ADVOCATE.
Office at: H. No. 11-8-157/A, Road No.9, Kranthinagar, Kothapet, Hyderabad.
Mobile No. 9948097075.

మాతృ దేవోభవ అనాథాశ్రమంలో దశాబ్ది ఉత్సవాలు

నవతెలంగాణ, బడంగ్‌పేట్

మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను సోమవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించారు. నాదర్ గుల్ గ్రామంలోని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో అనాథలకు రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని తన చేతుల మీదుగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ఎంతో మంది అనాథలు దిక్కు మొక్కు లేకుండా రోడ్లపై జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. కొందరు కన్న తల్లి దండ్రులకు సేవ చేయకపోవటంతో పాటు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతి స్థిమితం లేకపోవటంతో కొందరు ఇంటిని వదలి ఇతర ప్రాంతాలకు వెళ్లి అనాథలుగా రోడ్లపై జీవనం సాగిస్తున్న అనాథలను చేరదీసి వారికి మానవతా హృదయంతో సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి,భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలు పాట కమనీయం.. వ్యక్తిత్వం రమణీయం..

నవతెలంగాణ-నాగోల్



తన పాట కమనీయం ఆయన వ్యక్తిత్వం రమనీ యమని తన మధురమైన గళంతో పాటకు పట్టాభి షేకం చేసిన మహా గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం నాగోల్‌లోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'ఆకృతి' ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పి బాలసుబ్రహ్మణ్యం 78 జయంతిని వేడుకగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ గుప్త ఆయనకు ఘన నివాళులర్పించారు. సినీ దర్శకుడు డా.పి.సి ఆదిత్య మాట్లాడుతూ ప్రతి పాటకు ప్రాణ ప్రతిష్ట చేసిన అరుదైన గాయకుడు బాలు అన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో చిమ్మ పూడి సహ కార్యదర్శి మురళీ కృష్ణ తో పాటు పలువురు సంగీతాభిమానులు పాల్గొన్నారు.

నేడే కౌంటింగ్

- పోలీసుల డేగ కన్ను
- 13 ప్రాంతాల్లో 16 కౌంటింగ్ కేంద్రాలు
- మూడంచెల భద్రత
- అమల్లోకి 144సెక్షన్, ట్రాఫిక్ ఆంక్షల విధింపు
- మద్యం దుకాణాల మూసివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ మూడు పోలీస్ కమిషనరేట్ పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించి ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నగరం, నగరశివారు ప్రాంతాలల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పాతనేరస్తులు, కరుడుగట్టిన నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి, బుధవారం 6గం టల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని పోలీస్ అధికారులు ఆదేశించారు. బార్లు, వైన్స్‌దుకాణాలు, స్టార్ హోటళ్లు, రెస్టారెండ్లు తదితర ప్రాంతాలల్లో మద్యం విక్రయించడంపై నిషేధం విధించారు. రోడ్డు, రహదారులు, గల్లీలో బాణాసంచాలను కాల్చడాని పోలీసులు నిషేధించారు.



ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం

జిల్లాలో 13 లోకేషన్లలో 16 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంచారు. 144 సెక్షన్ అమల్లోకి తీసుకొచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద దాదాపు 200మీటర్ల వరకు నిషేధాజ్ఞలు అమల్లోకి తీసుకొచ్చారు. ఐదుగురికంటే ఎక్కువ మంది గుంపులుగుంపులుగా తిరగరాదు. కౌంటింగ్ కేంద్రాలలోకి ఎలాంటి వస్తువులు, మొబైల్ ఫోన్లు అనిమతి లేదు. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదట 3 కేంద్రాలల్లో పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తారు.మిగిలిన 12 కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక అబ్జర్వ్‌ను కేటాయించింది. అబ్జర్వర్ టేబుల్ వద్ద ఇద్దరు మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్,మైక్రో అబ్జర్వర్ ఉండనున్నారు. పొలిటికల్ పార్టీల ఏజంట్ల సమక్షంలో 4న ఉదయం స్ట్రాంగ్ రూంల తాళాలు తెరుస్తారు. జిల్లాలో ఓట్ల లెక్కింపునకు 1200 మంది కౌంటింగ్ సిబ్బందిని, వెయ్యి మందికి పైగా ఇతర సిబ్బందిని నియమించారు.

అత్యధికం యాకత్‌పురా.... అత్యల్పంగా చార్మినార్...

హైదరాబాద్ జిల్లాలో 13 లోకేషన్‌లో ఓట్ల లెక్కింపు జరగనుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 20 టేబుల్స్‌ను ఏర్పాటు చేసిన అధికారులు, మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో 14 టేబుల్స్ చొప్పున కౌంటింగ్‌కు ఏర్పాటు పూర్తి చేశారు. అత్యధికంగా యాకత్‌పూరా అసెంబ్లీ సెగ్మెంట్లలో 24రౌండ్లు, అత్యల్పంగా 15 రౌండ్లు చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్లలో కౌంటింగ్ జరగనుంది. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని కమలా నెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రంలో, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్ ప్రో.రాం రెడ్డి ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రంలో జరుగుతుంది. కంటోన్మెంట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి సికింద్రాబాద్ లోని సిఎస్ఐఐటి, వెస్లీ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో జరుగుతుంది. ఇదిలావుండగా ముషీరా బాద్, చాంద్రాయాణగుట్ట, అంబర్‌పేట్, మలక్‌పేట్, సంతోష్ నగర్, సికింద్రాబాద్, నాంపల్లి, బషీర్‌బాగ్, చార్మినార్, యాకుత్‌పురా, కర్వాన్ బహద్దూర్‌పురా, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమల్లోకి తీసుకొచ్చారు. పలు ప్రాంతాలల్లో ట్రాఫిక్ మళ్లింపు చేస్తారు. ఇందుకుగాను నగర వాసులు పోలీసులకు సహకరించాలని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్ల పరిశీలన



హైదరాబాద్, సిక్రిందాబాద్‌లోని పలు స్ట్రాంగ్ రూమ్స్ వద్ద బందోబస్తును హైదరాబాద్ సీపీ కొత్త కోట శ్రీనివాస రెడ్డి ఏర్పాట్లును పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను, భద్రత పరమైన అంశాలను పరిశీలిస్తూ, కౌంటింగ్ బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని ఎవరు కూడా నిబంధనలు ఉల్లంఘించకుండా చూసుకోవాల న్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్, భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు తెలిపారు.

వీ ఫర్ ఆర్ఫన్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు సేవారత్న పురస్కారం



నవతెలంగాణ-ముషీరాబాద్

వి ఫర్ అర్ఫన్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవారత్న పురసార్క అవార్డులను అందజేశారు. మాతృ దేవోభవ అనాథాశ్రమం నిర్వాహకులు గిరి ఆధ్వర్యంలో వి ఫర్ అర్ఫన్స్ ఫౌండేషన్ టీం ప్రజలకు చేస్తున్న సేవాలను గుర్తించి సేవారత్న అవార్డు పురస్కారాన్ని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ రాకేష్ చేర్యాల, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి దందాలో భార్యాభర్తలు





నవతెలంగాణ-మెహిదీపట్నం

పశ్చిమ బెంగాల్ నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్న భార్యాభర్తలను హుమాయ్ నగర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హుమాయున్ నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సైదిశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సిరాజ్ ఖాన్, రింకు దంపతులు. వీరు పశ్చిమ బెంగాల్ నుంచి గంజాయి తెచ్చి మెహిదీపట్నం బస్టాండ్ వద్ద గత కొన్ని రోజులుగా అవసరం ఉన్న వాళ్లకు విక్రయిస్తున్నారు. వీరి దందాపై సమాచారం అందుకున్న హుమాయ్ నగర్ పోలీసులు మెహిదీపట్నం బస్టాండ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న భార్యాభర్తలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో వారు తమ నేరాన్ని అంగీకరించారు. నిందితులను పోలీసులు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఏసీపీ చంద్రశేఖర్‌కు అభినందనలు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్‌కు ఇండియా పోలీస్ మెడల్ పురస్కారాన్ని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ చంద్రశేఖర్ చిన్ననాటి స్నేహితులు అడ్వకేట్ పోతంశెట్టి నాగేష్, డాక్టర్ మల్లికార్జున్, ప్రభాకర్, రమేష్, అంజయ్య ముంతాజ్ పాషా, గోపాల్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

రానున్న ఆషాడ మాసం బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి సంవత్సరం ఏర్పడే ఉమ్మడి దేవాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. మాజీ చైర్మెన్ రాకేష్ తివారీ, ఆలె భాస్కర్ రాజ్ తదితరుల సమక్షంలో కొత్త కమిటీ నిర్వహించి మీరాల మండి మహంకాళి దేవాలయం చైర్మెన్ గాజుల అంజయ్యను ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ చైర్మెన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గాజుల అంజయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా ఆషాడ మాసం అమ్మవారి బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ ఆధీనంలో ఉన్నటువంటి అన్ని దేవాలయాల చైర్మెన్లు భక్తులు తమకు సహకరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ మధుసూదన్ గౌడ్, రాకేష్ తివారి, మధుసూదన్ యాదవ్, కే.యస్ ఆనంద్, మల్లేష్ గౌడ్, కైలాష్, ఆదరణ మహేష్, ప్యారసాని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథ్ ముండే సేవలు మరువలేనివి



నవతెలంగాణ-అంబర్‌పేట

దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ వర్గాల, బహుజన వర్గాలకు లోకప్రియ నేత స్వర్గీయ గోపీనాథ్ ముండేసాహెబ్ చేసిన సేవలు చిరస్మరణమని, తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అంబర్‌పేట వంజరి సంఘం అధ్యక్షులు లవంగు ఆంజనేయులు అన్నారు. సోమవారం అంబర్‌పేట వంజరి సంఘం ఆధ్వర్యంలో న్యూ పటేల్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన స్వర్గీయ గోపీనాథ్ ముండే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్రలో వంజరి హక్కులని చట్టబద్ధం చేసి రిజర్వేషన్లు సాధించిన ఘనత గోపీనాథ్ ముండేకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో, ప్రధాన కార్యదర్శి డి. గంగరాజు, కోశాధికారి వారే బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంజరి నాగరాజు, వంజరి భూమన్న, దాత్రిక కాళిదాసు, విట్టల్ రాజ శేఖర్, బెండే మధుసూదన్, ద్వారక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

- ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ
- జాతీయ జెండాల ఆవిష్కరణ

నవతెలంగాణ-అంబర్‌పేట:



తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మూడోరోజు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నేతృత్వంలో ఈ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలోలోని మూడు, నాలుగో వార్డులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు సాయిని మూర్తి, గోనె ప్రదీప్ రావు, విజయేంద్ర సాగర్, రమణానాయుడు, ఇర్పానా సుల్తానా, శోభ, భాస్కర్ గౌడ్, ఎ. అశోక్, కూర నరేందర్, మిర్యాల రవీందర్, చంద్రమోహన్, టి.రమేష్, భీష్మాదేవ్, బి.నర్సింగ్రావు, బి.లింగంగౌడ్, బుచ్చిరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ..

బాగ్ అంబర్‌పేట డివిజన్ రెడ్‌బిల్డింగ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్ర మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పతాకం ఆవిష్కరణకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై కార్పొరేటర్ బి. పద్మవెంకటరెడ్డితో కలిసి జెండాను ఎగురవేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, మిర్యాల రవీందర్, పోలె నిరంజన్, టి.రమేష్, టి.శ్రీనివాస్‌యాదవ్, కోట్ల సంతోష్, జె.బాల్రాజు, వెంకటరమణరాజు, నరహరి, వీరస్వామి, శ్రీహరి, శివ, మహిళా నాయకురాళ్లు కవితారావు, పల్లె భారతి రెడ్డి, మహేశ్వరి, పద్మజముదిరాజ్, అమరావతి తదితరులు పాల్గొన్నారు. రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిడీపీరెడ్డి కూడా మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. గిరిధర్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, దారాయోబు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న అబిడ్స్ డీఐ నరసింహ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ శతగాత్రుడికి రక్తం అవసరమన్న సమాచారం తెలుసుకున్న అబిడ్స్ డిఐ కే. నరసింహ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేసి అతని ప్రాణాలు నిలబెట్టి మానవత్వాన్ని చాటుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు అబిడ్స్ డిఐ కే. నరసింహను అభినందించారు.

సుద్దమోని కుంటలో గుర్తు తెలియని మృత దేహం లభ్యం

నవతెలంగాణ, బడంగ్‌పేట్

బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మల్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న సుద్దమోని కుంటలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సుద్దమోని కుంటలో గుర్తు తెలియని వ్యక్తి శవం ఉన్నట్లు తెలియడంతో సంఘటన స్థలానికి ఎస్ఐ సైదులు చేరుకొని వివరాలను సేకరించారు. వ్యక్తి గ్రేప్ కలర్ ప్యాంట్, వైట్ కలర్ షర్టు, ఎత్తు 5 ఫీట్ల 6 ఇంచులు, హిందువుగా గుర్తించటం జరిగిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సిందన్నారు.మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో



పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం కౌంటింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ నేతత్వంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల కమిషను నిమించిన అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహించారు. జిల్లాలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలైన ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను జూన్ లెక్కిస్తారు. ఆ మేరకు కౌంటింగ్ సిబ్బంది (కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్లను) సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లకు కేటాయించారు. పారదర్శకంగాఈ ప్రక్రియ మొత్తాన్ని అబ్జర్వర్ల సమక్షంలో ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సితఈఓ మధుకర్ నాయక్, ఎన్నికల కమిషన్ ఆయా నియోజక వర్గాలకు నియమించిన పరిశీలకుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

- తొలిరోజు 2086 మంది హాజరు..
- 572 మంది విద్యార్థుల గైర్హాజరు

నవతెలంగాణ-సిటీబ్యూరో



పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 35 కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ విద్యార్థులు సజావుగా పరీక్ష రాశారు. తొలిరోజు ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష నిర్వహించారు. తొలి పరీక్షకు 2,658 మంది రాయాల్సి ఉండగా.. 2,086 మంది హాజరు కాగా.. 572 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో పదికిపైగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయగా.. ఆయా బృందాలు పరీక్షల నిర్వహణ పై తనిఖీలు చేశారు. తొలి పరీక్షలో ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు చర్యలు చేపట్టారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే



- కీలకంగా మారిన ముషీరాబాద్ ఓటర్లు
- సంబరాలకు సిద్ధమవుతున్న కార్యకర్తలు

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లు అందులో ముషీరాబాద్, రాంనగర్, గాంధీనగర్, బోలక్‌పూర్, కవాడిగూడ, అడిక్ మెట్ డివిజన్‌లు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 3 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు 50% ఓటింగ్ నమోదైయింది. ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల అధికారులు ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించారు. ప్రతి డివిజన్‌లో ప్రజల తీర్పు భిన్నంగా ఉండనుంది. ఆరు డివిజన్‌లో ప్రధాన పార్టీలకు కొన్ని డివిజన్‌లో సానుకూలత ఉన్న కొన్ని డివిజన్‌లో ప్రతికూలత కనిపిస్తుంది. మరి ముఖ్యంగా బోలెక్ పూర్ ఓటర్ల తీర్పు కీలకంగా మారనుంది. ఎందుకంటే మైనార్టీలు ఎక్కువగా ఉన్న డివిజన్ కావడంతో అధిక శాతం ఓట్లు ఒకే పార్టీకి పడనున్నాయి. తద్వారా మైనారిటీ ఓట్లు కీలకంగా మారనున్నాయి. మిగిలిన డివిజన్‌లలో గాంధీనగర్, కవాడిగూడ, అడిక్ మెట్, ఓటర్లు ఒకవైపు ఉండనున్నారు.

ఏ డివిజన్‌లలో ఎవరికి సానుకూలత

నియోజకవర్గంలోని బోలక్ పూర్‌లో మైనార్టీలు గత ఎన్నికల్లో అధికార పార్టీ అయినా బీఆర్ఎస్ వైపు ఉండి ఎమ్మెల్యే ముఠా గోపాల్ గెలుపులో కీలక పాత్ర వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు కావడంతో ప్రత్యామ్నాయ ప్రస్తుత అధికార పార్టీ అయినటువంటి కాంగ్రెస్ వైపు బోలక్ పూర్ ఓటర్లు ఉన్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విధంగా బోలెక్ పూర్ ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ కానున్నాయి. ఇది బీఆర్ఎస్ కు ప్రతికూల విషయమే అని చెప్పాలి. ఇక మిగిలిన డివిజన్‌లు గాంధీనగర్, కవాడగూడ, అడిక్ మెట్, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు పోటాపోటీగా ఉండనున్నారు. ముషీరాబాద్ డివిజన్ కాస్త కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అంశంగా మారనుంది. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థులు కిషన్‌రెడ్డి, దానం నాగేందర్, పద్మారావు గౌడ్ తమ సొంత ఇమేజ్‌ను నమ్ముకుని గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఎవరికి వారు తమదే గెలుపు అని నాయకులు, కార్యకర్తలు ముందస్తుగా సంబరాలకు సిద్ధమవుతున్నారు. టపాసులు, స్వీట్లు సిద్ధం చేసుకుంటున్నారు . మరి కొన్ని గంటల్లో వెలువడనున్న ప్రజల తీర్పుకు కోసం ఎదురు చూస్తున్నారు.

> "పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నటువంటి ప్రధాన పార్టీల అభ్యర్థులు కిషన్ రెడ్డి, (బీజేపీ) దానం నాగేందర్ (కాంగ్రెస్), పద్మారావు గౌడ్ (బీఆర్ఎస్) అభ్యర్థుల గెలుపులో ముషీరాబాద్ నియోజకవర్గం ఓటర్లు కీలకంగా మారనున్నారు. ప్రజలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారో తెలియని పరిస్థితి.. నియోజకవర్గ ప్రజల తీర్పును ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అభ్యర్థులు, ప్రజలు.. గెలుపు తమదే అని ధీమా వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు.. ప్రతిష్టాత్మకంగా మారనున్న ప్రజల తీర్పు.. ప్రజల్లో అభిమానం ఆదరణ ఉన్న నాయకుడిదే విజయం.."

సవాళ్లను అంగీకరిస్తేనే..

సారిక నాయక్... తన మనసు చెప్పినట్టు విన్నారు. అందుకే ఇప్పుడు నాయకత్వ స్థాయిలో ఉన్నారు. ప్రస్తుతం క్యాప్‌జెమినీలో గ్రూప్ చీఫ్ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ ఆఫీసర్‌గా అలాగే గ్రూప్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా కూడా ఉన్నారు. ఈ స్థాయికి ఎదిగేందుకు అనేక సవాళ్లు ఎదుర్కొన్నారు. నేడు సేల్స్ అండ్ మార్కెటింగ్‌లో 20 ఏండ్ల అనుభవం గడించారు. తన నిర్ణయాధికారాన్ని వినియోగించుకొని పని చేస్తున్న సంస్థలో లింగ వివక్షను రూపుమాపేందుకు నిత్యం కృషి చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...





సారిక బాల్యం నుండే మార్కెటింగ్ వ్యూహాలు, పరిశ్రమల వల్ల వచ్చే లాభ నష్టాల గురించి జరిగే చర్చలు వింటూ పెరిగారు. మార్కెటింగ్ సలహాదారుగా పనిచేసిన ఆమె తండ్రి దీనికి కారణం. మెరుగైన జీవితం, విద్య ప్రాముఖ్యతను ఈ చర్చలు ఆమెకు నొక్కి చెప్పేవి. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీని అభ్యసించారు. చదువులో ఎంతటి ప్రతిభ కనబరుస్తున్నా తన జీవితంలో ఆమెకు ఏదో వెలితి కనిపించింది. 'ఇంజనీరింగ్ పూర్తి చేసినా మార్కెటింగ్, విజ్ఞాన శాస్త్రాన్నే నేను ఇష్టపడ్డాను' అంటూ ఆమె పంచుకున్నారు. చివరకు ఆమె తన మనసు చెప్పినట్టే నడుచుకోవాలని నిర్ణయించుకున్నారు.

కింది నుండి మొదలుపెట్టి

మార్కెటింగ్‌లోకి ప్రవేశించాలనుకున్న సారిక 1996లో గుజరాత్ విశ్వవిద్యాలయం నుండి మార్కెటింగ్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. 1999లో విప్రో లిమిటెడ్‌కు ఫ్రంట్-లైన్ ఛానెల్ సేల్స్ మేనేజర్‌గా చేరారు. ఆ సంస్థ ప్రోగ్రామ్‌ను నిర్వహించే మొదటి తరం మహిళల్లో ఈమె కూడా ఒకరు. 'నేను హార్డ్‌కోర్ అమ్మకాలతో నా కెరీర్ ప్రారంభించాను. అంటే చాలా కింది నుండి మొదలుపెట్టాను. తర్వాత అకౌంట్ సెక్షన్‌కు వెళ్లాను. బెంగళూరుకు మారిన తర్వాత సంస్థ అతిపెద్ద ఖాతాలకు నాయకత్వం వహించాను' అని ఆమె జతచేస్తున్నారు.

కీలకపాత్ర పోషించారు

సారిక విప్రోలో 15 ఏండ్లకు పైగా పని చేశారు. మిషన్ నాణ్యత, వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో, పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషించారు. సిక్స్ సిగ్మా శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించి దాన్ని అమలు చేశారు. DMAIC మెథడాలజీలో గ్రీన్ బెల్ట్ శిక్షణకు ప్రధాన శిక్షకురాలిగా పనిచేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆమె బ్యాకెండ్, ప్రాసెస్ ప్రాముఖ్యతను నేర్చుకున్నారు. 2011లో ఆమె విప్రో ఇండియా వ్యాపారానికి సీఎంఓ, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్‌కు మార్కెటింగ్ హెడ్‌గా ఎంపికయ్యారు. అలాగే సంస్థలో ఏర్పాటు చేసిన లైంగిక వేధింపుల నివారణ కమిటీకి హెడ్‌గా కూడా ఉన్నారు. ఈ సమయంలో ఆమె మొదటిసారిగా సామాజిక బాధ్యతల గురించి తెలుసుకున్నారు.

కార్పొరేట్ నిచ్చెనపై

విప్రో తర్వాత డెల్ టెక్నాలజీస్‌లో మార్కెటింగ్ గ్లోబల్ డైరెక్టర్‌గా చేరారు. 2016లో క్యాప్‌జెమినీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా చేరారు. ఇక్కడ కూడా అనేక బాధ్యతలు చూశారు. చేరిన ఆరు నెలలకే క్లయింట్ ఎంగేజ్‌మెంట్ అండ్ ఎక్స్‌పీరియన్స్ టీమ్ హెడ్‌గా నియమితులయ్యారు. ఏడాదిలోనే క్యాప్‌జెమినీ ఇండియాకు డైవర్సిటీ అండ్ ఇన్‌క్లూజన్ ఛైర్‌పర్సన్ కూడా అయ్యారు. సారిక సీఎస్ఆర్ కోర్ కమిటీ, లైంగిక వేధింపుల నిరోధక (POPSH) కోర్ కమిటీ, క్యాప్‌జెమినీలోని సెంటర్ హెడ్ కమిటీలో కూడా ఒక భాగంగా ఉన్నారు.

సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

ఈ ప్రయాణంలో సవాళ్లు ఎప్పుడూ ఆమెతో పాటే ఉన్నాయి. అయితే ఆమె ఆ సవాళ్ల నుండి నిత్యం పాఠాలు నేర్చుకుంటూనే ఉన్నారు. 'మీరు పని చేయాలనుకుంటే, కెరీర్‌ను నిర్మించడానికి ఓ ఎంపిక చేసుకుంటే, దానితో పాటే వచ్చే సవాళ్లను అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి. పిల్లలు పుట్టినప్పుడు నేను ప్రధాన సమస్యను ఎదుర్కొన్నాను. మాకు కేవలం మూడు నెలల ప్రసూతి సెలవులు ఉండేవి. ఆ తర్వాత తప్పకుండా ఆఫీసుకు వెళ్ళాల్సిందే. ఆ సమయంలో నేను ఆఫీసులో ఉన్నప్పుడు పూర్తిగా పని పట్ల, ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబంపై దృష్టి పెట్టడం నేర్చుకున్నాను' అని ఆమె చెప్పారు. ఆమె తన కెరీర్‌ను ప్రారంభించినప్పుడు చాలా తక్కువ మంది రోల్ మోడల్స్ ఉండేవారని కూడా గుర్తు చేశారు. ఏ వేదికపై చూసినా, నాయకత్వ స్థాయిలో చూసినా కేవలం ఒక్క మహిళ మాత్రమే కనిపించేవారు. ఏదో ఒక రోజు ఆ మహిళ తాను కావాలని సారిక ఆకాంక్షించారు. 'కానీ ఇప్పుడు నేను నిర్ణయాలు తీసుకునే స్థితిలో ఉన్నాను. కనుక నాయకత్వంలో మహిళల భాగస్వామ్యం పెరగడం చాలా అవసరమని గుర్తించాను. కనుక మహిళలు వేదికపై ఉండటమే కాదు వారు చురుకైన పాత్రను పోషించేలా ప్రయత్నిస్తాను' అని ఆమె జతచేస్తున్నారు.

లింగ వైవిధ్య కార్యక్రమాలకు

తాను పని చేస్తున్న సంస్థలో లింగ వివక్షను రూపుమాపేందుకు సారిక కృషి చేస్తున్నారు. అందులో భాగంగా క్యాప్‌జెమినీలో వివిధ లింగ వైవిధ్య కార్యక్రమాలను ప్రచారం చేయడంలో సారిక చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆమె నాయకత్వంలో క్యాప్‌జెమినీ కెరీర్ పునరాగమనం, తిరిగి వర్క్‌ఫోర్స్‌లోకి మారాలనుకునే నైపుణ్యం కలిగిన మహిళా నిపుణులకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. TakeCHARGE అనేది ఆరు నెలల పాటు అమలు చేయబడే మరొక ప్రోగ్రామ్. ఇది మహిళా ఉద్యోగులను వారి సొంత కెరీర్ పథంలో నడిచేలా దృష్టి సారించింది. 'మనం భారత దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చేయవలసింది చాలా ఉంది. నా కెరీర్‌లో నేను ఎదుర్కొన్న అన్ని సవాళ్లను అంగీకరించాను. అవి ఇప్పుడు నన్ను మరింత దృఢంగా మార్చాయి. ఈ రోజు నా పాత్రలో నేను అనుభవించిన అంతరాలను ఇతరులకు ప్రయోజనాలుగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాను' అంటూ ఆమె తన మాటలు ముగించారు.

మనం ఎవరూ అనేదే...

గత అనుభవాలు తన కెరీర్‌ను గణనీయంగా తీర్చిదిద్దాయని సారిక అంటున్నారు. తన బాల్యంలో ఆమె తన అక్కలను చూసి చాలా నేర్చుకున్నారు. 'ఈ రోజు మనం కార్పొరేట్ సామాజిక బాధ్యత అని పిలుస్తున్నాం. అది ఎల్లప్పుడూ మన పెంపకంలో ఒక భాగం. అనేక భారతీయ కుటుంబాలకు, ముఖ్యంగా మధ్యతరగతి నేపథ్యాల నుండి వచ్చిన వారికి పునర్వినియోగం, రీసైకిల్ అనే భావన కొత్త కాదు. మన గతం, ప్రాథమికంగా మనం ఎవరూ అనేదే మనల్ని రూపొందిస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను' అంటూ ఆమె జతచేస్తున్నారు.



తిరిగి వాడుతున్నారా..?

పూరీలు, మురుకులు, డీప్ ఫ్రై, పిండి వంటల తయారీకి వాడిన నూనెను తిరిగి ఉపయోగిస్తుంటారు. ఒకసారి వేడి చేసిన నూనెను మళ్లీ ఉపయోగించడం మంచిది కాదని నిపుణులు పదే పదే చెబుతుంటారు. ఇది ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. ఒకసారి హీట్ చేసి వాడిన వంటనూనెను తిరిగి ఉపయోగించటం వల్ల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందో తెలుసుకుందాం..

ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ పెరుగుదల...
మిగిలిన నూనెను మళ్లీ వేడి చేసి ఉపయోగించినట్లయితే, అది నెమ్మదిగా ఆరోగ్యాన్ని క్షీణింపజేయడం ప్రారంభమవుతుంది. అలాగే, ఈ నూనెలో ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ పరిమాణం కూడా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది కోలుకోలేని ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది.

క్యాన్సర్ ప్రమాదం ..
ఒకసారి వాడిన నూనెను మళ్లీ వేడి చేయడం వల్ల అందులోని యాంటీ ఆక్సిడెంట్లు తొలగిపోతాయి. అటువంటి పరిస్థితిలో క్యాన్సర్ బ్యాక్టీరియా ఆహారంలో అతుక్కోవడం ప్రారంభమవుతుంది. ఇది క్యాన్సర్‌కు కారణం కావచ్చు.

గుండెపై ప్రతికూల ప్రభావాలు
మిగిలిపోయిన నూనెను పదే పదే వేడి చేయడం వల్ల



గుండెపై చెడు ప్రభావం పడుతుంది. అలాగే కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఇది మీకు గుండె సమస్యలను కలిగిస్తుంది.

ఊబకాయం ప్రమాదం పెరిగింది..
నూనెను మళ్లీ వేడి చేసి తింటే ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. వీటిలో ఒబేసిటీ సమస్య ఒకటి. అందుకే వాడిన నూనె వాడకూడదు. ఆరోగ్యంగా ఉండాలంటే ఒక్కసారి మాత్రమే నూనె వాడాలి.

ఆహారంలో కొవ్వు అంటుకుంటుంది..
నూనెను రీసర్క్యులేట్ చేయడం వల్ల అది పాన్ దిగువకు అంటుకోవడం ప్రారంభమవుతుంది. ఇది ఆహారంలో అతుక్కుని మన కడుపులోకి వెళుతుంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి పొరపాటున మిగిలిపోయిన నూనెను ఉపయోగించవద్దు.

ఎసిడిటీ, అజీర్ణ సమస్యలు...
ఉపయోగించిన నూనెను పదేపదే వాడటంవల్ల ఎసిడిటీ, అజీర్ణం వంటి ఉదర సంబంధిత సమస్యలు వస్తాయి.

నేడే కౌంటింగ్

(మొదటిపేజీ తరువాయి)

24 రౌండ్లున్న హైదరాబాద్, కరీంనగర్ ఫలితాలు సాయంత్రం నాలుగ గంటల వరకు రానున్నాయి. కౌంటింగ్ పూర్తయ్యాక ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 5 పోలింగ్ కేంద్రాల్లో వీవీప్యాట్‌లను లెక్కిస్తారు. అనంతరం రిటర్నింగ్ అధికారి తుది ఫలితాన్ని వెల్లడిస్తారు. లెక్కింపును పర్యవేక్షించేందుకు 49 మంది మైక్రో అబ్జర్వర్లు, 2,440 మంది సహాయ మైక్రో అబ్జర్వర్లను ఈసీ నియమించింది. కౌంటింగ్‌ను మానిటరింగ్ చేయడం కోసం హైదరాబాద్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో వార్ రూంను ఏర్పాటు చేశారు. మరో వైపు సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలో లిక్కర్ షాపుల మూసివేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు హాల్ వద్ద 100 మీటర్ల వరకు 144 సెక్షన్ విధించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం 3,32,16,348 మంది ఓటర్లకు గాను 2,20,24,806 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలతో సహా మొత్తం 525 మంది అభ్యర్థుల భవితవ్యం మరి కొద్ది గంటల్లో తేలనుంది.

సామాన్యులకు భారంగా టోల్‌ట్యాక్స్ రేట్లు

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నేటి నుంచి దేశ వ్యాప్తంగా జాతీయ రహదారుల టోల్ టాక్స్ రేట్లను సగటున 5శాతం పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పెంపుదలను వాయిదా వేసిన కేంద్రం, పోలింగ్ ముగియగానే ప్రయాణీకులపై తీవ్ర భారాన్ని మోపిందని విమర్శించారు. వివిధ రకాల వాహనాలను ఆరు కేటగిరీలుగా విభజించి, హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డులో టోల్ చార్జీలను 5శాతం పెంచుతున్నట్టు ఐఆర్‌బీ సంస్థ ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ పెంపుదల రూ.5 నుంచి రూ.50 వరకు పెరుగుతుందని తెలిపారు. ఈ చార్జీలు ప్రజలకు భారం కానున్నాయని పేర్కొన్నారు. ప్రతియేటా టోల్ రుసుం పెంచి వాహనదారులపై భారం మోపడం సరికాదని హితవు పలికారు.. టోల్‌గేట్ల వద్ద మంచినీరు, వాష్‌రూమ్‌లు తదితర కనీస సౌకర్యాలు కల్పించకపోవటంతో పాటు, గ్రామాలకు ఇరువైపుల సర్వీసు రోడ్లు కూడా వెయ్యలేదని తెలిపారు. చాలా సందర్భాల్లో టోల్‌గేట్ల వద్ద ట్రాఫిక్ నియంత్రించటంలో విఫలమవుతున్నారని గుర్తు చేశారు. కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని తెలిపారు. ఈ పెంపుదల సామాన్యుల నడ్డి విరిచి, టోల్‌గేట్ సంస్థల యజమానులకు దోచిపెట్టడమేనని విమర్శించారు.

నాలుగైదు రోజుల్లో రైతులకు విత్తనాలు అందిస్తాం

- మంత్రి తుమ్మల వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని రైతులకు నాలుగైదు రోజుల్లో విత్తనాలను అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కొన్ని చోట్ల పచ్చిరొట్ట విత్తనాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి విత్తనాలను ఇతర రాష్ట్రాలకు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. నాలుగైదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పత్తి విత్తన ప్యాకెట్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అమ్మాయిలదే హవా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ రాతపరీక్ష ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. పాలిసెట్‌కు 92,808 మంది దరఖాస్తు చేస్తే, 82,809 మంది అభ్యర్థులు రాతపరీక్షకు హాజరయ్యారని వివరించారు. వారిలో 69,728 (84.20 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత పొందారని చెప్పారు. ఇందులో అబ్బాయిలు 46,319 మంది హాజరుకాగా, 37,269 (80.47 శాతం) మంది అర్హత సాధించారని అన్నారు. 36,496 మంది అమ్మాయిలు దరఖాస్తు పరీక్ష చేస్తే, 32,459 (88.94 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని వివరించారు. పాలిసెట్ ఫలితాల్లో అమ్మాయిలే హవా కొనసాగించారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 8.47 శాతం అధికంగా ఉత్తీర్ణత పొందడం గమనార్హం. పాలిసెట్‌లో 120 మార్కులకు 30 శాతం అంటే 36 మార్కులొస్తేనే అర్హత సాధిస్తారని వెంకటేశం చెప్పారు. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు ఒక మార్కు సాధిస్తే ఉత్తీర్ణులవుతారని వివరించారు. 15,447 మంది ఎస్సీలు పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణత సాధించారని వివరించారు. 6,288 మంది ఎస్టీలు పరీక్ష రాస్తే, అందరూ ర్యాంకులు సాధించారని అన్నారు. ఎంపీసీ విభాగంలో ఖమ్మం జిల్లాకు చెందిన తూమాటి హరీశ్ 120కి 120 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారని చెప్పారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన లలిత్ మనోహర్ కటకం 119 మార్కులతో రెండో ర్యాంకు, మహబూబ్‌నగర్‌కు చెందిన జి భవిత, సూర్యాపేటకు చెందిన గోపగాని శ్రీనిఖ 119 మార్కులతో మూడో ర్యాంకును పొందారని వివరించారు. ఎంబైపీసీ విభాగంలో సూర్యాపేట జిల్లాకు చెందిన గోపగాని శ్రీనిఖ 120కి 119.5 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించారని చెప్పారు. అదేజిల్లాకు చెందిన సామ అశువర్ధన్‌రెడ్డి 118 మార్కులతో రెండో ర్యాంకు, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జి భవిత 117.5 మార్కులతో మూడో ర్యాంకు పొందారని అన్నారు. పాలిసెట్ ఫలితాల కోసం https://polycet.sbtet.telangana.gov.in https://polycetts.nic.in వెబ్‌సైట్లను చూడాలని కోరారు.

జులై 18 నుంచి పాలిటెక్నిక్ తరగతులు

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 20 నుంచి ప్రారంభమవుతుందని బుర్రా వెంకటేశం చెప్పారు. ఇప్పటికే షెడ్యూల్‌ను విడుదల చేశామని అన్నారు. ఈనెల 20 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించొచ్చనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 నుంచి 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. అదేనెల 22 నుంచి 27 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 30న తొలివిడత పాలిసెట్ ప్రవేశాలకు సీట్లను కేటాయిస్తామన్నారు. అదేనెల 30 నుంచి జులై నాలుగో తేదీ వరకు ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. వచ్చేనెల 18 నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. అదేనెల 15 నుంచి 17 వరకు ఓరియెంటేషన్ తరగతులను నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాల కోసం ఈనెల పది నుంచి https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

షాద్‌నగర్‌లో కొత్త పాలిటెక్నిక్ కాలేజీ

రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో కొత్తగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఈ విద్యాసంవత్సరంలో ప్రారంభమవుతుందని బుర్రా వెంకటేశం చెప్పారు. గత విద్యాసంవత్సరంలో 56 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 13,679 సీట్లు, 62 ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 18,935 సీట్లు కలిపి మొత్తం 32,614 సీట్లున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి పుల్లయ్య, సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ డాక్టర్ సి శ్రీనాథ్, ప్రవేశాల క్యాంపు అధికారి శ్రీనివాస్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కవిత కస్టడీ పొడిగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మరో నలుగురిపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు జులై 3కు వాయిదా వేసింది. కవితతో పాటు మరో నలుగురు నిందితుల పాత్రపై మే 10న ఈడీ దాదాపు 8 వేల పేజీలతో 6వ సప్లిమెంటరీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు (అనుబంధ చార్జిషీట్)ను ఈడీ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను గతనెల 29న ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు వెల్లడించింది. అలాగే నిందితులను కోర్టులో ప్రొడ్యూస్ చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం కవితను నేరుగా కోర్టులో ప్రొడ్యూస్ చేశారు. అలాగే మరో నలుగురిని ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవిత, చరణ్ ప్రీత్ సింగ్‌కు కస్టడీని పొడిగించారు. అలాగే అరెస్ట్ కానీ మరో ముగ్గురు నిందితులు దామోదర్ శర్మ, ప్రిన్స్‌కుమార్, ఇండియా హెడ్‌న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్‌కు రూ. లక్ష పూచికత్తు విధించారు. పాస్‌పోర్ట్ జప్తు చేయాలని ఆదేశించారు. కేసు తదుపరి విచారణను జులై 3కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి కావేరి బవేజా వెల్లడిం చారు. అనంతరం కవితను కలిసేందుకు భర్త, పిల్లలు, కుటుంబ సభ్యులకు అనుమతించింది. వారితో మాట్లాడిన అనంతరం పోలీసులు కవితను తీహార్ జైలుకు తరలించారు.

సీబీఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ లిక్కర్ స్కాం, సీబీఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మరోసారి పొడిగించింది. గతంలో విధించిన కస్టడీ ముగియడంతో... సోమవారం మధ్యాహ్నం వర్చువల్ మోడ్ ద్వారా ఆమెను కోర్టులో హాజరపరిచారు. ఈ సందర్భంగా దర్యాప్తు సజావుగా సాగాలంటే కవిత కస్టడీని పొడిగించాలని సీబీఐ తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఆమె కస్టడీని ఈనెల 7 వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది.

పాలు పిరం

(మొదటిపేజీ తరువాయి)

35లక్షల లీటర్ల పాలను విక్రయిస్తోంది. సమర్థవంతమైన 3-4 శాతం సవరణతో క్షేత్ర స్థాయిలో ధరల పెంపు కేవలం పాక్షికంగా మాత్రమే వినియోగదారులకు బదిలీ అవుతుందని తద్వారా పాల ఉత్పత్తిదారులు, వినియోగదారుల ప్రయోజనాలకు భద్రత కల్పిస్తామని మదర్ డెయిరీ పేర్కొంది.

కాగా, అమూల్ గేదె పాలు, గోల్డ్ మిల్క్, శక్తి మిల్క్ పాలు వరుసగా అరలీటరు రూ.36, 33, 30గా వున్నాయి. లీటరుకు రూ.2 పెంపుతో ఎంఆర్‌పిలో మూడు నుండి నాలుగు శాతం పెంపు కనిపిస్తుందని, ఇది, సగటు ద్రవ్యోల్బణం కన్నా చాలా తక్కువగానే వుంటుందని గుజరాత్ పాల సహకార మార్కెటింగ్ సమాఖ్య (జీసీఎంఎంఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. వినియోగదారులు చెల్లించే ప్రతి రూపాయిలో దాదాపు 80పైసల వరకు పాల ఉత్పత్తిదారులకు చేరుతుందని పేర్కొంది.

సీపీఐ(ఎం) ఖండన

అమూల్, మదర్‌డెయిరీ సంస్థలు లీటరు పాల ధరను రూ.2 పెంచడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఎన్నికలు ముగిసేవరకు ప్రభుత్వం వేచి చూసిందని, ఆ వెంటనే ప్రజలపై భారం మోపిందని దీంతో స్పష్టమైందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇంతకుముందే, పోలింగ్ ముగిసిన వెంటనే, రోడ్ టోల్ పన్ను ఐదు శాతం పెంచారని, దీనివల్ల అన్ని సరుకుల ధరలు పెరుగుతాయని, ముఖ్యంగా ఆహార పదార్థాల ధరలు పెరుగుతాయని, మరోవైపు ప్రజల రవాణా వ్యయం కూడా పెరుగుతుందని సీపీఐ(ఎం) పేర్కొంది.

కుటుంబాల బడ్జెట్‌పై భారం : ఐద్వా

(మొదటిపేజీ తరువాయి)

చేయడమేనని విమర్శించింది. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న మహిళలపై ఈ చర్యలు అదనపు భారాన్ని మోపుతాయని పేర్కొంది. పిల్లలను, మహిళలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఈ పాల ధరలను ఉపసంహరించాలని ఐద్వా డిమాండ్ చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామని పేర్కొంది.

ఓపిక పట్టండి

(మొదటిపేజీ తరువాయి)

తాము ఏర్పాటు చేస్తామని చెప్పాయి. " దీనిని ఎగ్జిట్ పోల్ అని పిలవరు. దాని పేరు 'మోడీ మీడియా పోల్' " అని రాహుల్ గాంధీ ఇప్పటికే అభివర్ణించారు. దివంగత పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా ప్రసిద్ధ పాటను ప్రస్తావిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి 295 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు.

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి 100వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సోనియా గాంధీ పాల్గొని మాట్లాడారు. " కళైంజర్ కరుణానిధి 100వ జయంతి సందర్భంగా డీఎంకేకు చెందిన నా సహచరులతో కలిసి ఇక్కడకు రావటం ఆనందంగా ఉన్నది. ఆయనను చాలా సందర్భాలలో కలుసుకునే అదృష్టం కలిగింది. ఆయన చెప్పేది వింటూ.. ఆయన వివేకం, సలహాల నుంచి ప్రయోజనం పొందాను. అతనిని కలవడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని సోనియా అన్నారు. ఆమెతో పాటు ఇండియా బ్లాక్‌లోని మరికొన్ని పార్టీల నేతలు సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ. రాజా, సీపీఐ(ఎం)ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సమాజ్‌వాది పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్‌తోపాటు డీఎంకే పార్టీకి చెందిన సీనియర్ నాయకులు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నివాళులర్పించారు.

గెలుపెవరిది?

(మొదటిపేజీ తరువాయి)

అమిత్ షా వంటి సీనియర్ మంత్రులు, అలాగే ఇతర మంత్రులు, కొంత మంది పార్టీ ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. " ఏడు దశల్లో ఓటింగ్ ఎలా జరిగిందనే దానిపై ప్రధానంగా సమీక్షించడంతో పాటు కౌంటింగ్ సన్నాహాలను కూడా సమీక్షించాల్సి ఉంది" అని నడ్డా ఇంట్లో జరిగిన సమావేశంపై బీజేపీ సీనియర్ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే చెప్పారు. హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఎం.ఎల్. ఖట్టర్‌తో పాటు సీనియర్ మంత్రి పీయూష్ గోయల్ కూడా ఈ సమావేశానికి హాజరైనట్లు సమాచారం. అలాగే చివరి దశ పోలింగ్ రోజున (జూన్ 1న) ఇండియా ఫోరం సమావేశమైంది. సమావేశానంతరం ఇండియా ఫోరానికి 295కు పైగా స్థానాలు వస్తాయని ప్రకటించారు.

రేవ్‌పార్టీ కేసులో నటి హేమ అరెస్టు

బెంగళూరు : బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో సినీ నటి హేమ అరెస్టయ్యారు. ఈ కేసులో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు ఆమెకు రెండుసార్లు నోటీసులి వ్వగా విచారణకు హాజరుకాలేదు. తాజాగా మూడోసారి పోలీసులు నోటీసులు పంపడంతో ఆమె సోమవారం విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరచనున్నారు. కాగా, బెంగళూరు నగర శివారులోని హెబ్బగోడిలో గత నెల మే 20వ తేదీన జరిగిన రేవ్‌పార్టీలో పలువురు తెలుగు నటీనటులు, మోడళ్లు పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే ఈ రేవ్ పార్టీకి, తనకు ఎలాంటి సంబంధం లేదని హేమ మొదట బుకాయించారు. ఆ తర్వాత తనకు జరిపిన రక్త పరీక్షల్లో ఆమె డ్రగ్స్ తీసుకున్నారని రుజువైంది. దీంతో ఈ కేసు విచారణకు హాజరుకావాలని సీసీబీ పోలీసులు రెండుసార్లు హేమకు నోటీసులిచ్చారు. కానీ ఆమె తనకు వైరల్ ఫీవర్ వచ్చిందని, విచారణకు హాజరు కాలేనని బెంగళూరు పోలీసులకు లేఖ రాశారు. ఆమె అభ్యర్థనను పోలీసులు పరిగణనలోకి తీసుకోకుండా మూడోసారి కూడా నోటీసులిచ్చారు. ఈ పార్టీకి ప్రధాన కారకులైన రణధీర్, మహ్మద్ సిద్ధిఖీ, వాసు, అరుణ్‌కుమార్, నాగబాబును పోలీసులు ఇదివరకే అరెస్టు చేశారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

దేశంతో పాటు రాష్ట్రంలోనూ నేడు ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనున్న తరుణంలో పోలీసు అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. మంగళవారం, తెలంగాణలోని 17 లోక్‌సభతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్టు రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ సోమవారం తెలిపారు. 34 కౌంటింగ్ కేంద్రాల వద్ద తొలి దశలో సీఆర్పీఎఫ్, రెండో దశలో టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్, మూడో దశలో సివిల్ పోలీసులు కాపలా కాసేలా సెక్యూరిటీని పటిష్టం చేశామని చెప్పారు.

కూర్పు కుదిరేనా?



2007 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన టీమ్ ఇండియా.. పొట్టి ఫార్మాట్‌లో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. భారత్ 2007 టీ20 వరల్డ్‌కప్ సాధించటంతో.. ఆ మరుసటి ఏడాది నుంచే బీసీసీఐ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు శ్రీకారం చుట్టింది. 20 ఓవర్ల ఆటలో భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా పెను మార్పులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా బీసీసీఐ దోహదం చేసింది. కానీ 2007 తర్వాత టీమ్ ఇండియా మరోసారి పొట్టి ప్రపంచకప్ అందుకోలేక పోయింది. 2014 ఫైనల్లో, 2016 సెమీఫైనల్లో, 2022 సెమీఫైనల్లో భారత్ నిరాశపరిచింది. 2024లో టీమ్ ఇండియా మరోసారి పొట్టి కప్పు వేటకు సిద్ధమైంది. పొట్టి కప్పు కల సాకారం కావాలంటే.. తొలుత తుది జట్టు కూర్పు కుదరాలి!!.

- బ్యాటింగ్ ఆర్డర్ కూర్పుపై ఆసక్తి
- జైస్వాల్, దూబెలలో ఒకరికే అవకాశం!

రేపు ఐర్లాండ్‌తో భారత్ తొలి పోరు

నవతెలంగాణ క్రీడావిభాగం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2021, 2022 ఎడిషన్లలో టీమ్ ఇండియా విఫలమైంది. 2021లో ఏకంగా గ్రూప్ దశలో నిష్క్రమించగా.. 2022లో సెమీఫైనల్స్‌లో పరాజయం చవిచూసింది. 2024 టీ20 ప్రపంచకప్ సవాల్‌కు టీమ్ ఇండియా అంత గొప్పగా సన్నద్ధమైనట్టు అనిపించదు. గత ప్రపంచకప్‌లో ఆడిన జట్టు, వ్యూహంతోనే మళ్లీ ఇప్పుడూ ఆడేందుకు సిద్ధమైన టీమ్ ఇండియా... ఫలితం మాత్రం భిన్నంగా ఉండాలని కోరుకుంటుంది. 2022 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌తో ఆడిన భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏడుగురులో కనీసం ఐదుగురు ఇప్పుడున్న జట్టులోనూ ఉన్నారు. గాయంతో రవీంద్ర జడేజా దూరమైనా.. అక్షర్ పటేల్ ఆటతీరు జడేజా శైలి దాదాపుగా ఒకటే. 2024 టీ20 ప్రపంచకప్‌కు సిద్ధమయ్యేందుకు టీమ్ ఇండియా గత ఏడాదిన్నరగా వ్యూహాత్మకంగా పెద్దగా శ్రమ పడినట్టు కనిపించదు. ఇతర జట్లు పొట్టి ఫార్మాట్‌లో వేగంగా మ్యాచ్‌ను గతిని మార్చగల కుర్రాళ్లకు అవకాశాలు కల్పిస్తుండగా.. భారత జట్టులో మాత్రం స్టార్‌డమ్ మేనియా నడుస్తోంది. అగ్ర క్రికెటర్లకే జట్టులో అగ్ర తాంబూలం అందించే సంప్రదాయం కొనసాగిస్తున్నారు. సెలక్షన్ కమిటీ, జట్టు మేనేజ్‌మెంట్, కెప్టెన్, కోచ్.. ఇలా అందరూ ప్రపంచకప్ ముంగిట నిద్ర లేచారు!. ఓ మూడు నెలల ముందు వరకు ప్రపంచకప్‌లో కెప్టెన్ ఎవరనే అంశం సైతం ఎవరికీ తెలియదు. ప్రపంచకప్ టైటిల్ వేటను గతంలో ప్రయత్నించిన వారే మరోసారి ఇప్పుడూ వేటాడుతున్నారు.

కూర్పు కీలకం : భారత క్రికెట్ సంస్థాగతంగా ఓ సమస్యను ఎదుర్కొంటుంది. స్టార్‌డమ్ ఎక్కువగా పెద్దపీట వేయటం భారత క్రికెట్‌కు చేటు చేస్తోంది. ప్రస్తుతం టీ20 ప్రపంచకప్ జట్టులో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మతో జట్టుకు ఎంత లాభమో, అంతే నష్టం కూడా!. వన్డే ఫార్మాట్‌లో కోహ్లి, రోహిత్ విలువ వెలకట్టలేనిది. కానీ టీ20ల్లో మాత్రం వెటరన్ స్టార్స్ కాస్త వెనుకబడ్డారు. సంప్రదాయ బ్యాటింగ్ శైలి కారణంగానే 2016 సెమీఫైనల్లో వెస్టిండీస్ చేతిలో దెబ్బతిన్న విషయం ఇక్కడ మరిచిపోకూడదు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్ రూపంలో ముగ్గురు ఓపెనర్లు అందుబాటులో ఉన్నారు. విరాట్ కోహ్లి ఇటీవల ఐపీఎల్‌లో పరుగుల వరద పారించాడు. 741 పరుగులతో ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. రోహిత్ శర్మ ఎటాకింగ్ శైలి, అనుభవం తీసి పారేయలేం. రోహిత్, కోహ్లి ఓపెనర్లు వచ్చినప్పుడు.. లెఫ్ట్ ఆర్మ్ పేసర్లను ఎదుర్కోవటం తలనొప్పి కానుంది. ఇటీవల కోహ్లి కాస్త మెరుగైనా.. లెఫ్టార్మ్ పేసర్లపై ఎదురుదాడి చేసే పరిస్థితి లేదు. నాకౌట్ మ్యాచుల్లో అగ్ర జట్లు ఈ బలహీనతపై ఫోకస్ చేసేందుకు అవకాశం ఉంది. యశస్వి జైస్వాల్‌ను ఓపెనర్‌గా తీసుకొస్తే.. రోహిత్ కుదురుకునేందుకు సమయం తీసుకోవచ్చు. జైస్వాల్ పవర్‌ప్లేతో ఎదురుదాడి చేస్తే.. ఆ తర్వాత రోహిత్ శర్మ మొదలుపెట్టవచ్చు. కానీ నం.3 బ్యాటర్‌గా విరాట్ కోహ్లి లేదా సూర్యకుమార్ యాదవ్ అనే అంశం మరో సమస్య. సూర్యకుమార్ యాదవ్ నాల్గో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తే రిషబ్ పంత్ మరో స్థానం వెనక్కి వెళ్లాల్సి ఉంటుంది. రోహిత్, కోహ్లిలలో ఎవరో ఒకరు కనీసం పది ఓవర్ల పాటు క్రీజులో ఉండగలరు. దీంతో మిడిల్ ఆర్డర్, లోయర్ మిడిల్ ఆర్డర్ డెత్ ఓవర్లలో ఊచకోతకు అనువైన వాతావరణం ఏర్పడనుంది. రవీంద్ర జడేజా, శివం దూబె సైతం రేసులోనే నిలిచారు.



కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తుది జట్టులో ఖాయం. సూర్యకుమార్ యాదవ్‌ను ఫామ్‌తో సంబంధం లేకుండా టీ20 జట్టులో చేర్చవచ్చు. గ్రూప్ దశలో విఫలమైనా... నాకౌట్‌లో సూర్య ప్రభావం ఊహించని స్థాయిలో ఉంటుంది. ఓ వికెట్ కీపర్, ఇద్దరు ఆల్‌రౌండర్లు అవసరం. ఇక్కడితోనే ఆరు బెర్తులు అయ్యాయి. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ రాక టీమ్ ఇండియాకు గొప్ప బలం. పేస్‌తో బుమ్రా, స్పిన్‌తో కుల్దీప్ ఏం చేయగలరో ప్రత్యర్థులకు బాగా తెలుసు. ఇద్దరు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లు జట్టులో కచ్చితంగా ఉండాల్సిందే. ఐదో బౌలర్ కోటా ఓవర్లను ఇద్దరు ఆల్‌రౌండర్లు సమానంగా పంచుకోవాల్సి ఉంటుంది. అప్పుడు దూబె, జైస్వాల్ ఇద్దరినీ తుది జట్టులో చేర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. కానీ ప్రస్తుతం నలుగురు బౌలర్లతో బరిలోకి దిగే సాహసం ఏ జట్టూ చేయబోదు. దీంతో జైస్వాల్, శివం దూబెలలో ఎవరో ఒకరే తుది జట్టులో నిలవాల్సి ఉంటుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా.. బ్యాటింగ్ లైనప్ టాప్-6. ఏడో బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్, శివం దూబెలలో ఎవరో ఒకరికి అవకాశం ఉంది. గత ప్రపంచకప్‌తో పోల్చితే ఈ సారి యశస్వి జైస్వాల్, శివం దూబె మాత్రమే కొత్త. వాస్తవికంగా చూస్తే.. పొట్టి ఫార్మాట్‌లో యశస్వి జైస్వాల్, శివం దూబెలకు కచ్చితంగా చోటు ఇవ్వాలి. పరిస్థితులకు తగినట్టు తుది జట్టు కూర్పు ఎంచుకుంటే గతం కంటే భిన్నమైన ఫలితం వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సంప్రదాయ పద్ధతిలోనే సాగుతామంటే గతంలో మాదిరిగానే ఇంటిబాట పట్టేందుకు పెద్దగా సమయం పట్టదు!.

పసికూనల సూపర్ థ్రిల్లర్

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో అగ్రజట్ల అమీతుమీ ఆరంభం కాకముందే.. పొట్టి కప్పు సమరం హీటెక్కింది. ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య అమెరికా అదరగొట్టగా.. రెండో రోజు పసికూనల పోరు ఉత్కంఠభరితంగా సాగింది. నమీబియా, ఓమన్ మ్యాచ్ ఆఖరు బంతి వరకు ఉత్కంఠ రేపింది. ఇరు జట్ల స్కోర్లు టై కాగా.. మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్ థ్రిల్లర్‌లో నమీబియా మెరుపు విజయం ఖాతాలో వేసుకుంది. తొలుత ఓమన్, నమీబియా 109 పరుగులు చేయగా.. సూపర్ ఓవర్‌లో నమీబియా 21 పరుగులు చేయగా.. ఓమన్ 10 పరుగులే చేసింది.

- ఓమన్‌పై నమీబియా ఉత్కంఠ విజయం
- సూపర్ ఓవర్‌లో ఓమన్‌కు తప్పని ఓటమి
- ఓమన్ 109/10, నమీబియా 109/6



నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

పసికూనల మ్యాచ్‌తో టీ20 ప్రపంచకప్ మరింత ఆసక్తికరంగా మారింది!. సూపర్ ఓవర్‌కు దారితీసిన మ్యాచ్‌లో నమీబియా మెరుపు విజయం సాధించింది. సూపర్ ఓవర్‌లో నమీబియా తొలుత 21/0 పరుగులు చేసింది. బిలాల్ ఖాన్ ఓవర్లో డెవిడ్ వైసీ ఓ ఫోర్, సిక్సర్‌తో మెరువగా.. ఆ తర్వాత ఎరాస్మస్ సైతం రెండు బౌండరీలతో చెలరేగాడు. ఛేదనలో ఓమన్ చతికిల పడింది. డెవిడ్ వైసీ సూపర్ ఓవర్‌ను అద్భుతంగా వేశాడు. తొలి ఐదు బంతులకు ఓమన్ నాలుగు పరుగులే చేసింది. ఆఖరు బంతికి ఆకిబ్ సిక్సర్ బాదినా.. అప్పటికే నమీబియా విజయం ఖాతాలో వేసుకుంది. అంతకుముందు ఓమన్ 19.4 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. డెవిడ్ వైసీ (3/28), రూబెన్ (4/21) విజృంభించటంతో ఓమన్ బ్యాటర్లు చతికిల పడ్డారు. ఖలీద్ (34, 39 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), జీసన్ మక్సూద్ (22, 20 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. ఛేదనలో నమీబియా జాన్ (45, 48 బంతుల్లో 6 ఫోర్లు), నికోలాస్ డెవిన్ (24, 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరిశారు. ఆఖరు ఓవర్లో ఐదు పరుగులు అవసరం కాగా.. నమీబియా నాలుగు పరుగులే చేసింది. దీంతో నమీబియా, ఓమన్ స్కోర్లు సమం అయ్యాయి. నమీబియా ఆల్‌రౌండర్ డెవిడ్ వైసీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఓమన్‌పై విజయంతో నమీబియా గ్రూప్-బిలో పాయింట్ల ఖాతా తెరిచింది. నమీబియా రెండు పాయింట్లు సాధించి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది.

డెవిడ్, రూబెన్ విజృంభణ : టాస్ నెగ్గిన నమీబియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పేసర్లు రూబెన్, డెవిడ్ చెలరేగటంతో ఓమన్ టాప్ ఆర్డర్ విలవిల్లాడింది. కశ్యప్ ప్రజాపతి (0), నసీం ఖుషీ (6), ఆకిబ్ (0)లను రూబెన్ ఆరంభంలోనే సాగనంపాడు. జీషన్ మక్సూద్ (22), ఖలీద్ (34) నాల్గో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. అయాన్ ఖాన్ (15) సైతం విలువైన పరుగులు జోడించాడు. మహ్మద్ నదీమ్ (6), మెహ్రాన్ ఖాన్ (7), షకీల్ (11), ఖలీముల్లా (2) లోయర్ ఆర్డర్‌లో ఒక్కో పరుగు జత చేశారు. 19.4 ఓవర్లలోనే ఓమన్ కుప్పకూలింది. 109 పరుగులకే ఆలౌటైంది.

జాన్ మెరిసినా.. : 110 పరుగుల ఛేదనలో నమీబియా బ్యాటర్లు మెరిసినా.. డెత్ ఓవర్లలో ఓమన్ బౌలర్లు పుంజుకున్నారు. ఓపెనర్ మైకల్ వాన్ లింగెన్ (0) డకౌట్‌గా నిష్క్రమించినా.. నికోలాస్ (24), జాన్ (45) రెండో వికెట్‌కు 42 పరుగులు జోడించారు. ఆరు ఫోర్లతో మెరిసిన జాన్.. నమీబియాను గెలుపు దిశగా తీసుకెళ్లాడు. నికోలాస్, జాన్‌లు నిష్క్రమించగా.. నమీబియా ఒత్తిడిలో పడింది. ఎరాస్మస్ (13), స్మిత్ (8), గ్రీన్ (0) నిరాశపరిచారు. ఆఖరు ఓవర్లో డెవిడ్ వైసీ (9 నాటౌట్) క్రీజులో నిలిచినా.. ఐదు పరుగులు చేయటంలో విఫలమయ్యాడు. 20 ఓవర్లలో 6 వికెట్లకు నమీబియా 109 పరుగులే చేసింది. మెహ్రాన్ ఖాన్ (3/7) మూడు వికెట్లతో మెరువగా.. బిలాల్ ఖాన్ (1/25), ఆకిబ్ (1/17) రాణించారు.

సూపర్ సబలెంక

- క్వార్టర్‌ఫైనల్లో సబలెంక, రిబకినా
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024

పారిస్ (ఫ్రాన్స్) : ఫ్రెంచ్ ఓపెన్‌లో బెలారస్ భామ, రెండో సీడ్ సబలెంక సూపర్ షో కొనసాగుతుంది. మహిళల సింగిల్స్ నాల్గో రౌండ్‌లో 6-2, 6-3తో సబలెంక అలవోక విజయం సాధించింది. అమెరికా క్రీడాకారిణి ఎమ్మా నవ్వారోపై వరుస సెట్లలో గెలుపొందింది. ఏడు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో సబలెంక అదరగొట్టింది. పాయింట్ల పరంగా 64-41తో సబలెంక తిరుగులేని ఆధిపత్యం చూపించి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. కజకిస్థాన్ క్రీడాకారిణి ఎలెనా రిబకినా సైతం క్వార్టర్స్‌కు చేరుకుంది. 6-4, 6-3తో ఉక్రెయిన్ అమ్మాయి ఎలినా స్విటోలినాపై వరుస సెట్లలో విజయం సాధించింది. ఐదు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన రిబకినా క్వార్టర్‌ఫైనల్లో జేస్మిన్‌తో తలపడనుంది. ఇటలీ అమ్మాయి జేస్మిన్ 4-6, 6-0, 6-1తో ఎలినాపై మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించింది. మహిళల క్వార్టర్‌ఫైనల్లో నేడు కోకో గాఫ్‌తో, జేబుర్.. ఇగా స్వైటెక్‌తో ఒండ్రుసోవా తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ జానిక్ సినర్ (ఇటలీ) 2-6, 6-3, 6-2, 6-1తో మొటెట్‌పై విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపాడు.



భావోద్వేగాల సమాహారంగా మనమే



శ్రీరామ్ ఆదిత్య

హీరో శర్వానంద్ నటించిన తన 35వ చిత్రం 'మనమే'. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్‌లో నిర్మాత టిజి విశ్వప్రసాద్ అత్యంత గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఈనెల 7న థియేటర్లలో గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య మీడియాతో మాట్లాడుతూ, 'పేరెంటింగ్ ఎమోషన్ గురించి కొంచెం డిఫరెంట్‌గా చెప్పాలనే ఐడియా ఎప్పటినుంచో ఉంది. అది ఫన్‌గా, ఫుల్ ఎనర్జీతో చెప్పాలనేది నా ఉద్దేశం. అలాగే పిల్లలతో సినిమా వచ్చి చాలా కాలం అయ్యింది. అందులో తెలియని ఇన్నోసెన్స్ ఉంటుంది. ఆ ఇన్నోసెన్స్ టచ్ చేయాలని అనుకున్న కథ ఇది. శర్వానంద్‌కి ఈ కథ చెప్పిన వెంటనే 'చేసేద్దాం పక్కా' అన్నారు. ఇప్పటి వరకూ క్రైమ్ థ్రిల్లర్స్ చేశాను. అయితే 'మనమే' నా ఫేవరేట్ జోనర్. నాకు హ్యూమర్ చాలా ఇష్టం. ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో మనమే నా మోస్ట్ ఫేవరేట్ ఫిల్మ్. మా అబ్బాయి యాక్ట్ చేశాడనే ఒక రీజన్ ఉంది. ఇందులో దాదాపు 16 పాటలు ఉన్నాయా అని అందరూ అడుగుతున్నారు. అయితే ఇందులో సాంగ్స్ సినిమా ఫ్లోకి యాడ్ అవుతాయే గానీ ఆపవు. ఇందులో ప్రతి సాంగ్ సినిమాని ఇంకా ఫాస్ట్‌గా తీసుకెళుతుంది. ఈ కథ అనుకున్నప్పుడే విజువల్‌గా ఒక కలర్ టోన్ ఫిక్స్ అయిపోయాను. ఫెయిరీ టైల్ లాంటి సినిమా చేయాలని అనుకున్నాం. అలాంటి సినిమా చేయాలంటే మ్యూజిక్కే ఆ యాడ్ ఆన్ ఇస్తుంది. హేశం చాలా బ్యూటీఫుల్ మ్యూజిక్ ఇచ్చాడు. ఫెయిరీ టైల్ లాంటి కథ అనగానే లండన్‌లో అలాంటి ఆర్కిటెక్చర్ ఉంటుంది. అది ఉంటేనే ఆ మ్యాజిక్ వస్తుంది. అందుకే లండన్ వెళ్లాం. విశ్వప్రసాద్ చాలా సపోర్ట్ చేశారు. ఇందులో శర్వా, కృతి వైఫ్ అండ్ హస్బెండ్‌గా కనిపిస్తారా లేదా అనేది సర్‌ప్రైజ్. శర్వానంద్‌ది చాలా చిల్ క్యారెక్టర్. సినిమా అంతా ఆయన క్యారెక్టర్ చాలా లైవ్లీగా ఉంటుంది' అని తెలిపారు.

అందర్నీ మెప్పించే సత్యభామ



శ్రీరామ్ ఆదిత్య

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'సత్యభామ'. నవీన్ చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. "మేజర్" చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు.

ఈ నెల 7న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల మీడియాతో మాట్లాడుతూ, 'కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ చేస్తుండటంతో ఈమూవీ మీద నాకు ఎగ్జైట్‌మెంట్ పెంచింది. అలాగే శశికిరణ్‌తో నేను చేస్తున్న మూడో చిత్రమిది. డైరెక్టర్ సుమన్ కూడా బాగా పరిచయం. ఈ సినిమాలో కాజల్ యాక్షన్ సీక్వెన్సులు చూస్తున్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే వారికి 'సత్యభామ' బాగా నచ్చుతుంది. ఇందులోని ట్విస్ట్‌లు, టర్న్‌లు సూపర్బ్‌గా ఉంటాయి. ఒక పోలీస్ ఆఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. ఇందులో మొత్తం ఐదు పాటలుంటాయి. ముందు రెండు సాంగ్స్ అనుకుని స్టార్ట్ చేశాం. కళ్లారా చూసాలే అనేది కాజల్, నవీన్ చంద్ర మధ్య వచ్చే లవ్ సాంగ్, వెతుకు వెతుకు కీరవాణి పాడారు. ఇది కాజల్ కేసు ఇన్వెస్టిగేషన్ నేపథ్యంగా ఉంటుంది. ఒక ఇంగ్లీష్ సాంగ్ చేశాం. మిగతా లిరికల్ సాంగ్స్ త్వరలో రిలీజ్ చేస్తాం' అని అన్నారు.

నవచిత్రం

ఆ రోజులు మళ్ళీ రావు..



పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీ రాధ దామోదర్ స్టూడియో బ్యానర్లపై నిహారిక కొణిదెల సమర్పణలో 'కమిటీ కుర్రోళ్లు' అనే చిత్రాన్ని పద్మజ కొణిదెల, జయలక్ష్మీ అడపాక నిర్మించారు. ఎద వంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు.

ఈ చిత్రం నుంచి ఇప్పటికే రిలీజైన పాట, పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఓ ఫీల్ గుడ్ పాటను రిలీజ్ చేశారు. నాటి రోజుల్లోకి తీసుకెళ్లేలా ఉన్న 'ఆ రోజులు మళ్లీ రావు' అనే ఈ పాటను సింగర్ కార్తిక్ ఆలపించారు. కృష్ణ కాంత్ రాసిన ఈ పాట మన మూలాల్ని గుర్తు చేసేలా ఉన్నాయి. అనుదీప్ దేవ్ బాణీ ఎంతో క్యాచీగా, వినసొంపుగా, హాయిగా ఉంది. ఈ లిరికల్ వీడియోని చూస్తే మళ్లీ మన ఊర్లోకి వెళ్లాలని అనిపించేలా ఉంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా రాజు ఎడురోలు వ్యవహరిస్తున్నారు. అనుదీప్ దేవ్ సంగీతం సమకూరుస్తుండగా, ఎడిటర్‌గా అన్వర్ అలీ పని చేస్తున్నారు. టీ సిరీస్ ద్వారా ఈచిత్రంలోని పాటలు విడుదల కానున్నాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - రాజు ఎడురోలు, ప్రొడక్షన్ డిజైనర్ - ప్రణయ్ నైని, డైలాగ్స్ - వెంకట సుభాష్ చీర్ల, కొండల రావు అడ్డగళ్ల, ఫైట్స్ - విజయ్, నృత్యం - జె.డి మాస్టర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - మన్యం రమేష్.



ఆ నమ్మకమే భారతీయుడు 2 : శంకర్

కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌తో పాటు రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన చిత్రం 'భారతీయుడు 2'. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న ఈ చిత్రం గ్రాండ్ లెవల్లో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చెన్నైలో సినీ ప్రముఖులు సమక్షంలో ఆడియో వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హీరో శింబు, డైరెక్టర్ లోకేష్ కనకరాజ్, నెల్సన్, నిర్మాత ఏ ఎం రత్నం, ఏసియన్ సినిమాస్ సునీల్ నారంగ్, భరత్ నారంగ్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

దర్శకుడు శంకర్ మాట్లాడుతూ, 'ఈ రోజే ఫైనల్ మిక్సింగ్ విన్నాను. అనిరుధ్ మ్యాజిక్ చేశాడు. సరికొత్త ఎనర్జీ వచ్చింది. ఆడియెన్స్‌కి కూడా సినిమా చూశాక అదే ఎనర్జీ వస్తుంది. ఇండియన్ టైంలోనే కమల్ హాసన్ సీక్వెల్ తీద్దామని అన్నారు. కానీ అప్పుడు నా దగ్గర సరైన కథ లేదు. చాలా ఏళ్లకు పేపర్స్‌లో లంచం వల్ల జరిగే ఘోరాలు, అన్యాయాలు చూసి కథ రాసుకున్నాను. మొదటి రోజు షూటింగ్‌లో ఇండియన్ 2 గెటప్‌లో కమల్ హాసన్ చూసి అంతా షాక్ అయ్యాం. 28 ఏళ్ల క్రితం ఎలా అనిపించిందో.. ఇప్పుడు కూడా అలాంటి ఫీలింగ్ కలిగింది. 70 రోజుల పాటు మేకప్‌తో నటించారు. ఆయనలాంటి యాక్టర్ ఈ ప్రపంచంలోనే లేరు. ఎస్ జే సూర్య, సముద్రఖని, సిద్దార్థ్, బాబీ సింహా, మనోబాలా, వివేక్, కాజల్, రకుల్ అద్భుతంగా నటించారు. లైకా సుభాస్కరన్ ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు' అని తెలిపారు.

'భారతీయుడు 2' మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి.

'28 ఏళ్ల క్రితం 'ఇండియన్' సినిమా టైంలో నేను శివాజీ గణేశన్‌తో ఓ సినిమా చేయాలి. ఆ టైంలోనే శంకర్ ఇండియన్ కథతో వచ్చారు. రెండు కథలు కొంచెం దగ్గరదగ్గరగా ఉన్నాయి. అదే విషయాన్ని శివాజీ గణేశన్‌తో చెప్పాను. 'శంకర్‌తోనే సినిమా చేయండి.. ఆయన ఆల్రెడీ ఓ సినిమాను తీశారు. మనం ఇప్పటికే ఎన్నో సినిమాలు కలిసి చేశాం' అని నాతో ఆయన అన్నారు. ఆయన అన్న ఒక్క మాటతో, ఆ నమ్మకంతోనే శంకర్‌తో ఇండియన్ సినిమా చేశాను. ఏ.ఎం రత్నం సినిమాను అద్భుతంగా నిర్మించారు. ఇండియన్ 2 ప్రాజెక్ట్ ఇక్కడి వరకు వచ్చిందంటే లైకా అధినేత సుభాస్కరన్ కారణం. ఆయన మాపై పెట్టిన నమ్మకమే ఈ చిత్రం. ఆయన నమ్మకానికి తగ్గట్టుగానే ఈ సినిమాను మేం చేశాం.

\- కమల్‌హాసన్

అద్భుతమైన కంటెంట్



యానీయా, అంకిత, అజయ్ ప్రధాన పాత్రలలో స్టీఫెన్ పల్లం స్వీయ దర్శక నిర్మాణంలో రూపొందుతున్న ఇండియన్ సూపర్ ఉమన్ మూవీ 'ఇంద్రాణి - ఎపిక్ 1': ధరమ్ అండ్ కరమ్.

శ్రేయ్ మోషన్ పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కేకే రెడ్డి, సుధీర్ వేల్పుల, జే సేన్ సహ నిర్మాతలు. ఈనెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ చిత్ర ట్రైలర్‌ని లాంచ్ చేశారు.

డైరెక్టర్ స్టీఫెన్ పల్లం మాట్లాడుతూ, 'ఇంద్రాణి' ఒక ఎపిక్ లాంటి సినిమా. చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. టాప్ క్లాస్ వీఎఫ్ఎక్స్ వర్క్ ప్రేక్షకులను అలరిస్తుంది. ఇందులో లీడ్ రోల్‌తో పాటు ఒక రోబోని కూడా క్రియేట్ చేశాం. ఆ ఇద్దరి జర్నీ చాలా అద్భుతంగా ఉంటుంది. ఇందులో టైం ట్రావెల్ కాన్సెప్ట్ కూడా ఉంది. వందేళ్ళ తర్వాత ఎలాంటి టెక్నాలజీ ఉండబోతుందో ఇందులో చూపించాం. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుంది. ఇంద్రాణి మాస్ మర్వెల్. అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించే కంప్లీట్ ఎంటర్‌టైనర్' అని అన్నారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



గెటప్ శ్రీను 'రాజు యాదవ్' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. కృష్ణమాచారి దర్శకునిగా, సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె. ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాత బన్నీ వాస్ ఏపీ, తెలంగాణలో గ్రాండ్‌గా విడుదల చేశారు. మే 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఘన విజయం సాధించి థియేటర్స్‌లో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ని నిర్వహించింది.

హీరో గెటప్ శ్రీను మాట్లాడుతూ, 'రాజు యాదవ్‌కి ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. థియేటర్స్ విజిట్‌కి వెళ్ళినప్పుడు ఆడియన్స్ గుండెలు బరువెక్కాయని చెప్పడం చాలా ఎమోషనల్‌గా అనిపించింది. వారి నుంచి వచ్చిన రెస్పాన్స్ రియల్ సక్సెస్‌గా భావిస్తున్నాను. ఈ సినిమాని ఇంత భారీ స్థాయిలో ప్రేక్షకులు వద్దకు తీసుకెళ్ళిన మా బన్నీవాస్‌కి థ్యాంక్స్. దర్శకుడు కృష్ణమాచారి చాలా పాషన్‌తో ఈ సినిమా చేశారు. ఈ సక్సెస్ ఆయకే వెళ్ళాలి. సినిమా విషయంలో నిర్మాతలు చాలా హ్యాపీగా ఉన్నారు. నాలుగో రోజే బ్రేక్ ఈవెన్ అవ్వడం ఆనందంగా ఉంది. ఇంత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని తెలిపారు.

'సినిమాకి అన్ని చోట్ల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చాలా ఆనందాన్ని ఇస్తోంది. ప్రేక్షకులు రాజు యాదవ్‌కు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతున్నారు. చూసిన వారంతా చాలా బావుందని అభినందిస్తున్నారు' అని డైరెక్టర్ కృష్ణమాచారి చెప్పారు.

నిర్మాత ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ,'ఇంత అద్భుతంగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులు ధన్యవాదాలు. మంచి సినిమా తీసినందుకు గర్వంగా ఉంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.